ఆంధ్రజ్యోతి
నవ్య డాక్టర్
మంగళవారం • 30 ఏప్రిల్ 2024

ఫ్రూట్ డైట్, మిల్లెట్ డైట్, ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్, కీటో, పాలియో... ఇలాంటి డైట్లను దీర్ఘ కాలం పాటు కొనసాగించడం కష్టం. కాబట్టి వీటికి బదులుగా హైపో క్యాలరిక్ డైట్ (శరీరం ఖర్చు చేసే క్యాలరీ కంటే, తక్కువ క్యాలరీలున్న ఆహారం) అనుసరించాలి.



లివర్ కేర్



సమతులాహారం, వ్యాయామం... ఇవి రెండూ కాలేయానికి ప్రాణ స్నేహితులు. ఈ రెండింటి మీదా దృష్టి పెడితే కాలేయాన్ని దెబ్బ తీసే ఫ్యాటీ లివర్, లివర్ కేన్సర్ లాంటి శత్రువులు దరి చేరకుండా ఉంటాయంటున్నారు వైద్యులు.

కాలేయం కులాసాగా..

కాలేయానికి సంబంధించిన సమస్య కామెర్లు అనే విషయం మనందరికీ తెలుసు. లక్షణాలను బట్టి కామెర్లను కనిపెట్టేసి, కొద్ది రోజుల పాటు జాగ్రత్తలు పాటించి నయమైపోయిందని అనుకుంటూ ఉంటాం. కానీ ఎన్నో రకాల కాలేయ వ్యాధులు కామెర్ల రూపంలోనే బయల్పడుతూ ఉంటాయి. కాబట్టి మూల కారణాన్ని కనిపెట్టడం అవసరం. ప్రధానంగా రెండు రకాల వైరస్‌ల మూలంగా కామెర్లు వస్తూ ఉంటాయి. కలుషితాహారంతో సోకే హెపటైటిస్ 'ఎ'వైరస్ పిల్లలకు సోకితే, హెపటైటిస్ 'ఇ' వైరస్ పెద్దలకు సోకుతూ ఉంటుంది. కొన్ని సందర్భాల్లో కొన్ని రకాల మందుల వల్ల కూడా కాలేయం దెబ్బతిని, కామెర్ల రూపంలో సమస్య బయల్పడుతూ ఉంటుంది. ఫైబ్రోసిస్ లేదా స్కార్ టిష్యూ కలిగి ఉన్న కాలేయ సమస్య క్రానిక్ హెపటైటిస్. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే అది సిర్రోసిస్‌గా మారి, అంతిమంగా లివర్ ఫెయిల్యూర్‌కు దారి తీస్తుంది. కాలేయ కేన్సర్ కూడా కామెర్లతోనే బయటపడుతుంది. కాబట్టి కామెర్లకు మూల కారణాన్ని కనిపెట్టి, తదనుగుణ చికిత్స తీసుకోవడం అవసరం.

అపోహలు వీడాలి

కామెర్లు సోకితే పత్యం ఉంటూ ఉంటాం. కానీ నిజానికి జబ్బుపడిన కాలేయం త్వరగా కోలుకోవడం కోసం బలవర్థకమైన ఆహారం తీసుకోవడం అవసరం. కామెర్లు సోకినప్పుడు గ్లూకోజ్, చెరకు రసం, నూనె, ఉప్పు, కారం లేకుండా వండిన పదార్థాలు, పెరుగన్నం తీసుకుంటూ ఉంటాం. కానీ ఈ సమయంలో ఎక్కువ క్యాలరీలుండే ఆహారం తీసుకోవాలి. కామెర్లు సోకిన వాళ్లందరూ ఇంట్లో వండిన, సాధారణ వంటకాలన్నింటినీ తినవచ్చు. ప్రధానంగా మాంసాహారానికి బదులుగా శాకాహారం తీసుకోవాలి. మాంసాహారం తేలికగా అరగదు కాబట్టి కాలేయం మీద అదనపు భారం పడకుండా ఉండడం కోసం సమస్య అదుపులోకొచ్చేవరకూ మాంసాహారానికి దూరంగా ఉండాలి.

తీవ్ర కాలేయ సమస్యలో...

క్రానిక్ లివర్ డిసీజ్ మొదటి దశలో, స్కార్ ఏర్పడినా కాలేయం సమర్థంగానే పని చేస్తూ ఉండవచ్చు. రెండో దశలో కాలేయం పనిచేయడం మందగించే స్థితికి చేరుకుంటుంది. ఈ దశలో పొట్ట వాపు ఉంటుంది. నిస్సత్తువ కూడా వేధిస్తుంది. ఆకలి కూడా తగ్గుతుంది. చివరి దశలో కాలేయం పని చేయడం మానేస్తుంది. పొట్ట, కాళ్ల వాపు, మైకం, చిగుళ్ల నుంచి రక్తస్రావం లాంటి లక్షణాలు ఈ దశలో ఉంటాయి. లివర్ ఫెయిల్యూర్ దశకు చేరుకున్న వాళ్లకు కాలేయ మార్పిడి ఒక్కటే పరిష్కారం. కాబట్టి కాలేయ సమస్యను తొలి దశలోనే కనిపెట్టి సమర్థమైన చికిత్స తీసుకోవాలి. కాలేయ కేన్సర్ సమస్య క్రమేపీ పెరుగుతోంది. ఇంతకు ముందు హెపటైటిస్ 'బి' వల్ల కేన్సర్ తలెత్తితే, ప్రస్తుతం ఫ్యాటీ లివర్ డిసీజ్ కారణంగా కేన్సర్ బారిన పడుతున్న సందర్భాలు పెరుగుతున్నాయి. అల్ట్రాసౌండ్ స్కాన్ చేసుకున్న వాళ్లలో ఎక్కువ మందికి ఫ్యాటీ లివర్ ఉంటూ ఉంటుంది. కాబట్టి ఇదంత పట్టించుకోవలసిన విషయం కాదనే ఒక ధోరణి సర్వత్రా పెరిగిపోయింది. దాంతో ఆ సమస్యను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ ఇదే సమస్య అంతిమంగా కాలేయ కేన్సర్‌కు దారి తీస్తుందనే విషయం అందరూ గుర్తుపెట్టుకోవాలి. మెటబాలిక్ సిండ్రోమ్, మధుమేహం, డిస్‌లిపిడీమియా, హైపర్‌గ్లిసరైడీమియా, అధిక రక్తపోటు, ఒబేసిటీ, విల్సన్స్ డిసీజ్... ఫ్యాటీ లివర్‌కు ప్రధాన కారణాలు. కాబట్టి ఫ్యాటీ లివర్ కేన్సర్‌కు దారి తీయకుండా ఉండాలంటే, అందుకు మూల కారణాలను సరిదిద్దుకోవాలి.



నాటు మందులు వద్దు

కామెర్లకు నాటుమందులు వాడడం ప్రమాదకరం. వాటిలోని హెవీ మెటల్స్ కాలేయానికి కీడు చేసి, సమస్యను తీవ్రతరం చేస్తాయి. నాటుమందులు తీసుకోవడం వల్ల ప్రయోజనం లేకపోగా, కాలేయం మరింత దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. కాబట్టి నాటు మందుల జోలికి వెళ్లకుండా అవసరాన్ని బట్టి వైద్యుల సూచన మేరకు నడుచుకోవాలి. ఒకవేళ పదే పదే కామెర్లు వేధిస్తున్నా, నిస్సత్తువ, ఆకలి మందగించడం లాంటి లక్షణాలు కనిపిస్తున్నా కాలేయ వ్యాధిగా పరిగణించి, వైద్యులను ఆశ్రయించాలి.

సప్లిమెంట్లు వద్దు

ఏం తిన్నా కాలేయానికి చేరుతుంది. కాబట్టి అదనపు హెల్త్ సప్లిమెంట్లు, ప్రొటీన్ పౌడర్ల వాడకం మానేయాలి. వైద్యులు సూచించనిదే ఎలాంటి సొంత వైద్యం చేసుకోకూడదు. శరీర బరువు తగ్గించుకోవాలన్నా, పెంచుకోవాలన్నా ఆ ఫలితం ఆహారం ద్వారా దక్కేలా చూసుకోవాలి. శరీర బరువులో ప్రతి కిలోకు 20 నుంచి 30 కిలోక్యాలరీల చొప్పున లెక్కించి, సరిపడా క్యాలరీలున్న ఆహారం తీసుకోవాలి. అలాగే ఒక కిలో శరీర బరువుకు ఒకటి నుంచి ఒకటిన్నర గ్రాము ప్రొటీన్ అందేలా చూసుకోవాలి. అలాగే ఉప్పు, రోజుకు 4 నుంచి 5 గ్రాములకు మించకుండా చూసుకోవాలి.

బరువు తగ్గాలి

అధిక బరువును ఆహార నియమాలతో, వ్యాయామంతో తగ్గించుకోవాలి. అయితే బరువు తగ్గడం కోసం నచ్చిన డైట్‌లను అనుసరించేవాళ్లు ఉంటారు. కొందరు ఫ్రూట్ డైట్, మిల్లెట్ డైట్, ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్, కీటో, పాలియో... ఇలాంటి డైట్లను దీర్ఘకాలం పాటు కొనసాగించడం కష్టం. కాబట్టి వీటికి బదులుగా హైపో క్యాలరిక్ డైట్ (శరీరం ఖర్చు చేసే క్యాలరీ కంటే, తక్కువ క్యాలరీలున్న ఆహారం) అనుసరించాలి. ఉదాహరణకు 10 నుంచి 15% అదనపు బరువు ఉన్నవాళ్లు, రోజులో తీసుకునే ఆహారంలో 300 నుంచి 500 కిలోక్యాలరీలను తగ్గించుకోవాలి. అలాగే ఎవరు, ఎంత సమయం పాటు వ్యాయామం చేయాలనేది వాళ్ల వయసు, గుండె గరిష్ఠ వేగం మీద ఆధారపడి ఉంటుంది. వారంలో 150 నుంచి 180 నిమిషాల పాటు కార్డియో వ్యాయామాలు చేయాలి. 50 నుంచి 75 నిమిషాల పాటు రెసిస్టెన్స్ ట్రైనింగ్ చేయాలి. అలాగే అధిక బరువును నెమ్మదిగా, స్థిరంగా తగ్గించుకోవాలి. కాలేయంలో స్కార్ టిష్యూ ఉన్నవాళ్లు శరీర మొత్తం బరువులో 10% బరువును తగ్గించుకోవాలి. ఉదాహరణకు 100 కిలోల బరువున్నవాళ్లు, ఆరు నుంచి తొమ్మిది నెలల వ్యవధిలో పది కిలోల బరువు తగ్గడం లక్ష్యంగా పెట్టుకోవాలి.

డాక్టర్ ధర్మేష్ కపూర్
సీనియర్ హెపటాలజిస్ట్ అండ్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్,
యశోద హాస్పిటల్స్,
సికింద్రాబాద్.



హెల్త్ వెల్త్



ఈ వేసవి ప్రతాపంతో ఒంట్లోని ఓపిక కంతా ఆవిరైపోతోంది. వేడి వాతావరణాన్ని తట్టుకోలేక నీరసం ఆవహిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం!

ఎండల్లో చలచల్లగా...

వేసవిలో వేడి సహజం. ఫలితంగా శరీరంలోనూ వేడి పుడుతుంది. దాంతో అలసట, బడలిక కలుగుతాయి. విపరీతమైన స్వేదం, చర్మం పొడిబారడం, తలనొప్పి, మగత, ఒళ్లు నొప్పులు లాంటి లక్షణాలు కూడా కనిపించవచ్చు. ఈ లక్షణాలన్నీ ఒంట్లో వేడి పెరగడం వల్ల కలిగేవే!

ఎండ ప్రభావం

ఎండ వేడిమికి శరీర ఉష్ణోగ్రత క్రమేపీ పెరుగుతూ 104 డిగ్రీలకు చేరుకుంటే ఎండదెబ్బకు గురవుతాం! అత్యధిక ఉష్ణోగ్రతలకు గురయినా లేక వేడి వాతావరణంలో శారీరక శ్రమ వల్ల శరీర ఉష్ణోగ్రత ఆ మేరకు చేరుకున్నా ఎండదెబ్బకు గురవడం సహజం. ఈ రెండు సందర్భాలను వివరంగా చెప్పుకోవాలంటే...

■ **వేడి వాతావరణానికి బహిర్గతం కావడం:** ఎక్కువ సమయంపాటు ఎండలో గడపడం వల్ల శరీర కేంద్ర ఉష్ణోగ్రత (కోర్ టెంపరేచర్) పెరుగుతుంది. ఇలాంటి స్థితి వేడిగా, తేమగా ఉన్న వాతావరణంలో ఎక్కువ సమయంపాటు గడపడం వల్ల సంభవిస్తుంది.

■ **శారీరక శ్రమ:** వేడి వాతావరణంలో అత్యధిక శారరీక శ్రమకు గురయినా శరీర కేంద్ర ఉష్ణోగ్రత విపరీతంగా పెరిగి ఎండదెబ్బకు గురవుతాం. ఆ స్థితిలో అయోమయం, స్పృహ కోల్పోవడం, వాంతులు, ఒళ్లు వేడిగా మారడం, శ్వాస, గుండె కొట్టుకునే వేగం నెమ్మదించడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

కారణాలు

ఎలాంటి ఎండదెబ్బకు గురయినా అందుకు పలు కారణాలు ఉంటాయి. వాటిలో ప్రధానమైనవి ఏవంటే...

■ గాలి ధారాళంగా చొరబడని దుస్తులు, చమటను పీల్చుకునే వీలు లేని దుస్తులు ధరించడం. వేడిని గ్రహించే వీలున్న నల్ల దుస్తులు ధరించడం.

■ మద్యం తీసుకోవడం. మద్యం తాగడం వల్ల ఉష్ణోగ్రతను క్రమబద్ధం చేసే శక్తి శరీరం కోల్పోతుంది.

■ స్వేదం ద్వారా శరీరం కోల్పోయిన నీటిని భర్తీ చేయకపోవడం.

నివారణ తేలికే!

ఎండదెబ్బకు గురయి బాధ పడేకంటే, ఆ స్థితి రాకుండా జాగ్రత్త పడడం మేలు. వేసవి వేడి, ఎండల ప్రభావానికి గురవకుండా ఉండాలంటే ఈ జాగ్రత్తలు పాటించాలిజ

■ **దుస్తులు:** ధరించే దుస్తులు తేలికగా, గాలి చొరబడేలా, చమట పీల్చేలా సౌకర్యంగా ఉండాలి. వీలైనంతవరకూ తెల్లని దుస్తులే ధరించాలి.

■ **సూర్యరశ్మి:** సూర్యరశ్మి నేరుగా సోకితే, శరీరం తనంతట తాను చల్లబడే స్వభావాన్ని కోల్పోతుంది. కాబట్టి ఎండలో బయటకు వెళ్లవలసివస్తే తలకు టోపీ, కళ్లకు చలువ కళ్లద్దాలు, గొడుగు తప్పనిసరిగా వాడాలి. వైద్యులు సూచించే సన్‌స్ర్కీన్ వాడడం వల్ల చర్మం కమిలిపోకుండా, పొడిబారకుండా ఉంటుంది.

■ దాహం వేసేవరకూ ఆగకుండా గంటకొకసారి నీళ్లు తాగుతూ ఉండాలి. నీళ్లతోపాటు కొబ్బరినీరు, మజ్జిగ కూడా తరచుగా తాగుతూ ఉండాలి. ఇలా ఒంట్లో నీటి పరిమాణాన్ని సక్రమంగా ఉంచుకుంటే ఎండ ప్రభావం నుంచి తప్పించుకోగలుగుతాం.

■ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఎండ తీవ్రత ఎక్కువ. కాబట్టి ఆ సమయాల్లో నీడ పట్టున గడపాలి. వ్యాయామానికి ఎండ లేని సమయాలను కేటాయించాలి.

దాహం తీరట్లేదా?

ఎన్ని నీళ్లు తాగినా దాహం తీరదు. ఏం చేయాలో అర్థం కాదు. వేసవిలో కొందరి పరిస్థితి ఇది. ఇలా మీకూ అనిపిస్తూ ఉంటే, గ్లాసుడు నీళ్లలో ఒక స్పూను తేనె కలుపుకుని తాగి చూడండి. ఆ తర్వాత తాగే నీళ్లతో మీ దాహం తీరడం ఖాయం. అన్నట్టు, చల్ల నీళ్లతో దాహం తీరదు. ఫ్రిజ్‌లో నుంచి గడ్డకట్టిన నీళ్ల బాటిల్ తీసి తాగటం వృథా! అతి చల్లని నీళ్లు జీర్ణమై రక్తంలో కలవడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఆలోగా ఒంట్లోని ప్రతి కణం దాహార్తితో అల్లాడిపోతుంది. కాబట్టి జీర్ణాశయం ఉష్ణోగ్రతకు దగ్గరగా ఉండేలా గోరు వెచ్చని నీళ్లు తాగితే దాహం తీరుతుంది.

చెమట పొక్కులకు చక్కని చిట్కాలు

వేసవిలో చెమటను భరించటమే కష్టం. దీనికి చెమట పొక్కులు తోడైతే ఇక ఆ చిరాకును మాటల్లో చెప్పలేం. ఈ చెమట పొక్కులు మంట పెట్టకుండా ఉండాలంటే ఈ చిట్కాలు పాటించాలి.

■ మెత్తగా పొడి చేసిన ఓట్లను చల్లని నీళ్లతో నింపిన స్నానాలతొట్టిలో వేసి కలపాలి. నీళ్లు పాల రంగులోకి మారాక స్నానాలతొట్టిలో 30 నిమిషాలు సేదతీరాలి. తర్వాత మెత్తని టవల్‌తో తడి అదుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే చెమట పొక్కులు వదులుతాయి.

■ వస్త్రంలో ముంచు ముక్కలు మూటగట్టి సమస్య ఉన్న ప్రదేశంలో 5 నుంచి 10 నిమిషాలపాటు ఉంచాలి. ఇలా ప్రతి నాలుగు గంటలకోసారి చేస్తూ ఉంటే 3 రోజులకి చెమట పొక్కులు మరింత పాకకుండా తగ్గిపోతాయి.

■ గంధం పొడి, గులాబీనీరు సమపాళ్లలో కలిపి సమస్య ఉన్న ప్రదేశంలో పూయాలి. పూర్తిగా ఆరాక చల్లని నీళ్లతో కడిగేయాలి.

■ ఒక కప్పు చల్లని నీళ్లలో ఒక టీస్పూను బేకింగ్ సోడా కలిపి, ఆ నీళ్లలో పలుచని వస్త్రం నానబెట్టి పిండేయాలి. దీన్ని చెమట పొక్కుల మీద 10 నిమిషాలు ఉంచినా ఉపశమనం కలుగుతుంది.

■ ముల్తాని మట్టికి రోజ్‌వాటర్ చేర్చి ముద్దలా చేయాలి. దీన్ని చెమట పొక్కుల మీద పూసి ఆరాక చల్లని నీళ్లతో కడిగేయాలి.

■ లేత వేప ఆకుల్ని మెత్తగా నూరి పూసి ఆరాక చల్లని నీటితో కడిగేసుకున్నా ఫలితం ఉంటుంది.

ఆరోగ్య సూత్రాలు

పరిపూర్ణ ఆరోగ్యం కోసం...

ఆరోగ్య సూత్రాలన్నీ అందరూ అనుసరించడానికి తగ్గట్టుగా సులభంగానే ఉంటాయి. అవేంటంటే...

- మద్యం విషంతో సమానం. ఆ అలవాటును వీలైనంత మేరకు తగ్గించేయాలి
- పీనట్ బటర్‌లో ప్రొటీన్లు తక్కువ. కాబట్టి ఆ అపోహను వదిలించుకోవాలి.
- నెమ్మదిగా తినడం అలవాటు చేసుకోవాలి. ఆకలి తీరిన తృప్తిని అందించే లెప్టిన్ హార్మోన్ విడుదలయ్యే సమయాన్నివ్వడం కోసం ఆహారాన్ని నెమ్మదిగా తినాలి
- వేగంగా క్యాలరీలను కరిగించడం కోసం కార్డియో చేయాలి. విశ్రాంత స్థితిలో మెటబాలిజాన్ని పరుగులు పెట్టించడం కోసం వెయిట్ ట్రైనింగ్ చేయాలి
- వీలైనన్ని పండ్లను తినొచ్చు. అవసరానికి మించి పండ్లను తినడం ఎవరి వల్లా కాదు
- బ్లాక్ కాఫీ, మంచి నీళ్లు ఆకలిని అరికడతాయి
- భోజనం తర్వాత చిరుతిళ్ల జోలికి వెళ్లకుండా ఉండడం కోసం, తిన్న వెంటనే బ్రష్ చేయాలి
- ఆహార పరిమాణం మన లుక్స్‌ను, ఆహార నాణ్యత మన మనసునూ ప్రభావితం చేస్తాయి
- వ్యాయామం చేయడానికి ఒళ్లు బద్ధకిస్తుంటే, వ్యాయామానికి ఉదయం వేళలే కేటాయించాలి
- గుడ్లు సూపర్‌ఫుడ్. కాబట్టి వాటిని క్రమం తప్పకుండా తింటూ ఉండాలి
- ద్రవ రూప క్యాలరీలు తగ్గించాలి. కూల్‌డ్రింక్స్, మిల్క్‌షేక్‌లు మానుకోవాలి
- కండరాలను పెంచడం ద్వారా మెటబాలిజంను పెంచవచ్చు
- అత్యధిక ప్రొటీన్ డైట్ అన్నిటికంటే ఉత్తమ డైట్
- నిద్రలేమి తర్వాతి రోజు ఆకలి హార్మోన్ల స్రావాన్ని పెంచుతుంది. కాబట్టి కంటి నిండా నిద్రపోవాలి
- 80% సహజసిద్ధ ఆహారాన్ని తిన్నంత కాలం పిజ్జా, బర్గర్, ఐస్‌క్రీమ్.... ఏది తిన్నా బరువు పెరగం
- సూర్యరశ్మి... మంచి నిద్రకూ, మానసిక ఆరోగ్యానికీ, ఎముకల దృఢత్వానికీ చర్మ ఆరోగ్యానికీ తోడ్పడుతుంది.



'దిక్సూచి' వెబ్ పేజీలో... సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/TwcJDKO లో చదవండి.

గుడ్ ఫుడ్

వెలగ పండు తింటే?

వెలగ పండు ఎంతో అరుదుగా తింటూ ఉంటాం. విలువైన పోషకాలతో కూడిన ఈ పండును తరచుగా తింటూ ఉంటే, పోషక లోపాలు దరి చేరకుండా ఉంటాయి. ఈ పండులో...

- రోగనిరోధకశక్తిని పెంచే సి విటమిన్‌తో పాటు, గుండె ఆరోగ్యాన్ని కాపాడే పొటాషియం కూడా సమృద్ధిగా ఉంటుంది. అలాగే ఎముకల దృఢత్వానే పెంచే క్యాల్షియం కూడా ఈ పండులో మెండుగా ఉంటుంది.
- వెలగపండులోని పీచు పెద్ద పేగుల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. మలబద్ధకాన్ని తొలగించి, సుఖవిరోచనానికి తోడ్పడుతుంది. దీన్లోని సహజసిద్ధ లాక్సేటివ్స్ అయిన టానిన్లు, పేగుల కదలికలకు తోడ్పడతాయి.
- దీన్లో క్యాలరీలు తక్కువ, పీచు ఎక్కువ. కాబట్టి బరువు తగ్గాలనుకునేవాళ్లు ఈ పండును తరచూ తినవచ్చు. ఈ పండులోని ఫైబర్‌తో ఆకలి దరి చేరకుండా ఉంటుంది కాబట్టి బరువు తగ్గడం కోసం ప్రయత్నించే ఊబకాయులకు వెలగపండు ఉపయోగకరం.



ఫుడ్ ఫ్యాక్ట్

లవణ రహస్యం

ఖనిజ లవణాల పరిమాణం, ప్రాసెస్ ప్రక్రియల ఆధారంగానే లవణాన్ని ఆరోగ్యకరమైన లవణంగా పరిగణిస్తూ ఉంటారు. అయితే అన్ని రకాల లవణాల్లో సోడియం పరిమాణం సమానంగానే ఉన్నప్పటికీ కొన్నింటిలో ట్రేస్ మినరల్స్ అదనంగా ఉండడంతో పాటు, వాటిని ప్రాసెస్ చేసే ప్రక్రియ కూడా భిన్నంగా ఉంటుంది. కాబట్టి లవణాలు, రకాల గురించి తెలుసుకుందాం!



- **హిమాలయన్ పింక్ సాల్ట్:** లేత గులాబీ రంగులో ఉండే ఈ లవణంలో పొటాషియం, మెగ్నీషియం, క్యాల్షియం లాంటి ట్రేస్ మినరల్స్ కూడా ఉంటాయి. ఇవి పరిపూర్ణ ఆరోగ్యానికి తోడ్పడతాయి.
- **సీ సాల్ట్:** సముద్రపు ఉప్పులో సముద్ర సంబంధ ఖనిజ లవణాలుంటాయి. కానీ దైనందిన వాడకం ద్వారా పింక్ సాల్ట్‌కు మించిన ఆరోగ్య ప్రయోజనాలు దీనితో పొందే అవకాశం ఉండదు.
- **పొటాషియం సాల్ట్:** సాధారణ టేబుల్ సాల్ట్ కంటే పొటాషియం సాల్ట్‌లో 70% తక్కువ సోడియం ఉంటుంది. పొటాషియం ఎక్కువగా ఉంటుంది కాబట్టి హృద్రోగులకు ఈ ఉప్పు ఉపయోగకరం.
- **టేబుల్ సాల్ట్:** సముద్రపు నీరు, ఉప్పు కయ్యల నుంచి తయారయ్యే టేబుల్ సాల్ట్‌ను తెల్లగా, జారుడుగా మార్చడం కోసం దాన్లోని మలినాలను తొలగించి, యాంటీ కేకింగ్ ఏజెంట్లను జోడిస్తారు. అయొడిన్ లోటును భర్తీ చేయడం కోసం అయొడిన్‌ను కూడా జోడిస్తారు.

ఏ ఉప్పు తీసుకున్నా దాన్లో ఉండే సోడియం మోతాదు ఒకేలా ఉంటుంది కాబట్టి ఉప్పును వీలైనంత పరిమితంగా వాడుకోవాలి.

సమ్మర్ కేర్

పొట్ట చల్లగా...

వేసవిలో వేడి వేడిగా తినాలని అనిపించదు. శరీరాన్ని చల్లబరిచే చలచల్లని పదార్థాల వైపు మనసు లాగుతూ ఉంటుంది. అయితే ఐస్‌క్రీమ్‌లు, కూల్‌డ్రింక్‌లు లాంటి వాటితో ఒంటిని చల్లబరుచుకోడానికి బదులుగా, బ్రేక్‌ఫాస్ట్‌లో పులిసిన పెరుగన్నం ట్రై చేయాలి.

రాత్రి మిగిలిపోయిన అన్నం పారేయకుండా ఒక మట్టి పాత్రలో వేసి, గోరువెచ్చని పాలు, చెంచా పెరుగు, ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు వేసి కలిపి మూత పెట్టాలి. ఉదయానికి చక్కగా గడ్డకట్టి కమ్మని పెరుగన్నం తయారవుతుంది. దీన్లో ఉప్పు కలుపుకుని నేరుగా తినొచ్చు. లేదంటే ఆవాలు, మెంతులు, జీలకర్ర, మినపప్పు, కరివేపాకులతో తాలింపు వేసుకుని తినొచ్చు. ఈ పెరుగన్నం ఎండ వేడి నుంచి శరీరాన్ని చల్లబరచడమే కాకుండా, జీర్ణాశయానికి శక్తినిచ్చి, జీర్ణశక్తిని పెంచుతుంది. తేలికగా అరుగుతుంది కాబట్టి పెద్దలు కూడా నిస్సంకోచంగా తినొచ్చు.



ఇప్పటికీ నగదే రారాజు

ఆర్థిక వ్యవస్థలో చలామణిలో ఉన్న నగదు రెట్టింపు

ఏటీఎంల నుంచి సగటున నెలకు రూ.1.43 కోట్లు విత్‌డ్రాయల్స్



న్యూఢిల్లీ: పెద్ద నోట్ల రద్దు, యూపీఐ చెల్లింపుల వంటి మార్పులెన్ని వచ్చినా.. దేశంలో ఇప్పటికీ కరెన్సీ నోట్లదే హవా. 2017 మార్చిలో ఆర్థిక వ్యవస్థలో రూ.13.35 లక్షల కోట్లుగా ఉన్న నగదు చలామణి (సీఐసీ) 2024 మార్చి నాటికి రూ.35.15 లక్షల కోట్లకు చేరడమే ఇందుకు సాక్ష్యం. బ్యాంక్ ఖాతాదారులూ, ఏటీఎంల నుంచీ పెద్ద మొత్తంలో నగదు విత్‌డ్రా చేస్తున్నారు. వీరు గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఒక్కో ఏటీఎం నుంచి నెలకు సగటున రూ.1.43 కోట్ల వరకు నగదును విత్‌డ్రా చేశారు. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోలిస్తే ఇది 5.51 శాతం ఎక్కువని సోమవారం వెలువడిన 'సీఎంఎస్ కన్‌జంప్షన్ రిపోర్ట్' తెలిపింది. రూ.2,000 నోట్లలో 97.83 శాతం బ్యాంకుల్లో డిపాజిట్ అయినప్పటికీ దేశంలో నగదు వినియోగం పెరగడం విశేషం.

మెట్రోల్లో మరింత ఎక్కువ

దేశంలోని మెట్రో నగరాల్లో నగదు వినియోగం మరింత ఎక్కువగా ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే మెట్రో నగరాల్లో ఏటీఎంల నుంచి నగదు విత్‌డ్రాయల్స్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 10.37 శాతం పెరిగాయి. ఇదే సమయంలో సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ఏటీఎంల నుంచి నగదు విత్‌డ్రాయల్స్ 3.94 శాతం, సెమీ మెట్రో ప్రాంతాల్లో 3.73 శాతం మాత్రమే పెరిగాయి.

ఈ రాష్ట్రాల్లో మరింత ఎక్కువ: దేశంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే కర్ణాటకలో ఏటీఎంల ద్వారా పెద్ద మొత్తంలో నగదు విత్‌డ్రా చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం అక్కడి బ్యాంక్ ఖాతాదారులు ఒక్కో ఏటీఎం నుంచి నెలకు సగటున రూ.1.83 కోట్లు విత్‌డ్రా చేశారు. రూ.1.82 కోట్లతో ఢిల్లీ రెండో స్థానంలో, రూ.1.62 కోట్లతో పశ్చిమ బెంగాల్ మూడో స్థానంలో ఉంది. పెద్ద ఎత్తున యూపీఐ చెల్లింపులు జరుగుతున్నా.. ఏటీఎంల ద్వారా ప్రతి నెలా విత్‌డ్రా చేసే నగదు గత ఆర్థిక సంవత్సరం 5.51 శాతం పెరగడం విశేషం. పెరుగుతున్న నగదు చెల్లింపులు, పెరుగుతున్న వినియోగ ఖర్చులకు సంకేతమని నివేదిక తెలిపింది.

వడ్డీ వసూళ్లలో అడ్డదారులొద్దు

బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు ఆర్‌బీఐ ఆదేశం



ముంబై: వడ్డీల విషయంలో అనుచిత ధోరణులకు పాల్పడవద్దని బ్యాంకులు, ఆర్థిక సంస్థలను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆదేశించింది. ఒకవేళ ఇంతకు ముందే ఇలాంటి అనుచిత చర్యలకు పాల్పడి ఉంటే తగు దిద్దుబాటు చర్యలు చేపట్టి కస్టమర్ల నుంచి అదనంగా వసూలు చేసిన చార్జీలను వాపసు చేయాలని కోరింది. 2003 నుంచి నియంత్రిత సంస్థలకు (ఆర్‌ఈ) ఆర్‌బీఐ ఫెయిర్ ప్రాక్టీసెస్ కోడ్ కింద మార్గదర్శకాలు అందిస్తోంది. రుణచార్జీల విషయంలో వాటికి అవసరమైనంత స్వేచ్ఛ ఇస్తూనే వడ్డీ వసూళ్లపై స్పష్టత, పారదర్శకతలను ఈ కోడ్ ప్రోత్సహిస్తుంది. "2023 మార్చి 31వ తేదీతో ముగిసిన సంవత్సర కాలంలో ఆర్‌ఈలపై క్షేత్రస్థాయిలో నిర్వహించిన తనిఖీల్లో అవి వడ్డీ చార్జీల విషయంలో అనుచిత ధోరణులకు పాల్పడుతున్నట్టు తేలింది" అని ఆర్‌బీఐ తాజా సర్క్యులర్‌లో తెలిపింది. ఈ నేపథ్యంలో ఆర్‌ఈలన్నీ రుణ బట్వాడా; వడ్డీ రేట్లు, ఇతర చార్జీల నిర్ణయం విషయంలో తమ ధోరణులను సమీక్షించుకుని వ్యవస్థాపరమైన మార్పులు సహా అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ సర్క్యులర్ తక్షణం అమలులోకి వస్తున్నట్టు ఆర్‌బీఐ తెలిపింది. కొన్ని సంస్థలు అనుసరిస్తున్న నిర్దిష్టమైన అనుచిత ధోరణులకు ప్రత్యేకంగా వెలుగులోకి తెచ్చింది. ఆర్‌బీఐ ప్రస్తావించిన కొన్ని అనుచిత ధోరణులివే...

- రుణగ్రహీతకు వాస్తవంగా రుణం బట్వాడా చేసిన తేదీ నుంచి కాకుండా రుణం మంజూరైన తేదీ నుంచి లేదా రుణ అంగీకారంపై సంతకాలు చేసిన తేదీ నుంచే వడ్డీ వసూలు చేస్తున్నాయి.
- చెక్కును తయారుచేసిన తేదీ నుంచే ముక్కు పిండి వడ్డీ వసూలు చేస్తూ ఆ తర్వాత ఎన్నో రోజులకు కస్టమర్ చేతికి చెక్కును అందిస్తున్నాయి.
- రుణం తిరిగి చెల్లించే సమయంలో కూడా ఏ తేదీతో అయితే రుణం తీరిపోయిందో అంతవరకు కాకుండా నెల మొత్తానికి వడ్డీ వసూలు చేస్తున్నాయి.
- కొన్ని కేసుల్లో ఆర్‌ఈలు ఒకటి లేదా రెండు వాయిదాలు అడ్వాన్స్‌గా వసూలు చేసినా పూర్తి రుణ మొత్తానికి వడ్డీ వసూలు చేస్తున్నాయి.

ఈ చర్యలేవీ స్వచ్ఛత, పారదర్శకత పరిధిలోకి రావని, ఇవన్నీ తమను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయని ఆర్‌బీఐ వ్యాఖ్యానించింది. ఆర్‌బీఐ బృందాల తనిఖీలో ప్రస్తావించిన ఈ తరహా కేసులన్నింటిలోనూ ఆర్‌ఈలు కస్టమర్ల నుంచి అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని వాపసు చేయాలని ఆదేశించింది.

ఐవీఎంఏ ప్రెసిడెంట్‌గా కృష్ణ ఎల్లా

▸▸ వైస్ ప్రెసిడెంట్‌గా మహిమ దాట్ల

హైదరాబాద్: 'ది ఇండియన్ వ్యాక్సిన్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్' (ఐవీఎంఏ) కీలక పదవులకు ముగ్గురు తెలుగు తేజాలు ఎన్నికయ్యారు. భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎం ఎల్లా ప్రెసిడెంట్‌గా, బయోలాజికల్-ఈ (బీఈ) మేనేజింగ్ డైరెక్టర్ మహిమ దాట్ల వైస్ ప్రెసిడెంట్‌గా, భారత్ బయోటెక్ సీఎఫ్ఓ టీ శ్రీనివాస్ ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. వీరు రెండేళ్ల పాటు ఈ పదవుల్లో కొనసాగుతారు. ఐవీఎంఏ ప్రస్తుత డైరెక్టర్ జనరల్ డాక్టర్ హర్షవర్ధన్ అదే పదవిలో కొనసాగుతారు. 'అంతర్జాతీయ ఆరోగ్యానికి వ్యాక్సిన్లు ప్రధాన మూలస్తంభాలు. ఎవరు ఎక్కడ నివసిస్తున్నారనే దానిపై సంబంధం లేకుండా, ప్రతి వ్యక్తికీ వ్యాధి నిరోధక టీకాలు అందుబాటులో ఉండాలన్నదే ఐవీఎంఏ ధ్యేయం' అని కృష్ణ ఎం ఎల్లా ఒక ప్రకటనలో తెలిపారు.

హైసియా అధ్యక్షుడిగా ప్రశాంత్

హైదరాబాద్: హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) నూతన అధ్యక్షుడిగా ఫస్ట్‌సోర్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) ప్రశాంత్ నందెళ్ల ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన హైసియా 32వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. 2024-26 కాలానికి ప్రశాంత్ ఈ పదవిలో ఉంటారు. ఇన్ఫోసిస్ హైదరాబాద్, ఇండోర్ క్యాంపస్ హెడ్ మనీషా సాబు నుంచి ఆయన ఈ బాధ్యతలు స్వీకరించారు. ప్రశాంత్ ఇంతకు ముందు హైసియా వైస్ ప్రెసిడెంట్‌గా, హైసియాకు చెందిన వివిధ కమిటీల్లో సభ్యుడిగా కీలక పాత్ర పోషించారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,600 ▼	66,550 ▼	87,500 ▼
ముంబై	72,373 ▼	66,294 ▼	81,128 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 30వ తేదీ



హైదరాబాద్	355	విజయవాడ	355
వరంగల్	357	గోదావరి	355
చిత్తూరు	453	విశాఖపట్నం	400
		డజను గుడ్లు రూ.48	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	127	విజయవాడ	133
వరంగల్	127	గుంటూరు	135
కరీంనగర్	127	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	127	చిత్తూరు	125
కర్నూలు	127	నెల్లూరు	125
విశాఖపట్నం	125	అనంతపురం	133
గోదావరి	133		



బుల్ జోష్

సెన్సెక్స్ 941 పాయింట్లు అప్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం భారీ లాభాలను నమోదు చేశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ర్యాలీ సహా దేశీయంగా ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, ఇన్‌ఫ్రా రంగ షేర్లలో పెద్దఎత్తున కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. సెన్సెక్స్ 941.12 పాయింట్లు (1.28%) ఎగిసి 74,671.28 వద్దకు చేరుకోగా.. నిఫ్టీ 223.45 పాయింట్ల (1%) వృద్ధితో 22643.40 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 26 లాభపడ్డాయి. కొనుగోళ్ల జోరుతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2.48 లక్షల కోట్లకు పైగా పెరిగి సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.406.52 లక్షల కోట్లకు (4.90 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

వచ్చే నెల 6 నుంచి ఇండిజీన్ ఐపీఓ: హెల్త్‌కేర్ టెక్నాలజీ కంపెనీ ఇండిజీన్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చే నెల 6న ప్రారంభమై 8న ముగియనుంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా షేరు ధరల శ్రేణిని కంపెనీ రూ.430-452 గా నిర్ణయించింది.

బీఎస్ఈ షేరు 19% పతనం

రెగ్యులేటరీ ఫీజుపై సెబీ తాజా ఆదేశాలే కారణం

దేశంలో తొలి స్టాక్ ఎక్స్ఛేంజ్ బీఎస్ఈ షేరు ఇంట్రాడే ట్రేడింగ్‌లో దాదాపు 19% క్షీణించి రూ.2,612.10 వద్దకు పతనమైంది. చివరికి 13.31% నష్టంతో రూ.2,783 వద్ద ముగిసింది. రెగ్యులేటరీ ఫీజుపై బీఎస్ఈకి మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ జారీ చేసిన తాజా ఆదేశాలే ఇందుకు కారణం. ఆప్షన్స్ కాంట్రాక్టుల వార్షిక టర్నోవర్‌పై ప్రీమియం విలువకు బదులు నోషనల్ వేల్యూ ఆధారంగా ఫీజు చెల్లించాలని బీఎస్ఈని ఆదేశించింది. దాంతో ఎక్స్ఛేంజ్ ప్రస్తుతం చెల్లిస్తున్న దాని కంటే అధిక రుసుము చెల్లించాల్సి వస్తుంది. ఇకపై చెల్లించబోయే రుసుముతో పాటు గత కాలానికీ కొత్త నిబంధన వర్తిస్తుందని సెబీ స్పష్టం చేసింది. కాబట్టి, గత సంవత్సరాలకు చెందిన వ్యత్యాస రుసుమును సైతం 15 శాతం వార్షిక వడ్డీతో కలిపి చెల్లించాలని ఆదేశించింది. దీన్నిబట్టి 2006-07 నుంచి 2022-23 వరకు వ్యత్యాస రుసుము కింద బీఎస్ఈ రూ.68.64 కోట్లు (జీఎస్‌టీ అదనం), 2023-24 ఆర్థిక సంవత్సరానికి మరో రూ.96.30 కోట్లు+జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది.



మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ

▸▸ ప్రారంభ ధర రూ.7.49 లక్షలు

ముంబై: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) కాంపాక్ట్ ఎస్‌యూవీ విభాగంలో సరికొత్త ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓని విడుదల చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.7.49 లక్షలు. కాంపాక్ట్ ఎస్‌యూవీ విభాగంలో 3ఎక్స్‌ఓ సరికొత్త బెంచ్‌మార్క్‌ను సృష్టిస్తుందని ఎం అండ్ ఎం ఆటోమోటివ్ డివిజన్ ప్రెసిడెంట్ వీజే నక్రా తెలిపారు. 6-స్పీడ్ ఏఐఎస్ఐఎన్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో పెట్రోల్ వేరియంట్, 6 స్పీడ్ ఆటోషిఫ్ట్ ప్లస్‌తో డీజిల్ వేరియంట్స్ అందుబాటులో ఉంటాయని కంపెనీ తెలిపింది. 1.2 లీటర్ ఎంస్టాలియన్ టీజీడీఐ ఇంజన్, సీఆర్‌డీఈతో 1.5 లీటర్ టర్బో డీజిల్ ఇంజన్‌తో ఈ ఎస్‌యూవీని తీసుకువచ్చినట్లు పేర్కొంది. ఈ ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ బుకింగ్స్ మే 15 నుంచి ఆన్‌లైన్‌తో పాటు మహీంద్రా డీలర్‌షిప్స్‌లో ప్రారంభమవుతాయని తెలిపింది. అదే నెల 26 నుంచి ఈ కారు డెలివరీలను ప్రారంభించనున్నట్లు పేర్కొంది.

కాకినాడలో రూ.1,000 కోట్లతో ప్లాంట్

కోరమాండల్ ఇంటర్నేషనల్

హైదరాబాద్: ఎరువుల తయారీ కంపెనీ కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్.. ఆంధ్రప్రదేశ్, కాకినాడలోని తన ఎరువుల ఫ్యాక్టరీ వద్ద బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్ చేపట్టింది. ఇందులో భాగంగా రూ.1,000 కోట్ల అంచనాతో ఫాస్ఫరిక్ యాసిడ్, సల్ఫ్యూరిక్ యాసిడ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తోంది. ఫాస్ఫరిక్ యాసిడ్ ప్లాంట్ రోజువారీ ఉత్పత్తి సామర్థ్యం 650 టన్నులు, సల్ఫ్యూరిక్ యాసిడ్ ప్లాంట్ రోజువారీ ఉత్పత్తి సామర్థ్యం 1,800 టన్నులు ఉంటుందని కంపెనీ తెలిపింది. ఈ రెండు ప్లాంట్ల నిర్మాణం రెండేళ్లలో పూర్తి కానుంది. డీఏపీ, ఎన్‌కేపీ ఎరువుల తయారీలో ఈ రెండు ఉత్పత్తులు కీలక ముడి పదార్థాలు. కాకినాడ ప్లాంట్‌కు అవసరమైన ఫాస్ఫరిక్, సల్ఫ్యూరిక్ యాసిడ్ అవసరాల్లో ఈ రెండు ప్లాంట్లు 50 శాతం తీరుస్తాయని అంచనా.

కర్ణాటకలో 'మేఘా'కు రూ.8,000 కోట్ల ప్రాజెక్ట్

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్)కు కర్ణాటకలో భారీ పవర్ ప్రాజెక్ట్ లభించింది. శరావతి నదిపై 2,000 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించే పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టు నిర్మాణ కాంట్రాక్ట్ కంపెనీకి దక్కింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.8,000 కోట్ల వరకు పెట్టుబడి అవసరమవుతుందని కంపెనీ తెలిపింది. ఇది దేశంలోనే అతిపెద్ద పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టు కానుంది. ఈ ప్రాజెక్ట్ కోసం జరిగిన బిడ్డింగ్‌లో ఎల్ అండ్ టీ కూడా పోటీపడింది. కానీ చివరికి ఈ ప్రాజెక్టు నిర్మాణ కాంట్రాక్టు ఎంఈఐఎల్‌కు దక్కింది.

స్పోర్ట్స్

పారిస్ ఒలింపిక్స్‌కు ఏడుగురు భారత షట్లర్లు





- సింధు, ప్రణయ్, లక్ష్య సేన్‌కు చోటు
- డబుల్స్‌లో సాత్విక్, అశ్వినీ జోడీలు
- శ్రీకాంత్‌కు మళ్లీ నిరాశే

న్యూఢిల్లీ: మాజీ వరల్డ్ చాంపియన్ పీవీ సింధు సహా ఏడుగురు భారత షట్లర్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. మహిళల సింగిల్స్‌లో సింధు, పురుషుల్లో హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్‌లు ఎప్పుడో తమతమ బెర్త్‌లను ఖరారు చేసుకొన్నా.. కటాఫ్ డేట్ అయిన సోమవారం అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) అధికారికంగా ప్రకటించింది. నిబంధనల ప్రకారం 2023, మే 1 నుంచి 2024, ఏప్రిల్ 30 వరకు సాగే ఒలింపిక్ సైకిల్‌లో.. డెడ్‌లైన్ లోపు వరల్డ్ ర్యాంకింగ్స్‌లో టాప్-16లో ఉన్న వారు పారిస్‌కు అర్హత సాధిస్తారు. ఈ నేపథ్యంలో 12వ ర్యాంక్‌లో నిలిచిన సింధు.. 9, 13 ర్యాంక్‌లు సాధించిన ప్రణయ్, లక్ష్య సేన్‌లు అర్హత సాధించారు. సూపర్ ఫామ్‌లో ఉన్న డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట మూడో ర్యాంక్‌లో నిలిచి ఒలింపిక్ బెర్త్‌ను సొంతం చేసుకొంది. కాగా, మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంట 13వ స్థానంతో జాక్‌పాట్ కొట్టేయగా.. ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ జోడీకి నిరాశే ఎదురైంది. ఈ ఏడాది పేలవ ప్రదర్శన చేసిన కిడాంబి శ్రీకాంత్ కూడా అర్హత సాధించలేక పోయాడు. శ్రీకాంత్ గత టోక్యో ఒలింపిక్స్‌కూ దూరమైన సంగతి తెలిసిందే.

థామస్ కప్ క్వార్టర్స్‌లో భారత్



చెంగ్డూ (చైనా) : డిఫెండింగ్ చాంపియన్ భారత్ ప్రతిష్ఠాత్మక థామస్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీలో ముందంజ వేసింది. గ్రూప్ 'సి'లో తలపడుతున్న మనోళ్లు సోమవారం జరిగిన రెండో పోరులో ఇంగ్లండ్‌ను 5-0తో చిత్తు చేసి క్వార్టర్‌ఫైనల్లోకి అడుగుపెట్టారు. ఉబెర్ కప్‌లో భారత మహిళల జట్టు ఇప్పటికే రౌండ్-8కి చేరిన విషయం విదితమే. తొలి పోరులో థాయ్‌లాండ్‌పై 4-1తో గెలిచిన పురుషుల జట్టు వరుసగా రెండో విజయంతో నాకౌట్ బెర్త్ ఖాయం చేసుకుంది. తొలి సింగిల్స్‌లో ప్రణయ్ 21-15, 21-15తో హ్యారీపై నెగ్గి జట్టుకు 1-0 ఆధిక్యం అందించాడు. మొదటి డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ 21-17, 19-21, 21-15తో బెన్/వెండీపై పోరాడి గెలిచారు. అనంతరం వరల్డ్ మాజీ నెం.1 కిడాంబి శ్రీకాంత్ 21-16, 21-11తో నదీమ్‌ని ఓడించడంతో భారత్ 3-0తో తిరుగులేని స్థితిలో నిలిచింది. రెండో డబుల్స్‌లో అర్జున్/ధ్రువ్ 21-17, 21-19తో ఈస్టర్/అలెక్స్‌పై, చివరి మ్యాచ్‌లో కిరణ్ జార్జ్ 21-18, 21-12తో కయన్‌పై నెగ్గడంతో భారత్ విజయం పరిపూర్ణమైంది. బుధవారం జరిగే గ్రూపు చివరి పోరులో పటిష్ఠమైన ఇండోనేసియాతో భారత్ తలపడనుంది.

ఇప్పటికి వీరే..





పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
500 (10 మ్యాచ్‌లు)	14 (9 మ్యాచ్‌లు)

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: లఖ్‌నవూ

లఖ్‌నవూ X ముంబై

సంజూకే తొలి ప్రాధాన్యం



- కీపర్ పోటీలో పంత్, రాహుల్, ఇషాన్
- టీ20 వరల్డ్‌కప్ జట్టు ఎంపిక నేడు

న్యూఢిల్లీ: టీ20 ప్రపంచకప్‌లో తలపడే భారత జట్టును నేడో.. రేపో ప్రకటించబోతున్నారు. ఈ జాబితాలో వికెట్ కీపర్‌గా తొలి ప్రాధాన్యం సంజూ శాంసన్‌కే దక్కనుందని సమాచారం. మరోవైపు ఈ స్థానం కోసం రిషబ్ పంత్, కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్ కూడా పోటీలో ఉన్నారు. అయితే రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా ఉన్న శాంసన్ చక్కటి ఫామ్‌లో ఉన్నాడు. తాజా సీజన్‌లో ఇప్పటిదాకా 161.08 స్ట్రయిక్ రేట్‌తో 385 పరుగులు సాధించాడు. ఇందులో నాలుగు అర్ధసెంచరీలున్నాయి. పంత్ సైతం ఫామ్ కనబరుస్తున్నా అతన్ని రిజర్వ్ కీపర్‌గా ఎంపిక చేయనున్నారు. కేవలం ఐపీఎల్ ఫామ్‌నే కాకుండా ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని బోర్డు అధికారి తెలిపాడు. యువ పేసర్ మయాంక్ యాదవ్ బౌలింగ్ వేగం సెలెక్టర్లను ఆకట్టుకున్నా అతడు గాయంతో బాధపడుతుండడంతో బెర్త్ దక్కడం కష్టమే. ఇక టాప్-4లో రోహిత్, యశస్వి జైస్వాల్, కోహ్లీ, సూర్యకుమార్ ఎంపిక దాదాపు ఖాయమే. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు శివమ్ దూబే, రింకూ సింగ్‌ల నుంచి గట్టి పోటీనే ఎదురవుతోంది. పైగా పాండ్యా పూర్తి స్థాయిలో బౌలింగ్ చేయలేకపోతున్నాడు. జడేజా, కుల్దీప్ స్పిన్నర్ల పాత్ర పోషించనుండగా, పేసర్లుగా బుమ్రా, అర్ష్‌దీప్‌లతో పాటు మూడో స్థానం కోసం అవేశ్, సిరాజ్‌ల మధ్య పోటీ నెలకొంది.

చాంపియన్స్ ట్రోఫీ వేదికలు కరాచీ, లాహోర్, రావల్పిండి

లాహోర్: వచ్చే ఏడాది స్వదేశంలో జరగనున్న చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) కోసం కరాచీ, లాహోర్, రావల్పిండిని వేదికలుగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఖరారు చేసింది. అయితే ఇందులో టీమిండియా పాల్గొనే విషయమై ఎటువంటి స్పష్టతా రాలేదు. కానీ, భారత ప్రభుత్వం పాకిస్థాన్ వెళ్లేందుకు అనుమతించకపోతే.. హైబ్రిడ్ విధానంలో తటస్థ వేదికలో టీమిండియా మ్యాచ్‌లు నిర్వహించాలని ఐసీసీ భావిస్తున్నట్టు సమాచారం. అయితే, టోర్నీ మొత్తం తమ దేశంలోనే నిర్వహించాలని పాక్ క్రికెట్ బోర్డు పట్టుబడుతోంది.

రచిన్, హెన్రీకి చోటు



విలియమ్సన్‌కు సారథ్యం

టీ20 వరల్డ్‌కప్‌నకు కివీస్ జట్టు

ఆక్లాండ్: కేన్ విలియమ్సన్ సారథ్యంలోని 15 మంది సభ్యుల న్యూజిలాండ్ టీ20 వరల్డ్‌కప్ జట్టును సోమవారం ప్రకటించారు. రచిన్ రవీంద్ర, పేసర్ మ్యాట్ హెన్రీకి తొలిసారి పొట్టికప్ టీమ్‌లో చోటు దక్కింది. మెగా ఈవెంట్‌లో కివీస్ జట్టుకు విలియమ్సన్ నాలుగోసారి నాయకత్వం వహించనున్నాడు. గాయం కారణంగా ఐపీఎల్‌కు దూరమైన డెవాన్ కాన్వేకు కూడా టీమ్‌లో స్థానం లభించింది. అమెరికా-వెస్టిండీస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న టీ20 వరల్డ్ కప్ జూన్‌లో జరగనుంది.

న్యూజిలాండ్ జట్టు: విలియమ్సన్ (కెప్టెన్), అలెన్, బౌల్ట్, బ్రేస్‌వెల్, చాప్‌మన్, కాన్వే, ఫెర్గూసన్, హెన్రీ, మిచెల్, నీషమ్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, శాంట్నర్, సోధీ, టిమ్ సౌథీ, బెన్ సీర్స్ (ట్రావెల్ రిజర్వ్).

కోల్‌కతా అవలీలగా..

- ఫిల్ సాల్ట్ మెరుపు అర్ధ శతకం
- 7 వికెట్లతో ఢిల్లీ చిత్తు
- వరుణ్‌కు మూడు వికెట్లు



వరుణ్ చక్రవర్తి (4-0-16-3)



ఫిల్ సాల్ట్ (33 బంతుల్లో 68)

1 పవర్‌ప్లేలో ఎక్కువ పరుగులు (60) సాధించిన కోల్‌కతా బ్యాటర్‌గా సాల్ట్

3 ఈసీజన్‌లో పవర్‌ప్లేలో ఎక్కువ సిక్సర్లు (15) బాదిన మూడో బ్యాటర్‌గా సాల్ట్. అభిషేక్ (19), హెడ్, ఫ్రేజర్ (16) ముందున్నారు.

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్‌లో చివరి ఆరు మ్యాచ్‌ల్లోనూ 200కు పైగా స్కోర్లు నమోదు కాగా.. ఢిల్లీ క్యాపిటల్స్ చేసింది కేవలం 153 పరుగులే. దీంతో ఈ సునాయాస లక్ష్యాన్ని కోల్‌కతా నైట్‌రైడర్స్ అవలీలగా ఛేదించింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (33 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సలతో 68) తుఫాన్ ఇన్నింగ్స్‌తో పవర్‌ప్లేలోనే సగానికి పైగా రన్స్ అందించాడు. ఫలితంగా సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో కేకేఆర్ ఏడు వికెట్లతో ఘనవిజయం సాధించింది. దీంతో 12 పాయింట్లతో రెండోస్థానంలో నిలిచిన కోల్‌కతా ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత మెరుగుపర్చుకుంది. ముందుగా ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్లకు 153 పరుగులు చేసింది. కుల్దీప్ యాదవ్ (26 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 35 నాటౌట్), పంత్ (20 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 27) మాత్రమే రాణించారు. వరుణ్ చక్రవర్తికి మూడు.. హర్షిత్, వైభవ్ అరోరాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ ఛేదనలో కోల్‌కతా 16.3 ఓవర్లలో 3 వికెట్లకు 157 పరుగులు చేసి గెలిచింది. శ్రేయాస్ (23 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 33 నాటౌట్), వెంకటేశ్ అయ్యర్ (23 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 26 నాటౌట్) ఆకట్టుకున్నారు. అక్షర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా వరుణ్ చక్రవర్తి నిలిచాడు.

సాల్ట్ జోరు: కోల్‌కతా ఓపెనర్ సాల్ట్ ఎప్పటిలాగే తన ధాటిని కొనసాగిస్తూ ఇన్నింగ్స్ తొలి ఓవర్‌నే సంచలన రీతిలో ఆరంభించాడు. విలియమ్స్ వేసిన ఈ ఓవర్‌లో అతడు 4,6,4,4తో 23 రన్స్ రాబట్టడంతో ఢిల్లీ ఓటమి ఖాయమనిపించింది. రెండో ఓవర్‌లోనే సాల్ట్ అవుటవ్వాల్సి ఉన్నా మిడాన్‌లో విలియమ్స్ క్యాచ్ వదిలేశాడు. ఈ చాన్స్‌ను సద్వినియోగం చేసుకుంటూ మూడో ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లు బాదిన సాల్ట్.. ఆరో ఓవర్‌లో 4,6,4,4తో 26 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేశాడు. ఈ బాదుడుకు కేకేఆర్ పవర్‌ప్లేలో 79 పరుగులతో నిలిచింది. అనంతరం వరుస ఓవర్లలో స్పిన్నర్ అక్షర్ పటేల్.. నరైన్ (15), సాల్ట్‌ల వికెట్లు తీయగా, వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన రింకూ సింగ్ (11) కూడా త్వరగానే నిష్క్రమించాడు. పదో ఓవర్‌లో విలియమ్స్ అతడి వికెట్ తీశాడు. కానీ అప్పటికే పటిష్ఠ స్థితిలో ఉన్న కోల్‌కతాకు కెప్టెన్ శ్రేయాస్, వెంకటేశ్ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆడి 16.3 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు.

బౌలర్లదే హవా: భారీ ఛేదనను ప్రత్యర్థి ముందు ఉంచాలన్న లక్ష్యంతో టాస్ గెలవగానే ఢిల్లీ బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ బరిలోకి దిగాక కోల్‌కతా బౌలర్లను ఎదుర్కోవడంలో బ్యాటర్లు దారుణంగా తడబడ్డారు. ఒక్కరు కూడా నిలకడగా ఆడలేక, వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయారు. కానీ టెయిలెండర్ కుల్దీప్ మాత్రం చివర్లో జట్టు పరువు కాపాడే ఇన్నింగ్స్ ఆడాడు. పేసర్ వైభవ్ అరోరా ఆరంభంలోనే రెండు వికెట్లతో దెబ్బతీయగా.. మధ్య ఓవర్లలో స్పిన్నర్ వరుణ్ ప్రభావం చూపాడు. దీంతో ఓ దశలో 150 పరుగులు కూడా కష్టంగానే అనిపించింది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ పృథ్వీ షా (13) మూడు ఫోర్లతో ఆహా.. అనిపించినా అరోరా తన వరుస ఓవర్లలో షా, హోప్ (6) వికెట్లను తీశాడు. ఇక 6,4తో జోరు చూపిన హిట్టర్ ఫ్రేజర్ (12)కు స్టార్క్ షాకిచ్చాడు. ఈ దశలో అభిషేక్ పోరెల్ (18) 4,6,4తో 16 రన్స్ సాధించడంతో పవర్‌ప్లేలో ఢిల్లీ 67/3తో ఫర్వాలేదనిపించింది. అప్పటికి రన్‌రేట్ బాగానే ఉన్నా వికెట్లు కాపాడుకోవడంలో విఫలమైంది. పోరెల్-పంత్ నాలుగో వికెట్‌కు అందించిన 31 పరుగులే అత్యధికం. వరుసగా పోరెల్, పంత్, స్టబ్స్ (4), అక్షర్ (15), కుశాగ్ర (1) ఇలా వచ్చి అలా వెళ్లడంతో 111/8 స్కోరుతో డీసీ పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే కుల్దీప్ మాత్రం బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ 16వ ఓవర్‌లో 6,4తో 16 రన్స్ అందించాడు. అలాగే రసిక్ (6)తో తొమ్మిదో వికెట్‌కు 29 పరుగులు అందించడంతో పాటు, ఆఖరి బంతి వరకు మ్యాచ్ తీసుకెళ్లి జట్టు స్కోరును 150 దాటించాడు.

స్కోరుబోర్డు


ఢిల్లీ: పృథ్వీ షా (సి) సాల్ట్ (బి) వైభవ్ 13, ఫ్రేజర్ (సి) వెంకటేశ్ (బి) స్టార్క్ 12, అభిషేక్ (బి) హర్షిత్ 18, హోప్ (బి) వైభవ్ 6, పంత్ (సి) శ్రేయాస్ (బి) వరుణ్ 27, అక్షర్ (బి) నరైన్ 15, స్టబ్స్ (సి) సాల్ట్ (బి) వరుణ్ 4, కుశాగ్ర (సి) సాల్ట్ (బి) వరుణ్ 1, కుల్దీప్ (నాటౌట్) 35, రసిక్ (సి) శ్రేయాస్ (బి) హర్షిత్ 8, విలియమ్స్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 20 ఓవర్లలో 153/9; వికెట్లపతనం:** 1-17, 2-30, 3-37, 4-68, 5-93, 6-99, 7-101, 8-111, 9-140, **బౌలింగ్:** స్టార్క్ 3-0-43-1, వైభవ్ అరోరా 4-0-29-2, హర్షిత్ రాణా 4-0-28-2, సునీల్ నరైన్ 4-0-24-1, వరుణ్ చక్రవర్తి 4-0-16-3, రస్సెల్ 1-0-10-0.

కోల్‌కతా: సాల్ట్ (బి) అక్షర్ 68, నరైన్ (సి) ఫ్రేజర్ (బి) అక్షర్ 15, రింకూసింగ్ (సి) కుల్దీప్ (బి) విలియమ్స్ 11, శ్రేయాస్ (నాటౌట్) 33, వెంకటేశ్ (నాటౌట్) 26, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 16.3 ఓవర్లలో 157/3; వికెట్ల పతనం:** 1-79, 2-96, 3-100; **బౌలింగ్:** లిజాడ్ విలియమ్స్ 3-0-38-1, ఖలీల్ అహ్మద్ 3-0-28-0, రసిక్ సలామ్ 2.3-0-30-0, అక్షర్ పటేల్ 4-0-25-2, కుల్దీప్ యాదవ్ 4-0-34-0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర‌రే
రాజస్థాన్	9	8	1	0	16	0.694
కోల్‌కతా	9	6	3	0	12	1.096
చెన్నై	9	5	4	0	10	0.810
హైదరాబాద్	9	5	4	0	10	0.075
లఖ్‌నవూ	9	5	4	0	10	0.059
ఢిల్లీ	11	5	6	0	10	-0.442
గుజరాత్	10	4	6	0	8	-1.113
పంజాబ్	9	3	6	0	6	-0.187
ముంబై	9	3	6	0	6	-0.261
బెంగళూరు	10	3	7	0	6	-0.415

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర‌రే: నెట్ రన్‌రేట్





హడావుడిగా ప్రారంభోత్సవానికి ఓ బ్లాక్‌కు రంగులు వేసిన బ్రాహ్మణపల్లిలోని మెడికల్ కళాశాల భవనం



మీ వాడినే.. తోడుగా ఉంటా

- ప్రజల కష్టాలు, నష్టాలు అన్నీ తెలుసు
- పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తా
- ఆంధ్రజ్యోతితో కూటమి తూర్పు అభ్యర్థి మొహమ్మద్ నసీర్

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): 'ఇక్కడే పుట్టా.. మీలో ఒకడిగా పెరిగా.. మీలో నుంచి వచ్చిన వాడిగా మీ కష్టాలు, బాధలు తెలుసు. వాటిని పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా.. అని గుంటూరు తూర్పు నియోజకవర్గ టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ భరోసా ఇచ్చారు. సామాన్య కుటుంబంలో పుట్టి, చిన్నప్పటి నుంచే రాజకీయాలంటే మక్కువ పెంచుకుని విద్యార్థి, యువజన నాయకుడిగా అంచెలంచెలుగా ఎదుగుతూ తూర్పు నియోజకవర్గ అభ్యర్థిగా కూటమి తరపున నసీర్ బరిలోకి దిగారు. 2019లో టీడీపీ తరపున పోటీ చేసి ఓటమిపాలైనా పార్టీని, క్యాడర్‌ను అంటిపెట్టుకుని స్థానిక సమస్యలపై పోరాడుతూ ప్రజలకు మరింత చేరువయ్యారు. రెండోసారి బరిలో నిలిచిన ఆయన తాజా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలో ఎదురైన అనుభవాలు, చేపట్టబోయే సంక్షేమ పథకాల గురించి ఆంధ్రజ్యోతితో ఆయన ముచ్చటించారు.

● ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?

ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రజాదీవెన యాత్రతో ప్రజల్లోకి వెళుతున్నాం. ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకుంటున్నాం. వారి కష్టనష్టాల గురించి తెలుసుకుని వారికి భరోసా ఇస్తూ సాగుతున్నాం.

● ప్రజల స్పందన ఎలా ఉంది?

ప్రజల్లో మంచి స్పందన లభిస్తోంది. సామాన్య కుటుంబం నుంచి వచ్చినవాడిని కావడంతో ప్రజలు మనవాడే అన్న భావనతో దగ్గరకు తీసుకుంటున్నారు. పార్టీ పరంగా తెలుగుదేశం మీద నమ్మకం ప్రజల్లో కనిపిస్తోంది. దాంతో ఆదరణ మరింత పెరిగింది.

● ప్రచారంలో స్పందన?

మహిళలు, అవ్వా, తాతల నుంచి స్పందన బాగా ఉంది. జగన్ పథకాల కారణంగా ప్రతి ఇంట్లో ఒక బాధితుడు ఉన్నారు. నిరుద్యోగ యువతలో తీవ్ర ఆగ్రహం ఉంది. దళిత, ముస్లింలలో పథకాల కోతపై వ్యతిరేకత ఉంది.

● వైసీపీపై ప్రజాభిప్రాయం?

అధికార వైసీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ఇసుక లేక కార్మికులు, వ్యాపారాలు లేక వ్యాపారులు, జీతాలు రాక ఉద్యోగులు, ఉద్యోగాలు రాక నిరుద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. భరోసా ఇచ్చేవారు లేక సామాన్యులు అసహనంతో ఉన్నారు.

● ఎమ్మెల్యేపై ఆరోపణలు?

స్థానిక ఎమ్మెల్యేకు రెండు సార్లు అవకాశం ఇచ్చినా ఏమీ చేయలేదన్న కోపం ప్రజల్లో ఉంది. పదేళ్లలో నియోజకవర్గానికి ఏమీ చేయకపోగా తన కుటుంబాన్ని బాగు చేసుకున్నారు. గంజాయి, గుట్కా, పాన్‌పరాగ్ కంపెనీలతో పిల్లల్ని నాశనం చేశారని, కాంట్రాక్టుల్లో కమీషన్ కొట్టేసి, అంజుమన్ ఆస్తులను అన్యాక్రాంతం చేశాడని ప్రజలు ఆరోపిస్తున్నారు.

● ప్రజా సమస్యలేంటి?

దశాబ్దాలుగా నివసించే ప్రజలకు కూడా ఇళ్ల పట్టాలు ఇవ్వలేదు. పారిశుధ్యం అధ్వానంగా ఉందని, రోడ్లు,డ్రెయినేజీలు అసలు బాగోలేదని ప్రజలు వాపోతున్నారు. దానికి తోడు నియోజకవర్గంలో గంజాయి పీడ ఎక్కువగా ఉందని వారు బాధ పడుతున్నారు.

● మీరిచ్చిన హామీలు?

అందరికీ అందుబాటులో ఉంటాను. ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు కృషి చేస్తా. ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీరు అందిస్తా. బీఆర్ స్టేడియంను అభివృద్ధి చేయిస్తా. పెండింగులో ఉన్న నందివెలుగు ఆర్‌యూబీని పూర్తి చేయించేందుకు కృషి చేస్తా.

● ప్రచారంలో కదిలించిన సందర్భం?

సుద్దపల్లి డొంకలో 75 ఏళ్లు నిండి, ఏమీ చేయలేని స్థితిలో ఉన్న ఓ అవ్వకు పింఛను తీసేశారు. అమె కొడుకు హైదరాబాదులో సెటిలైపోయాడు. ఆమెకు ఏ ఆధారమూ లేదు. ఆమె బాధను చూసి తట్టుకోలేకపోయా. జగన్ నాసిరకం మద్యంతో 20, 25ఏళ్ల పిల్లలు చనిపోయిన కుటుంబాలు ఎదురయ్యాయి. ఈ రెండు ఘటనలు మనసును కదిలించేశాయి.

మరిచిపోలేని అనుభూతి?

ఒక పండు ముసలి తాత.. నా దగ్గరకు వచ్చి నువ్వే గెలవాలి అని చెప్పి తనకు వచ్చిన పింఛను డబ్బులు 2,500 చేతిలో పెట్టాడు. 500 ఖర్చయిపోయాయని లేకుంటే మొత్తం ఇచ్చేసేవాడినని బాధపడ్డాడు. పెన్షన్ తప్ప ఆధారం లేని ఆయన దగ్గర డబ్బులు తీసుకోవడానికి నిరాకరించడంతో ఆయన చెయ్యి పట్టుకుని, అప్పు కిందయినా తీసుకో.. ఎలక్షన్‌కి పనికొస్తాయని బలవంతంగా చేతిలో పెట్టాడు. ఆ అభిమానం నమ్మకం ఎప్పటికీ మరిచిపోలేను.

● మ్యానిఫెస్టోపై స్పందన?

మ్యానిఫెస్టోపై స్పందన అసాధారణంగా ఉంది. కానీ అంతకంటే ఎక్కువ నమ్మకం చంద్రబాబుపై కనిపిస్తోంది. తల్లికి వందనం, 50 ఏళ్లకే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పింఛను పథకాలపై ప్రజలు బాగా ఆకర్షితులవుతున్నారు.

● చంద్రబాబు ఓ అక్షయపాత్ర

చంద్రబాబు ఆలోచనే ఓ అక్షయపాత్ర.. అందులోంచి ఎంత సంపదైనా సృష్టించవచ్చు. ఎంతమందికైనా.. ఎన్ని సంక్షేమ పథకాలైనా అందించవచ్చు. అదే ఆయన విజన్. అందుకే ఆయన మీద ప్రజలు విపరీతమైన నమ్మకంతో ఉన్నారు.

కాలేజీ పనులు

మాటల్లోనే వైద్య కళాశాలలు

- మూడేళ్లుగా పూర్తి కాని పనులు
- బాపట్లలో పిల్లర్ల దశ దాటని నిర్మాణాలు
- పిడుగురాళ్లలో హడావుడిగా ప్రారంభోత్సవం
- 2025-26 తరగతులు ప్రారంభం గగనమే

ప్రతి జిల్లాలోనూ ప్రభుత్వ వైద్య కళాశాల. ఇంత వరకూ ఏ ప్రభుత్వం చేయని సాహసం. రూ.500 కోట్లతో వైద్య కళాశాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టాం. మూడేళ్లలో పనులు పూర్తి చేస్తాం. తరగతులను ప్రారంభిస్తాం. కార్పొరేట్ వైద్య సేవలను అందుబాటు లోకి తెస్తాం.. అని సీఎం జగన్ ఆర్భాటంగా ప్రకటించారు. అయితే ఇప్పటికీ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బాపట్ల, పిడుగురాళ్లలో వైద్య కళాశాల భవన నిర్మాణాలు ఒక కొలిక్కి రాలేదు. ముఖ్య మంత్రి ప్రకటించిన వైద్య కళాశాలలు మాటలకే పరిమితమయ్యాయి. ప్రభుత్వం చెప్పే మాటలు కార్యరూపం దాల్చడం అసాధ్యంగానే కనబడు తోంది. మరోవైపు జాతీయ వైద్య కమిషన్ నిబంధనలు మెడికల్ కళా శాలకు గొడ్డలి పెట్టుగా మారనున్నాయి. కనీస స్థాయిలో కూడా కసరత్తు లేని ప్రభుత్వ విధానాలు మెడికల్ కళాశాలకు భవిష్యత్తులో శాపాలుగా పరిణమించనున్నాయన్న విమర్శలున్నాయి. అయినా ఎన్నికల సభల్లో, ప్రచారాల్లో సీఎం జగన్‌తో పాటు వైసీపీ నేతలు కూడా వైద్య కళాశాలలపై ఆర్భాటపు ప్రకటనలు చేస్తున్నారు.

పిడుగురాళ్ల / బాపట్ల, ఏప్రిల్ 29 (ఆంధ్ర జ్యోతి): బాపట్ల, పిడుగురాళ్లలో వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల, టీచింగ్ హాస్పిటల్‌కు సీఎం జగన్మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ముఖ్యమంత్రి జగన్ 2021 మే 31న ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. 2023 డిసెంబరు నాటికి నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని నాడు జగన్ ప్రకటించారు. అయితే 2024 ఏప్రిల్ వచ్చినా వైద్య కళాశాల నిర్మాణాలు ఒక కొలిక్కిరాలేదు. బాపట్లలో అయితే మూడేళ్ల గడిచినా భవన నిర్మాణాలు పిల్లర్ల దశ దాటలేదు. శంకుస్థాపన అనంతరం రెండేళ్ల పాటు పనుల ఊసే పట్టించుకోలేదు. ఎన్నికలు వస్తున్నాయని ఏడాది క్రితం నామమాత్రంగా పనులు ప్రారంభించారు. పిల్లర్ల దశలోనే బాపట్ల వైద్య కళాశాల నిర్మాణం ఉంది. పిడుగురాళ్లలో మెడికల్ కాలేజీ పనులు మూడు నెలలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఎన్నికల సమీపిస్తున్నాయని ఇటీవల ప్రజలను మభ్య పెట్టేందుకు హడావుడిగా ఓ బ్లాక్‌కు రంగులు వేసి హడావుడిగా ప్రారంభోత్సవం చేశారు. బిల్లుల చెల్లింపులో జాప్యం జరగడం కూడా కళాశాల పనులు సక్రమంగా జరగడంలేదని సమాచారం. అయినా అరకొర పనులతోనే తాము వైద్య కళాశాలలను అందుబాటులోకి తెచ్చినట్లు అదే తమ ఘనతగా చెప్పుకోవడం సీఎం జగన్‌కే చెల్లిందని ప్రతిపక్షాలతో పాటు బాపట్ల, పల్నాడు జిల్లా వాసులు విమర్శిస్తున్నారు. నిర్మాణ పనులు నత్తను తలపించే విధంగా సాగుతుంటే 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభిస్తామని ప్రచారం చేసుకోవడం అంటే ప్రజలను వంచించడమేనని ప్రతిపక్ష నేతలు అంటున్నారు.

బాపట్ల.. బాలారిష్టాలు

బాపట్ల శివారు జమ్ములపాలెం రోడ్డులోని 50 ఎకరాల స్థలంలో వైద్య కళాశాలకు శంకుస్థాపన జరిగింది. వైద్య కళాశాల కోసం ఓ దాత 50 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారని అప్పట్లో చెప్పారు. అందులోనే కళాశాలకు శంకుస్థాపన జరిగింది. అయితే ఆ భూమి విషయంలో అనేక ఆరోపణలు వచ్చాయి. అదంతా అసైన్డ్ భూమి అని దానిని విరాళంగా ఇవ్వడం ఏమిటనే ప్రశ్న కూడా ఉత్పన్నమైంది. అయినా దానిపై అధికారులు నోరుమెదపలేదు. ఆ తర్వాత నిధుల విషయంలో తాత్సారం జరిగింది. దీంతో మెడికల్ కళాశాల పనులు ప్రారంభం కాలేదు. సీఎం శంకుస్థాపన చేసిన తర్వాత రెండేళ్ల పాటు పనుల ఊసే మరిచారు. ఏడాది క్రిత మే పనులను మొదలుపెట్టారు. ఇలా ఎన్నో బాలారిష్టాలు మెడికల్ కళాశాల పనులను వెంటాడుతున్నప్పటికీ ప్రభుత్వం మోసపు మాటలతో కాలం వెళ్లబుచ్చుతూ అరచేతిలో వైకుంఠం చూపిస్తోందని ప్రజలు విమర్శి స్తున్నారు.

జిల్లా కేంద్రమైనా వైద్యం అంతంతే..

బాపట్ల జిల్లా కేంద్రంగా మారింది. అయినా ఆ స్థాయిలో వైద్య సేవలు అభివృద్ధి చెందలేదు. బాపట్ల ఏరియా ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి తగ్గట్లు వైద్య సేవలను మెరుగుపరిచే విషయంలో ప్రభుత్వం విఫలమైంది. అత్యవసరమైతే అటు ఒంగోలో, ఇటు గుంటూరు వెళ్లాల్సిన దుస్థితిని ప్రజానీకం ఎదుర్కొంటోంది. చాలా సందర్భాల్లో బాపట్ల ఏరియా ఆస్పత్రికి వెళ్లిన కేసుల విషయంలో సరైన సౌకర్యాలు లేవనో, నిపుణులైన డాక్టర్లు లేరనో గుంటూరు ఆస్పత్రికి రిఫర్ చేసిన సందర్భాలు కోకొల్లలు. ఈలోగా వారు ప్రాణాలు విడిచిన సందర్భాలు అనేకం.

పిడుగురాళ్లలో హడావుడి ప్రారంభోత్సవం

పనులు పూర్తి కాలేదు కానీ పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి సమీపంలో ప్రభుత్వ వైద్య కళాశాలను వైసీపీ పాలకులు ప్రారంభించేశారు. నలభై ఏడున్నర ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్లతో కళాశాల, ఆస్పత్రిలను ఆరు బ్లాక్‌లలో నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్రకారం మెడికల్ కళాశాల, దానికి అనుబంధంగా ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల కు మూడేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. నిధులు కొరతతో మూడు నెలలు ఆలస్యంగా పనులు ప్రారంభమయ్యాయి. ఇంకా పలు భవనాల నిర్మాణాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. భవనాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావాలంటే మరో రెండేళ్ల సమయం పట్టేట్లు ఉంది. ఎన్నికల సమీపి స్తుండటంతో ఫిబ్రవరిలో హడావుడిగా ఓ బ్లాక్‌కు రంగులు వేసి నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థి అనిల్‌కుమార్, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిలు ప్రారంభోత్సవం చేసేశారు. ప్రారంభించిన భవనాల లోపల గదుల్లో ఎటువంటి సౌకర్యాలు నేటికి ఏర్పాటు చేయలేదు. మరో రెండు నెలల్లో ఆస్పత్రిని అందు బాటులోకి తీసుకొస్తామని ఫిబ్రవరిలో చెప్పినా ఇంతవరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంలా పనులు సాగుతున్నాయి. మెడికల్ కళాశాలపై చెప్తున్న అబద్ధపు మాటలను ఇకనైనా అధికార పార్టీ నేతలు మానుకోవాలని పల్నాడు ప్రజలు పేర్కొంటున్నారు.

నిధులు కేంద్రానివి.. ఆర్భాటం వైసీపీది

లోక్‌సభ నియోజకవర్గాల ప్రకారం జిల్లాల విభజన జరిగింది. నూతన జిల్లాల ప్రాతిపదికగా ప్రతీ జిల్లాకో ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి జగన్ ప్రకటించి ఆ ప్రకారం శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ రంగంలో ఇన్ని మెడికల్ కళాశాల నిర్మాణం అద్భుతమని ఆయనకి ఆయనే ప్రకటించుకుంటున్నారు. అయితే వైద్య కళాశాలకు కేంద్రం సగం నిధులు ఇస్తున్న సంగతిని మాత్రం వైసీపీ పాలకులు చెప్పడం లేదు. రూ.500 కోట్లతో ఏర్పాటు చేస్తున్న వైద్య కళాశాల, అనుబంధ ఆస్పత్రిలకు రూ.250 కోట్లను కేంద్రం మంజూరు చేస్తుంది. అయితే ఆ నిధులను సక్రమంగా వినియోగించకపోవడం వల్లే బాపట్ల, పిడుగురాళ్ల కళాశాలల పనులు ఒక కొలిక్కి రాలేదని సమాచారం. బిల్లులు మంజూరులో జాప్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. బాపట్లలో అయితే పిల్లర్ల దశ కూడా దాటకపోగా, పిడుగురాళ్లలో కేవలం ఇప్పటికి రూ.180 కోట్ల పనులే జరిగాయి. అంటే కేంద్రం విడుదల చేసిన పూర్తి నిధులను కూడా వ్యయం చేయకుండా వైసీపీ ప్రభుత్వం మాయ చేసిందన్న ఆరోపణలు వస్తున్నాయి. మొత్తంమీద నిధులు కేంద్రానికి కాగా ఆర్భాటం వైసీపీది అన్నట్లుగా వైద్య కళాశాలల పరిస్థితి మారిందని బీజేపీ నాయకులు విమర్శిస్తున్నారు.



పిల్లర్ల దశ దాటని బాపట్ల మెడికల్ కళాశాల పనులు



● పిడుగురాళ్ల : బ్రాహ్మణపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న భవన సముదాయాలు

నేడు తెనాలికి చంద్రబాబు

ప్రజాగళం రోడ్ షో, బహిరంగ సభ ● ఏర్పాట్లు పరిశీలించిన ఆలపాటి, మనోహర్

● చంద్రబాబు పర్యటనతో ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లన్న నేతలు

10 లో..



ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.1

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

గుంటూరు ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. గుంటూరు ఈస్ట్				
2. గుంటూరు వెస్ట్				
3. తాడికొండ				
4. ప్రత్తిపాడు				
5. మంగళగిరి				
6. తెనాలి				
7. పొన్నూరు				
8. బాపట్ల				
9. రేపల్లె				
10. వేమూరు				
11. మాచర్ల				
12. గురజాల				
13. వినుకొండ				
14. చిలకలూరిపేట				
15. నరసరావుపేట				
16. పెదకూరపాడు				
17. సత్తెనపల్లి				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : శివశంకరీ దేవాలయం దగ్గర, వెంగళాయపాలెం, గుంటూరు రూరల్ మండలం, గుంటూరు జిల్లా

ఎన్నికల బరిలో.. 162 మంది

- లోక్‌సభ స్థానంలో 30 మంది అభ్యర్థులు
- మంగళగిరి అసెంబ్లీకి అత్యధికంగా 40 మంది పోటీ
- తాడికొండలో తక్కువగా 10 మంది

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల తుది ఘట్టం ముగిసింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం సాయంత్రంతో ముగియడంతో పోటీలో ఉండే అభ్యర్థులపై స్పష్టత వచ్చింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత గుంటూరు లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి 162 మంది బరిలో నిలిచినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. మొత్తం నామినేషన్లు 229 దాఖలు కాగా పరిశీలనలో 54 నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. దీంతో 175 నామినేషన్లు మిగిలాయి. సోమవారం 13 నామినేషన్లను ఆయా అభ్యర్థులు ఉపసంహరించుకోవడంతో 162 మంది బరిలో మిగిలారు. గుంటూరు లోక్‌సభ స్థానానికి నలుగురు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దాంతో 30 మంది బరిలో మిగిలారు. వారికి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు గుర్తుల కేటాయింపు ప్రక్రియని జిల్లా ఎన్నికల అధికారి వేణుగోపాల్‌రెడ్డి పూర్తి చేశారు. నామినేషన్లు ఉపసంహరణ అనంతరం మంగళగిరి అసెంబ్లీ స్థానంలో 40 మంది పోటీలో మిగిలారు. ఈ కారణంగా అక్కడ పోలింగ్ నిర్వహణకు మూడు బ్యాలెట్ యూనిట్లు వినియోగించాల్సిన అవసరం ఏర్పడింది. దీని వలన ఓటర్లు తాము ఏ అభ్యర్థి అయితే ఓటు వేయదలిచారో ఆ అభ్యర్థి పేరే ఏ బ్యాలెట్ యూనిట్‌లో ఉందో వెతుక్కోవాల్సి ఉంటుంది. జిల్లాలో తక్కువగా తాడికొండ నియోజకవర్గం నుంచి పది మంది మాత్రమే ఎన్నికల బరిలో నిలిచారు.

నియోజకవర్గం	నామినేషన్లు	తిరస్కరణ	ఉపసంహరణ	అభ్యర్థులు
● గుంటూరు(లోక్‌సభ)	47	13	4	30
● తాడికొండ(అసెంబ్లీ)	16	6	0	10
● మంగళగిరి ,,	44	2	2	40
● పొన్నూరు ,,	18	4	0	14
● తెనాలి ,,	20	6	1	13
● ప్రత్తిపాడు ,,	15	2	0	13
● గుంటూరు పశ్చిమ ,,	40	9	3	28
● గుంటూరు తూర్పు ,,	29	12	3	14
మొత్తం	229	54	13	162



బొర్రా వెంకట అప్పారావుతో కన్నా లక్ష్మీనారాయణ, యరపతినేని శ్రీనివాసరావు

'యరపతినేని' దౌత్యం.. మెత్తబడిన 'బొర్రా'

- ఇండిపెండెంట్ నామినేషన్ విత్ డ్రా
- అప్పారావుతో ఫోన్ లో మాట్లాడిన చంద్రబాబు
- 'కన్నా' గెలుపుకు మార్గం సుగమం

సత్తెనపల్లి, ఏప్రిల్29: ఎన్నికల వేళ సత్తెనపల్లి నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇన్నిరోజుల అసంతృప్తిగా ఉన్న జనసేన మాజీ నేత బొర్రా వెంకట అప్పారావు ఎట్టకేలకు చల్లబడ్డారు. గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దౌత్యంతో బొర్రా వెంకట అప్పారావు సోమవారం నామినేషన్ విత్ డ్రా చేసుకున్నారు.

జనసేన పార్టీలో బొర్రా క్రియాశీలకంగా పనిచేశారు. సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సీటు జనసేనకు కేటాయిస్తారని అప్పట్లో భావించారు. టీడీపీ మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణను నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడంతో జనసేనకు చెందిన కొందరు నేతలు అసంతృప్తికి లోనయ్యారు. అందులో భాగంగా బొర్రా వెంకట అప్పారావు జనసేనకు రాజీనామా చేసి, ఇండిపెండెంట్‌గా ఎన్నికల బరిలో నిలిచారు. విషయం పార్టీ అధినేత వద్దకు చేరటంతో సత్తెనపల్లి ట్రబుల్‌షూటర్‌గా పేరొందిన యరపతినేనిని రంగంలోకి దించారు. చంద్రబాబు నాయుడు ఆదేశాలతో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రంగప్రవేశంచేసి బొర్రాతో సంప్రదింపులు జరిపారు. కన్నా, యరపతినేనిలు బొర్రాతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు కూడా బొర్రాతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. నేతల సంప్రదింపులతో మెట్టబడిన బొర్రా వెంకట అప్పారావు తన నామినేషన్ విత్ డ్రా చేసుకున్నారు. కన్నా లక్ష్మీనారాయణ గెలుపు కోసం తాను పనిచేస్తానని ప్రకటించారు. బొర్రాకు నియోజకవర్గ స్థాయిలో మంచి గుర్తింపు ఉండటంతో కన్నా గెలుపునకు మార్గం సుగమం అయ్యిందని పలువురు అంటున్నారు.



ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరిన మంగిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

అమరావతిలో వైసీపీకి భారీ షాక్

- వైస్ ఎంపీపీ మంగిశెట్టి, మరో 40 కుటుంబాలు టీడీపీలో చేరిక

అమరావతి, ఏప్రిల్ 29: మండల కేంద్రమైన అమరావతిలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. మండల వైసీపీ మాజీ కన్వీనర్, వైస్ ఎంపీపీ మంగిశెట్టి శ్రీనివాసరావు సోమవారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. భాష్యం ప్రవీణ్ స్థానిక గంటలమ్మ చెట్టు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాసరావుకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీనివాసరావుతో పాటు వైసీపీ నాయకులు నిమ్మా వెంకటేశ్వరరావు, జెట్టి అమరేంద్ర, రాయల అప్పారావు, మంగిశెట్టి బుజ్జి, ఉమామహేశ్వరరావులతో పాటు సుమారు 40కుటుంబాలు టీడీపీలో చేరడం జరిగింది. వీరి చేరికతో అమరావతిలో కాపు సామాజిక వర్గానికి చెందిన వారు నాలుగు దఫాలుగా టీడీపీలో చేరారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంగిశెట్టిని నివారించేందుకు విఫలయత్నం

వైసీపీ నేతలు మంగిశెట్టి శ్రీనివాసరావు టీడీపీలో చేరుతున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి.. శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి పార్టీ మారకుండా చేసేందుకు విఫలయత్నం చేశారు. శ్రీనివాసరావుతో వసంతకుమారి మంతనాలు జరిపి తిరిగి కారు వద్దకు వచ్చి శ్రీనివాసరావును కారులోకి ఎక్కించింది. అకస్మాత్తుగా జరిగిన సంఘటనకు శ్రీనివాసరావు అభిమానులు కారుకు అడ్డుగా నిలబడి కారులోనుండి శ్రీనివాసరావును కిందకుదింపారు. వసంతకుమారి వెళ్లిపోగానే ప్రవీణ్ శ్రీనివాసరావుకు భరోసా ఇచ్చి పార్టీ చేరిక కార్యక్రమానికి తీసుకుని వెళ్లారు.

2న యూటీఎఫ్ రాష్ట్ర విద్యాసదస్సు

గుంటూరు(విద్య), ఏప్రిల్29: ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ పెడరేషన్ స్వర్ణోత్సవంలో భాగంగా మే2న బాపట్లలో రాష్ట్ర విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ మేరకు గుంటూరులోని కార్యలయంలో సోమవారం పోస్టర్స్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం కళాధర్, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షులు వెంకటేశ్వర్లు, శివ పార్వతి, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసమే బీజేపీతో పొత్తు

- ఏ ఒక్క ముస్లింకి అవమానం జరిగినా రాజీనామా చేస్తా
- గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని

మేడికొండూరు, ఏప్రిల్ 29: రాష్ట్రాభివృద్ధి కోసమే బీజేపీతో పొత్తు పెట్టుకోవాల్సి వచ్చిందని, తాను ఎంపీగా గెలిచిన తరువాత ఏ ఒక్క ముస్లింకు అవమానం జరిగినా తన పదవికి రాజీనామా చేస్తానని, ఇది అల్లా సాక్షిగా ప్రమాణం చేస్తున్నానని గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సోమవారం మండలంలోని కొర్రపాడు, మందపాడు, వరగాని, సిరిపురం గ్రామాల్లో జరిగిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం అప్పులమయం, రాజధాని ముందుకు వెళ్లే పరిస్థితి లేదు, పోలవరం ఆగిపోయింది, జలజీవన్ మిషన్లో కొన్ని వేల కోట్లు ఉన్నాయి, రాష్ట్రానికి 20 లక్షల మంజూరై ఉన్నాయి. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకువచ్చి వీటికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు కలిపితే రాష్ట్రం ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో చూడవచ్చని తెలిపారు. ఇవన్నీ జరగాలంటే కేంద్ర ప్రభుత్వంతో విభేదిస్తూ కూర్చుంటే పనులు కావనే వాస్తవాన్ని ముస్లిం సోదరులు అర్థం చేసుకోవాలని కోరారు. కేంద్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. జాతీయ నాయకుడైన చంద్రబాబు నాయుడు ఎన్నో అవమానాలను భరించి బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు, గతంలోను బీజేపీతో పొత్తుకున్నా ఏ ముస్లింకు అన్యాయం జరగనీయలేదని అన్నారు. అబ్దుల్ కలామ్ వంటి వారిని రాష్ట్రపతిని చేసిన ఘనత చంద్రబాబుదని కొనియాడారు. జగన్ హయాంలో ఎంతమంది ముస్లింలకు అన్యాయం జరిగిందో ఆలోచించాలన్నారు. టీడీపీ బీజేపీకి మద్దతు ఇవ్వటం తప్పంటే మరి



మందపాడులో మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని, పక్కన శ్రావణ్‌కుమార్

వైసీపీ గెలిస్తే ఎవరికి మద్దతిస్తారో చెప్పాలన్నారు. జగన్ కేసుల కోసం బీజేపీకి అడిగీ అడగకముందే మద్దతు ఇవ్వడం నిజం కాదా అని డాక్టర్ పెమ్మసాని ప్రశ్నించారు. రాజ్యసభతో కలిపి 31మంది ఎంపీలుంటే ఏనాడైన ముస్లింలకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించారా అని అడిగారు. నాలుగు శాతం ముస్లిం రిజర్వేషన్లు విషయాన్ని తాము ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

తాడికొండ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి తెనాలి శ్రావణకుమార్ మాట్లాడుతూ నాడు చంద్రబాబును నమ్మి రైతులు 33వేల ఎకరాల భూమిని ప్రభుత్వానికి ఇచ్చారు. అసెంబ్లీ సాక్షిగా జగన్ అమరావతి రాజధానిగా అంగీరించి మోసం చేశాడు. అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతిని సర్వనాశనం చేశాడని విమర్శించారు. తాను ఇక్కడే ఇళ్లు కట్టుకున్నానని, చంద్రబాబు చెప్పిన రాజధాని కంటే గొప్పగా అమరావతిని తీర్చిదిద్దుతానని జగన్ చెప్పలేదా అని అడిగారు. రాష్ట్రం మధ్యలో ఉన్న ప్రాంతాన్ని రాజధానిగా అందరూ అంగీకరించినందునే ఇక్కడ రాజధాని ఏర్పాటు అయిందని అన్నారు. రాజధాని పూర్తయితే మన పిల్లల ఉద్యోగాలు వస్తాయని, మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశపడి ప్రభుత్వానికి భూములు ఇస్తే వైసీపీ అధికారంలోకి వచ్చాక అమరావతిని సమూలంగా నాశనం చేయడం కాకుండా మూడు రాజధానులని జగన్మోహన్ రెడ్డి ప్రజల్ని మోసం చేస్తున్నాడని దుయ్యబట్టారు. ర్యాలీలో మాజీ జడ్పీటీసీ సభ్యులు గుంటుపల్లి సాంబశివరావు, పాములపాటి శివన్నారాయణ, ఫిరంగిపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నార్నె శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు గడ్డం రాంబాబు, షేక్ అబ్దుల్ గఫూర్, మర్రిపూడి రాంబాబు, కడియాల గణేష్, తాడికొండ జనసేన నాయకుల బేతపూడి విజయశేఖర్ తదితరులతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచార సభకు హాజరైన ప్రజలు, కూటమి పార్టీల శ్రేణులు

క్రీస్తు బోధనలు ఆచరణీయం

- టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

పెదకాకాని, ఏప్రిల్ 29: ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయమని గుంటూరు పార్లమెంట్ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ప్రతి సోమవారం పెదకాకాని స్వస్థితశాల(తోట)లో జరిగే ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ కాకాని స్వస్థతశాల గురించి తెలుసుకున్నామని, ఎంతో మహిమాన్విత ప్రదేశంగా ఆయన కొనియాడారు. వేలాదిమంది భక్తులు ఇక్కడికి వచ్చి జరిగే ప్రార్థనలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉన్నారు. క్రీస్తు బోధనలో శాంతి, దయ, కరుణ, ప్రేమ వంటి వాటిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని, అప్పుడే ప్రపంచశాంతి సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. అనంతరం డాక్టర్ జె.శామ్యూల్ కిరణ్‌చే ప్రత్యేక ప్రార్థనలు జరిపించి, ఆశీర్వచనం పొందారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ (పొన్నూరు), తెనాలి శ్రావణ్‌కుమార్(తాడికొండ), మొహమ్మద్ నసీర్ అహ్మద్(గుంటూరు తూర్పు), బీసీ సంఘం నాయకులు తాళ్ల వెంకటేష్ యాదవ్, పెదకాకాని మండల టీడీపీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వస్థితశాలలో పెమ్మసాని, ధూళిపాళ్ల, శ్రావణ్‌కుమార్, నసీర్ తదితరులు



పైపును పగలకొట్టడంతో వృధాగా పోతున్న తాగు నీరు

జగన్ సభ కోసం తాగునీరు పైప్‌లైన్ ధ్వంసం

పొన్నూరుటౌన్, ఏప్రిల్29: పొన్నూరు పట్టణంలో సోమవారం జరిగిన వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి సభ కోసం మంచినీటి పైప్‌లైన్ ధ్వంసం చేసిన సంఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో సోమవారం సీఎం సిద్ధం సభ జరిగింది. ఈ సభ కోసం బారికేడ్లు పాతేందుకు రోడ్లకు యంత్రాలతో డ్రిలింగ్ చేశారు. రేపల్లె బస్టాండ్ సెంటర్ వద్ద డ్రిలింగ్ చేస్తుండగా మంచినీటి పైప్ లైన్ ధ్వంసమై నీరు ఎగజిమ్మి వృధాగా పోయింది.

డాక్టర్ నరేష్‌బాబుకు థామస్ వైట్ క్లౌడ్ అవార్డ్

గుంటూరు (మెడికల్) ఏప్రిల్ 29: గుంటూరు నగరానికి చెందిన సీనియర్ స్పైన్ సర్జన్ డాక్టర్ జె.నరేష్‌బాబు, సర్వైకల్ స్పాండిలోసిస్ వ్యాధిపై సమర్పించిన పరిశోధన పత్రానికి అంతర్జాతీయ స్థాయిలో థామస్ వైట్ క్లౌడ్ అవార్డు లభించింది. కాలిఫోర్నియాలోని శాండియాగోలో ఇటీవల జరిగిన స్కోలియోసిస్ రీసెర్చ్ సొసైటీ 31వ వార్షిక సదస్సులో డాక్టర్ నరేష్‌బాబు ఈ అవార్డు అందుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా అందిన 1500 పరిశోధన పత్రాలను పరిశీలించి తొలి 100 పేపర్లను పోడియం ప్రదర్శనకు ఎంపిక చేశారు. వీటిలో మొదటి 15 పేపర్లు అవార్డుకు ఎంపిక చేశారు. ఇందులో కూడా న్యాయ నిర్ణేతలు, డాక్టర్ల పోల్ ఆధారంగా ఉత్తమ పరిశోధన పత్రాన్ని ఎంపిక చేశారు. సోమవారం గుంటూరులోని మల్లిక స్పైన్ సెంటర్‌లో డాక్టర్ నరేష్‌బాబు విలేకర్లతో మాట్లాడుతూ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ నరేష్‌బాబు

ప్రభుత్వాస్పత్రిలో రోగులకు షాక్ ట్రీట్‌మెంట్

- రూ.10 లక్షలతో ఈసీటీ పరికరాలు ఏర్పాటు

గుంటూరు (మెడికల్), ఏప్రిల్ 29: గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి మానసిక వ్యాధుల వైద్య విభాగంలో కొత్తగా షాక్ ట్రీట్‌మెంట్ (ఎలక్ట్రో కన్వల్షన్ థెరపీ/ఈసీటీ) చికిత్సలను అందుబాట్లోకి తెచ్చారు. సోమవారం జీజీహెచ్ మానసిక జబ్బుల వైద్య విభాగంలో రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన ఈసీటీ రూమ్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ ప్రారంభించారు. మత్తు వైద్య నిపుణుల సహకారంతో రోగులకు సైకియాట్రిస్టులు షాక్ ట్రీట్‌మెంట్ ఇస్తారని ఆయన వివరించారు. దాతలు శ్రీనివాస్, రాంబాబు, శోభన్‌బాబు షాక్ ట్రీట్‌మెంట్ ఛాంబర్ ఏర్పాటుకు తగిన తోడ్పాటు అందించినట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మానసిక జబ్బుల వైద్యవిభాగాధిపతి డాక్టర్ ఎస్.ఉమాజ్యోతి, మత్తు వైద్య విభాగాధిపతి డాక్టర్ పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబాయిని చంపిన

యువకుడికి జీవిత ఖైదు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 29: స్వల్ప వివాదం నేపథ్యంలో బాబాయిని చంపినట్టు నేరం అంగీకరించటంతో నిందితుడు పట్టణంలోని క్రిష్టియన్ పాలెంకు చెందిన రేపూడి కళ్యాణ్‌బాబు (29)కు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ సోమవారం తీర్పు వెలువరించారు. ఈ ఏడాది జనవరి 6న రేపూడి రాజు తన ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా కళ్యాణ్ బాబు పాత వివాదం నేపథ్యంలో కట్టెను తీసుకొని విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఈ ఘటనలో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య కోటేశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసుకున్న సీఐ ఏ.భాస్కర్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలుచేశారు. కోర్టులో చేసిన నేరం గురించి న్యాయాధికారి నిందితుడిని ప్రశ్నించగా కళ్యాణ్‌బాబు నేరం అంగీక రించాడు. దీంతో జడ్జి పై విధంగా శిక్షను వెలువరించారు.



రేపూడి కళ్యాణ్ బాబు(ఫైల్)

జొన్న పంట దహనం..

- రూ. 2 లక్షల నష్టం ● వైసీపీ దుండగుల దుశ్చర్య

కారంపూడి, ఏప్రిల్ 29: చేతికొచ్చిన పంటను సైతం వదలడం లేదు వైసీపీ దుండగులు. నోటి కాడికి వచ్చిన జొన్నపంటను నిర్థాక్షిణ్యంగా తగులబెట్టిన ఘటన మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. గ్రామానికి చెందిన కొమ్ము ఏసోబు ఐదెకరాల్లో జొన్న సాగుచేశారు. ఆదివారం పంటను కోసి బోరాల్లోకి ఎత్తి పొలంలోనే ఉంచాడు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి బోరాలు కాలిపోయి ఉన్నాయి. రూ.2 లక్షల దాకా నష్టం వాటిల్లిందని బాధితుడు ఏసోబు తెలిపారు.

ఏసోబు గ్రామంలో టీడీపీ పక్షాన చురుకుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల అభ్యర్థి బ్రహ్మారెడ్డిలు పెదకొదమగుండ్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఏసోబు, అతని మేనల్లుడు ఏసుబాబులు పాల్గొని గ్రామం నుంచి జనసమీకరణ కూడా చేశారు. అంతేకాక ఈనెల 24న జరిగిన కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి నామినేషన్‌కు వెళ్లారు. దీంతో వైసీపీ నేతలు అతనిపై కక్ష పెంచుకున్నారు. పార్టీ మారాలని, వైసీపీ కండువా కప్పుకోవాలని బెదిరింపులకు దిగారు. అందుకు వారు అంగీకరించలేదు. దీంతో చేతికొచ్చిన పంటను నిర్థాక్షిణ్యంగా తగులబెట్టారు. కాగా బాధితుడు ఏసోబు కారంపూడి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇదే గ్రామంలో ఈనెల 20న ఎస్సీ సామాజిక వర్గానికేచెందిన కొమ్ము పేరయ్యకు చెందిన నీళ్ల మోటారు, పైపులను ధ్వంసం చేశారు. ఈనెల 18న ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు నామినేషన్‌కు జనసమీకరణ చేశాడనే కక్షతోనే పేరయ్యకు ఆస్థినష్టం కలిగించారు వైసీపీ రౌడీ మూకలు. గ్రామంలో దళితులను టార్గెట్ చేస్తూ దాడులు జరుపుతున్నారు.



తగులబడిన జొన్న పంట, బూడిదైన పంటను చూపుతున్న ఏసోబు



శ్రీకృష్ణదేవరాయలుతో కేక్ కట్ చేయిస్తున్న జీవీ ఆంజనేయులు, మక్కెన, ధారూనాయక్

అధికారంలోకి రాగానే ఇంటింటికి తాగు నీటి కుళాయి ..

- నరసరావుపేట ఎంపీ అభ్యర్థి శ్రీ కృష్ణ దేవరాయలు
- బొల్లా అవినీతి, అక్రమాలపై విచారణ చేయిస్తా.. జీవీ ఆంజనేయులు

బొల్లాపల్లి, ఏప్రిల్ 29 : ఇప్పటికే తాను వరికపుడిసెల అనుమతులు తీసుకువచ్చానని, కూటమి ప్రభుత్వం రాగానే జీవీ ఆంజనేయులతో కలసి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేసి ఇంటింటికి తాగు నీటి కుళాయిని ఏర్పాటు చేస్తామని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని సోలాయపాలెం, గండిగనుమల, దోమలగుండం, దోమల గుండం తండా, మేకల దిన్నె, అయ్యన్నపాలెం, గుమ్మనం పాడు, గరికపాడు, పమిడిపాడు గ్రామాల్లో సోమవారం వినుకొండ నియోజక వర్గ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయుల, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులతో కలసి లావు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కృష్ణాజలాలను బొల్లాపల్లి మండలానికి తీసుకు వస్తామన్నారు. బ్రహ్మనాయుడు అవినీతి, అక్రమాలపై విచారణ చేయిస్తామన్నారు. గ్రామాల్లో తాగు నీరు లేక అల్లాడి పోతుంటే ఎమ్మెల్యే బొల్లా ఈ ఐదు సంవత్సరాల్లో కనీసం ఒక్కసారైనా గ్రామాల్లో వెళ్ళిన దాఖలాలు ఉన్నాయా? అని పశ్నించారు. టీడీపీ హయాంలో వేసిన రోడ్ల మీదనే ఇప్పటికీ ప్రజలు తిరుగుతున్నారన్నారు. గ్రామాల్లో కనీసం మురుగు కాలువలు కూడా కట్టించేందుకు చేతగాని దద్దమ్మలు వైసీపీ నేతలని దుయ్యబట్టారు. సూపర్ 6 పథకాలను వివరించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వికలాంగులకు రూ.6 వేలు, వృద్ధులకు రూ.4వేలు పింఛన్లను అందచేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తదితర పథకాల గురించి వివరించారు. శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. మంచి, చెడును చూసి ఓటు వేయాలన్నారు. అహంకార ఎమ్మెల్యేను గద్దె దించాలని పిలుపునిచ్చారు. బొల్లాపల్లి మండలంలో ప్రతి ఊరు ప్రచారానికి వచ్చిన కూటమి నాయకులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు జన్మదినం సందర్భంగా ప్రతి గ్రామాలో కేక్‌ను కట్ చేసి కృష్ణ దేవరాయలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో పార్టీ నేతలు ధారూనాయక్, గోవిందు నాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, జారు నాయక్, కోట నాయక్, హనుమా నాయక్, ఆరికట్ల వాసుదేవరెడ్డి, బారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, అర్దలపూడి శ్రీనివాసరావు, ఆళ్ళ మన్నెయ్య, గోనుగుంట్ల వెంకటేశ్వర్లు, వెలిశెట్టి నరసింహారావు, యర్రంశెట్టి జయరావు, పరిటాల రామచంద్రయ్య తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు, కూటమి సభ్యులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ తదితరులు

ప్రజలను నయవంచన చేస్తున్న జగన్

- పొన్నూరు కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, ఏప్రిల్29: పొన్నూరు ప్రజలను మరోసారి నయవంచన చేయటానికి జగన్మోహన్‌రెడ్డి పొన్నూరు వస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ధ్వజమెత్తారు. చింతలపూడి డీవీసీ కళ్యాణ మండపంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఒక ఛాన్స్‌ను ఉపయోగించుకొని రాష్ట్రాన్ని జగన్, పొన్నూరులో కిలారి వెంకట రోశయ్య దోచుకున్నారన్నారు. పొన్నూరు ప్రజల సంపద రూ.2,540 కోట్లు దోచుకున్నారని సాక్ష్యాలతో సహా ప్రజాచార్జి షీట్‌ను దాఖలు చేశామన్నారు. తాము ఆరోపణలు చేసిన ప్రతిసారి జగన్ రెడ్డి ఎమ్మెల్యే రోశయ్యను పిలిపించి కప్పం కట్టించుకొని పంపించి వేశారని ఎద్దేవా చేశారు. పొన్నూరులో రేషన్, మద్యం, గంజాయి మాఫియా, సెటిల్‌మెంట్లు ఐదేళ్ల కాలంలో చెలరేగిపోయారని ఆరోపించారు. రేషన్ వ్యాపారి దళితుడైన అంజి బర్నబాసు అనే వ్యక్తిని ఎమ్మెల్యే అయిన అనుచరులు కిరాతకంగా హత్య చేసారని ఆరోపించారు. అనమర్లపూడి గ్రామంలో 50 ఏళ్లగా హక్కుల కోసం పోరాడుతున్న దళితుల భూములు 50 కోట్లు విలువ చేసే 22 ఎకరాల భూమిని ఎమ్మెల్యే రోశయ్య బినామి దారులకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ధ్వజమెత్తారు. ధాన్యం, మొక్కజొన్న, జొన్న కొనుగోళ్లలో రైతులను దోచుకున్నారని ఆరోపించారు. పొన్నూరు పట్టణంలో అమాయిక ఆర్యవైశ్యులను బెదిరించి రోడ్డు విస్తరణ పేరుతో అడ్డగోల్లుగా భవనాలను కూల్చివేశారన్నారు. పాదయాత్ర సందర్భంగా కొమ్మమూరు కాల్వ, హైలెవల్ ఛానల్ ఆధునికీకరణ గురించి మాట్లాడిన జగన్ ఐదేళ్ల కాలంలో ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. గుంటూరు ఛానల్ అభివృద్ధికి తాము తెచ్చిన నిధులు కూడా వదిలేసారని ఆరోపించారు. చేబ్రోలులో వికలాంగుడైన ముస్లి మైనార్టీ హత్య, నారాకోడూరులో మార్కెట్ యార్డు ఉద్యోగి బాషా హత్యపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ప్రజలను నయవంచన చేసిన జగన్ రెడ్డి పొన్నూరు ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని నరేంద్ర డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జనసేన చేబ్రోలు మండల అధ్యక్షుడు చందు శ్రీరాములు, పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, దేశంశెట్టి సూర్య, తదితరులతోపాటు టీడీపీ, బిజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లెల వెంకటరావు, పాల్గొన్న దళిత సంఘ నాయకులు

దళితులపై జగన్‌ది కపట ప్రేమ

- మాలమహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకటరావు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27: నా ఎస్సీ, ఎస్టీ అన్ని చెప్పి కమట ప్రేమ చూసి ఆయా వర్గాల ఓట్లతో గద్దెనెక్కిన సీఎం జగన్‌ను గద్దెదించటమే లక్ష్యంగా మాలలు రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తారని మాలమహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు తెలిపారు. సోమవారం అరండల్‌పేటలోని ఓ హోటల్లో మాలల ఐక్యసంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలలకు మేన్నల్లుడిగా చెప్పుకునే జగన్ మాలలనే హత్య చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నమ్మి ఓట్లు వేసి అధికారంలోకి తీసుకు వస్తే ఎస్సీలనే హత్యలు చేసి శవాలను ఇళ్లకు పంపించిన ఘనుడు జగన్ అని విమర్శించారు. రాజ్యాంగం నిర్దేశించిన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలను మొత్తం రద్దు చేసి రూ.70 వేల కోట్లు సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లించారన్నారు. రానున్న ఎన్నికల్లో మాల సంఘాల ఐకాస టీడీపీకి సంపూర్ణ మద్దతు తెలియచేస్తూ, ఆ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కొండపల్లి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

శక్తివంతమైన ప్రాంతం అమరావతి

- 1595వ రోజుకు చేరుకున్న ఆందోళనలు

తుళ్లూరు, ఏప్రిల్ 29: అమరావతిని నాశనం చేద్దామనుకుంటే వైసీపీ వారికి తగినశాస్తి జరుగుతుందని 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. అమరావతి జోలికి వచ్చి ఇప్పటికే వైసీపీ పాలకులు భ్రష్టు పట్టి పోయారని అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్‌ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు సోమవారం నాటికి 1595వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, శక్తివంతమైన అమరావతి జోలికివచ్చి సీఎం జగన్‌రెడ్డి ఇంటికి వెళ్లటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చేది విజనరి ప్రభుత్వమన్నారు. అమరావతిని నిలబెడతారన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

79,660 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 90,353 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 79,660 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 53,394 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17000
నెంబరు. 5	9000	14500
273	10000	14500
341	9500	16500
4884	10000	15000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	9500	15000
దేవనూరు డీలక్స్	8500	15000
తెల్లకాయలు	5000	11500

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138, 147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00

తెలుగుదేశానికే మా మద్దతు

● మైనారిటీ సంఘాల ఐక్య కార్యచరణ సమితి



సమావేశంలో మాట్లాడుతున్న షబ్లి

గుంటూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకే తమ మద్దతు ఉంటుందని మైనారిటీ సంఘాల ఐక్య కార్యచరణ సమితి ప్రకటించింది. గుంటూరు బ్రాడీపేటలోని సింధూరి హోటల్‌లో సోమవారం ముస్లిం హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఖాజావలి ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిం మైనార్టీల సంక్షేమం-నాడు నేడు' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫరూక్ షబ్లీ హాజరయారు. సమావేశంలో పాల్గొన్న 17 మైనారిటీ సంఘాలు ఏకగ్రీవంగా తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇస్తూ తీర్మానం చేశారు. రానున్న రోజుల్లో చంద్రబాబును రాష్ట్రానికి ముఖ్యమంత్రి చేసుకుంటేనే మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి, ఆర్థిక, రాజకీయ, సామాజిక, మతపరమైన అన్ని అంశాల్లో కూడా అభివృద్ధి చెందుతామని అన్ని సంఘాల నాయకులు ముక్తకంఠంతో చెప్పారు. షబ్లీ మాట్లాడుతూ ఐదు కోట్ల మంది ఏకైక రాజధాని అమరావతిని మనం కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణ, గుంటూరు జిల్లాలో నెలకొన్న అమరావతిలో 750 మసీదులు అలాగే 8 నుండి 9 లక్షల ముస్లిం జనాభా ఉన్నారన్నారు. విజయవాడ, గుంటూరులో ఏషియాలోనే ప్రముఖమైన ఆటోనగర్ కొలువై ఉందని, ఇక్కడ అనేకమంది ముస్లింల ఆర్థిక అభివృద్ధి ముడిపడి ఉందని అన్నారు. సుప్రీంకోర్టులో ఉన్న 4 శాతం రిజర్వేషన్ అంశంపై వైసీపీ తప్పుడు ప్రచారాలు చేస్తూ ముస్లిం సమాజాన్ని మోసం చేయాలని కుట్ర చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2014 నుంచి 2019 వరకు బీజేపీతో కలిసి ఉండి కూడా ముస్లింలను అన్ని విధాలు ఆదుకున్న నాయకుడు చంద్రబాబు అన్న సంగతి ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని అన్నారు. షేక్ ఖాజావలి మాట్లాడుతూ మైనార్టీలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. బీజేపీ బూచిని చూపి ముస్లింలు తెలుగుదేశానికి ఓటు వేయవద్దని ప్రచారం చేస్తున్న వైసీపీ మోదీకి ఐదు సంవత్సరాలు భేషరతు మద్దతు ఇచ్చిన సంగతి అందరికీ తెలిసినదేనన్నారు. ముస్లింలంతా తెలుగుదేశం పార్టీకి ఓటు వేసే విధంగా చైతన్యపరచ నున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇస్లామిక్ ఫ్రంట్ అధినేత షేక్ అక్రం, ముస్లిం చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగూర్, వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు షేక్ లాల్ వజీర్, తాడికొండ మైనార్టీ నాయకులు షేక్ జిలాని, రాష్ట్ర ఇమాన్ మజీస్ కమిటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్, రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు షేక్ కరీముల్లా, తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ గని తదితరులు ప్రసంగించారు.

రాష్ట్రానికి పట్టిన దరిద్రమే జగన్

● టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారూనాయక్

గుంటూరు, ఏప్రిల్ 29 : ఈ రాష్ట్రానికి పట్టిన దరిద్రమే జగన్ అని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారూనాయక్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేసారు. రాష్ట్రంలో సంక్షోభాన్ని మిగిల్చింది జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమేనన్నారు. మూడు రాజధానుల అంశాన్ని తెరమీదకు తెచ్చి ప్రాంతాల మధ్య, కులాల మధ్య చిచ్చు పెట్టి సైకో ఆనందం పొందాడన్నారు. గత ఎన్నికలలో పూర్తి మద్యపాన నిషేధం అని నమ్మబలికి అధికారంలోకి వచ్చినప్పటి నుండి నాసిరకం జె బ్రాండ్ మద్యం అమ్మకాలు జరిపి కోట్లు రూపాయలు నింపుకుంటున్నాడన్నారు. టీడీపీ హయాంలో పేదోడికి పట్టెడు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లు రద్దు చేసిన దుర్మార్గుడు జగన్ రెడ్డి అన్నారు. నిరుద్యోగ యువతకు మెగా డీఎస్సీ, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ అని నమ్మబలికి నయవంచన చేసిన జగన్ రెడ్డి .ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను, కార్పొరేషన్ నిధులను దారిమళ్లించి దళిత ద్రోహిగా నిలిచాడన్నారు. రైతులకు కావలసిన ఎరువులు, వ్యవసాయ సంబంధిత పరికరాలపై సబ్సిడీని తొలగించిన రైతు ద్రోహి జగన్ అన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా వలంటీర్లకు రూ.10 వేలు అందజేస్తామని, అదే విధంగా అవ్వ, తాతలకు, వితంతువులకు ప్రతి నెల రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు వలంటీర్ల ద్వారా ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. జగన్‌రెడ్డి పాలనలో 300 మందికి పైగా బీసీలను క్రూరంగా హత్య చేశారని, బీసీలను సంరక్షించేందుకు బీసీ రక్షణ చట్టం తెస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం 75 వేల కోట్ల సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించిందని, ఎన్డీయే అధికారంలోకి రాగానే బీసీ సబ్ ప్లాన్ ద్వారా ఐదేళ్లలో లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామన్నారు. ఎన్నికలలో జగన్ రెడ్డి ప్రభుత్వాన్ని అన్ని వర్గాల ప్రజలు గద్దె దించి బాబుకి పట్టం కట్టడానికి సంసిద్ధంగా ఉన్నారని ధారూనాయక్ వివరించారు

కూటమి విజయమే లక్ష్యంగా గిరిజనులంతా ఏకం కావాలి

● గిరిజన సంఘాల నాయకుల పిలుపు

గుంటూరు, ఏప్రిల్ 29 : గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కావాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ఎన్‌డీఏ కూటమి విజయమే లక్ష్యంగా పని చేయాలని గిరిజన సంఘాల నాయకులు రమావత్ భీకునాయక్ పిలుపునిచ్చారు. అరండల్‌పేటలోని కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధినేత, సీఎం జగన్ గిరిజనులకు అండగా ఉంటానని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన సంక్షేమం పట్టించుకోకుండా మోసం చేశారని విమర్శించారు. ఎస్టీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. మరలా గిరిజనులు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ప్రభుత్వం తప్ప వేరే అవకాశం లేదని చెప్పారు. ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించి అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యానాది హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిరువీధుల శంకర్ ప్రసాద్, లంబాడి హక్కుల పోరాట సమితి మూడవత్ శివానాయక్, గిరిజన నాయకులు మానుపాటి ఏడుకొండలు, ఉయ్యాల గోపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన నృత్యప్రదర్శనలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 29: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికలోశ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ నిర్వహిస్తున్న 14వ అంతర్జాతీయ నృత్య దినోత్సవాలు ఘనంగా ముగిసాయి. ముగింపు కార్యక్రమాల్లో భాగంగా శుభ సమాపన ఉత్సవాలు ఉదయం 9 గంటలకు నటరాజ పూజ, నృత్య నివేదనగా 108 మంది శరణం భవ కరుణామయి తరంగాన్ని సాంప్రదాయ దుస్తులతో నర్తించారు. సాయంత్రం జరిగిన ముగింపు సభకు ఆలయ కమిటీ అధ్యక్షుడు మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత జరిగిన సభకు కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రం ప్రధానాధ్యాపకులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ కూచిపూడి భరతనాట్య అధ్యాపకులు ప్రొఫెసర్ పసుమర్తి రామలింగేశ్వర శాస్త్రికి కూచిపూడి నాట్య విద్వాంసులు, ప్రముఖ సినీ నృత్య దర్శకులు పసుమర్తి కృష్ణమూర్తి జీవిత సాఫల్య పురస్కారంను సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజ వేంకట సుబ్రహ్మణ్యం అందించారు. అనంతరం హేమంత్ విశ్వకర్మ(కోల్‌కత్తా) మణిపురి నృత్యం, తరిత్ సర్కార్(ఉత్తరాఖండ్) కథక్, బిరాజ్ రామ్(కోల్‌కత్తా) సత్రియ నృత్యాలను కన్నుల పండువగా నర్తించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. వీరిని యువ కళరత్న పురస్కారంతో సత్కరించారు. సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం వందన సమర్పణ చేశారు. కార్యక్రమాలను కోశాధికారి వెంకటగిరి నాగలక్ష్మి, పెద్ది మాధవి, పచ్చల రాధిక కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


108 మంది కళాకారులతో నృత్య ప్రదర్శనలు

వైభవంగా శ్రీ మహాలక్ష్మమ్మకి లక్ష కనకాంబరాలతో పూజ


లక్ష కనకాంబరాలతో శ్రీమహాలక్ష్మమ్మ

గుంటూరు, ఏప్రిల్ 29: శారదాకాలనీ 27వ లైనులో ఉన్న శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం లక్ష కనకాంబరాల పూలతో పూజా కార్యక్రమం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే సుప్రభాత సేవతో పాటు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దంపతులతో సామూహిక వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రావి వెంకట రత్నం, కార్యదర్శి దుగ్గినేని మహాలక్ష్మయ్య, కోశాధికారి గొడుగులూరి సుబ్బారావు తదితరులున్నారు.

యువత భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ

● పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గళ్లా మాధవి


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న గళ్లా మాధవి, డేగల ప్రభాకర్

గుంటూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యువత భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని, ఆయనే వారి భవిష్యత్తుకు గ్యారంటీ అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి గళ్లా మాధవి అన్నారు. నియోజకవర్గంలోని 37వ డివిజన్‌లోని రామన్నపేట, కొరిటెపాడు, 43వ డివిజన్లో కళ్యాణి రోడ్, విద్యానగర్, 19వ డివిజన్ నల్లచెరువులో ఆమె సోమవారం ఎన్నికల ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కక్ష రాజకీయాలు, వేధింపులు తప్ప ఈ రాష్ట్రాభివృద్ధిని గాలికి వదిలేశారని, ఉద్యోగాల పేరుతో వలంటీర్ల పోస్టులను ఇచ్చి యువతను జగన్ వంచించారని విమర్శించారు. వంచనకు మారుపేరైన జగన్‌రెడ్డిని గద్దెదించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకుంటే యువత భవిష్యత్‌కు గ్యారెంటీ దొరుకుతుందని గళ్లా మాధవి చెప్పారు. వైసీపీ హయాంలో వ్యవస్థలన్నీ నాశనం అయ్యాయని, కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు వేరే రాష్ట్రాలకు తరలిపోయాయని, మళ్లీ ఈ రాష్ట్రం బాగుపడాలన్నా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరకాలన్నా చంద్రబాబు లాంటి సమర్థుడైన నాయకుడిని ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. మహానాడు వేదికగా చంద్రబాబు విడుదల చేసిన మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరావు, ముత్తినేని రాజేష్, రాళ్లబండి రామరాజు, లాల్ వజీర్, ఆర్ వి నారాయణ, మానం రవీంద్ర వెంకటరమణ, వజ్జా రామకృష్ణ, సూర్యం బీజేపీ నేత తిరుపతిరావు, అలవల అంజిరెడ్డి, జనసేన నేతలు నారదాసు రామచంద్రప్రసాద్, ఇమ్మడి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలోకి చేరికలు

గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 39వ డివిజన్ తుఫాన్ నగర్‌కు చెందిన టీడీపీ 26వ బూత్ ఇన్‌చార్జి రావినూతల ప్రభుదాస్ ఆధ్వర్యంలో సోమవారం 60 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి గళ్లా రామచంద్రరావు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు వైసీపీ గ్రాఫ్ పడిపోతోందని, చేరికలతో టీడీపీ బలం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో వల్లంశెట్టి వీరయ్య, కొల్లి అనిల్, గార్డెన్స్ శ్రీకాంత్, వల్లంశెట్టి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరినవారితో గళ్లా రామచంద్రరావు

హోమ్ ఓటింగ్‌ని అత్యంత జాగ్రత్తగా చేపట్టాలి

● కమిషనర్, ఆర్వో కీర్తి చేకూరి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 29 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే హోం ఓటింగ్‌ని అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని, హోం ఓటింగ్ సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థులు లేదా వారి పోలింగ్ ఏజంట్లు కూడా ఉంటారని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో హోం ఓటింగ్, ఈవీఎంల కమిషనింగ్, ఫెసిలిటేషన్ సెంటర్స్ అంశాలపై ఏఆర్‌ఓలతో కలిసి సెక్టార్ అధికారులు, హోం ఓటింగ్ బృందాలు, పోస్టల్ బ్యాలెట్ బృందాల సభ్యులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్, ఆర్‌ఓ మాట్లాడుతూ ఎన్నికల విధులు అత్యంత కీలకమని, ప్రస్తుతం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా అమలు చేయనున్న హోం ఓటింగ్ విధి, విధానాలపై విధులు కేటాయించబడిన వారంతా సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. హోం ఓటింగ్ సమయంలో పూర్తి స్థాయిలో వీడియోగ్రఫీ రికార్డు చేయబడుతుందని, పోటీలో ఉన్న అభ్యర్థులు లేదా వారి పోలింగ్ ఏజంట్లు కూడా ఉండవచ్చని తెలిపారు. కాని ఓటింగ్ రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరగాలని, ఓటు వేసే వారికి ప్రత్యేక కంపార్టుమెంట్ ఏర్పాటు చేస్తామన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణకు పోలీసు సిబ్బంది ఉంటారన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను తు.చ. తప్పకుండా కఠినంగా అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. తూర్పు నియోజకవర్గంలోని హోమ ఓటింగ్ కోసం 5 బృందాలను ఏర్పాటు చేశామని, ఆయా బృందాల పర్యవేక్షణకు ఏఆర్‌ఓ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో మైక్రో అబ్జర్వర్ టీంలను కూడా నియమించామని తెలిపారు. ఒక్కో బృందానికి రూట్ మ్యాప్ సిద్ధం చేశామని, పోలింగ్ స్టేషన్ల వారిగా విధులు కేటాయించబడిన సిబ్బంది సంబంధిత బీఎల్‌ఓలతో సమన్వయం చేసుకోవాలన్నారు. బీఎల్‌వోలు తమ పరిధిలోని హోం ఓటర్లకు ఓటింగ్ విధానం, ఏ రోజు ఓటు వేయాలి, అవసరమైన గుర్తింపు కార్డులు అందుబాటులో ఉంచుకునేలా అవగాహన కలిగించాలన్నారు. క్షేత్ర స్థాయిలో సహకరించని బీఎల్‌వోల వివరాలు వెంటనే ఏఆర్‌ఓల దృష్టికి తీసుకురావాలని, వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు హోం ఓటింగ్, ఈవీఎంల కమిషనింగ్, ఫెసిలిటేషన్ సెంటర్స్ నిర్వహణపై అవగాహన కలిగించారు. సమావేశంలో ఏఆర్‌ఓలు సునీల్ కుమార్, భీమరాజు, ప్రదీప్ కుమార్, వెంకటలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, సెక్టార్ అధికారులు, హోం ఓటింగ్ బృందాలు, పోస్టల్ బ్యాలెట్ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

నిబంధన ప్రకారమే మద్యం విక్రయించాలి

● ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తనిఖీ చేసిన ఎక్సైజ్ శాఖ డీసీ

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 29 : ప్రభుత్వ నిబంధన ప్రకారమే మద్యాన్ని విక్రయించాలని గుంటూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాబ్జీరావ్ హెచ్చరించారు. సోమవారం గుంటూరు నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, నల్లపాడు ప్రాంతాల్లోని ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా మద్యం దుకాణాల్లో ఉదయం ఎంత స్టాక్ ఉంది.. ఎంత మద్యాన్ని విక్రయించారు, ఇంకా బ్యాలెన్స్ ఎంత ఉంది అన్న అంశాలను పరిశీలించారు. బాబ్జీరావ్ మాట్లాడుతూ మద్యం అమ్మకాల్లో సిబ్బంది అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్మకాలన్నీ పారదర్శకంగా జరగాలన్నారు. నిబంధన మేరకు మద్యాన్ని విక్రయిస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక, డీసీ స్క్వాడ్ సీఐ వై.అశోక్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


హౌసింగ్ బోర్డ్ కాలనీలో ప్రభుత్వ మద్యం దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాబ్జీరావ్

ధరలు పెంచకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలి

గుంటూరు, ఏప్రిల్ 29 : అధికారం కోసం పోటీ పడుతున్న రాజకీయ పక్షాలు అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకులు, ఇతర ఛార్జీలు పెంచకుండా సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో పార్టీల మేనిఫెస్టోలు, పథకాలు, భారాలు అనే అంశంపై సోమవారం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు ఇచ్చే వాటిని పార్టీలు పోటీ పడి ప్రకటనలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్తి, జీఎస్‌టీ, విద్యుత్ ఛార్జీలు, ఇసుక, పెట్రోల్, గ్యాస్ సహా నిత్యావసర సరుకుల ధరలు పెంచి కొత్త భారాలు ప్రజలపై మోపబోమని, ప్రజల సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టబోమని హామీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధరలు పెంచకుండా పథకాలు అమలు చేస్తేనే ప్రజలకు మేలు చేసినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సుబ్బారెడ్డి, సింగరయ్య తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఏప్రిల్ 29 : విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కోబాల్ట్‌పేట, దేవాపురం, కృష్ణనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డి 8 సెక్షన్ ఏఈ చిట్టిబాబు తెలిపారు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా మందపాటి

గుంటూరు, ఏప్రిల్ 29 : వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న డొక్కా మాణిక్యవరప్రసాద్ టీడీపీలో చేరటంతో ఆ బాధ్యతలను మందపాటికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, పార్టీ నాయకులు బందా రవీంద్రనాథ్, పలువురు నాయకులు మందపాటికి పుష్పగుచ్ఛాలు, శాలువాతో శుభాకాంక్షలు తెలిపారు.

తూర్పు ఎన్నికల బరిలో 14 మంది అభ్యర్థులు

● కమిషనర్, ఆర్వో కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 29 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల ఖర్చులను తమకు అందించిన ఎన్నికల ఖర్చుల రిజిస్టర్‌లో నమోదు చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్, ఆర్‌ఓ మాట్లాడుతూ, గుంటూరు తూర్పు నియోజకవర్గంలో నామినేషన్ల ఉపసంహరణ గడువు అనంతరం 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థి 1951 భారత ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 77 ప్రకారం తమ ఖర్చులను నిర్దేశిత రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఖర్చులు నమోదు చేసిన రిజిస్టర్‌ని, బిల్లులు, ఓచర్లను మే నెల 1, 5, 10 తేదీల్లో ఎన్నికల వ్యయ పరిశీలకుల తనిఖీకి అందించాలని తెలిపారు. అభ్యర్థులు లేదా అభ్యర్థి ఎన్నికల ఏజంట్ తప్పనిసరిగా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలలోపు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల వ్యయ పరిశీలకునితో తనిఖీ చేయించుకోవాలన్నారు.

పశ్చిమ ఎన్నికల బరిలో 28 మంది..

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 29 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో స్క్రూటినీ అనంతరం ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని, 28 మంది అభ్యర్థులు తుది పోటీలో ఉన్నారని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ సమయం అనంతరం తుది అభ్యర్థులు, పోలింగ్ ఏజంట్లతో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గుర్తుల కేటాయింపు, ప్రవర్తనావళి, ఖర్చుల నమోదు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కమిషనర్, ఆర్‌ఓ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో నామినేషన్ల ఉపసంహరణ గడువులోగా ముగ్గురు అభ్యర్థులు నూనె పవన్ తేజ నాయుడు (ఇండిపెండెంట్), స్ఫూర్తి విడదల (ఇండిపెండెంట్), సైరా బాను (ఇండిపెండెంట్) తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని, మే 13 జరిగే ఎన్నికల్లో 28 మంది అభ్యర్థులు పోటీలో ఉంటారని తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అభ్యర్థుల సమక్షంలోనే గుర్తులు కేటాయింపు చేసామని, ఒక గుర్తుని ఒక్కరికంటే అదనంగా అడిగిన వారికి లాటరీ ద్వారా కేటాయింపు చేయటం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో ఏఆర్‌ఓలు సీనారెడ్డి, సీహెచ్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ సాంబశివరావు, అభ్యర్థులు, పోలింగ్ ఏజంట్లు పాల్గొన్నారు.

నేటి నుంచి నాలుగు రైళ్ల పునరుద్ధరణ

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి నాలుగు రైళ్ల సర్వీసులను పునరుద్ధరిస్తున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు 07580 మాచర్ల - నడికుడి, 07579 నడికుడి - మాచర్ల, 17646 రేపల్లె - సికింద్రాబాద్, 17645 సికింద్రాబాద్-రేపల్లె ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 30వ తేదీ నుంచి పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు. నెంబరు 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ సాధారణ రైలుమార్గం నడికుడి మీదగానే ప్రయాణిస్తుందన్నారు. నెంబరు.17646 రేపల్లె- సికింద్రాబాద్ రైలుని నిర్ణీత సమయానికి నడపడం జరుగుతుందన్నారు.

బాల్య వివాహంపై కేసు నమోదు

గుంటూరు, ఏప్రిల్ 29 : బాలికను వివాహం చేసుకున్న ఉదంతంపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. బాలికకు వివాహం జరిపించారనే విషయం తెలుసుకున్న స్త్రీ, మహిళాభివృద్ధి (ఐసిడిఎస్) అధికారిణి కె.సౌమ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివాహం చేసుకున్న వ్యక్తిపై, అతని కుటుంబ సభ్యులపై సౌమ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు నగరంలోని రెడ్డిపాలెంలో గల హిమనినగర్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది.


ప్రజా దీవెన యాత్రలో మొహమ్మద్ నసీర్, షరీఫ్

'తూర్పు'ను గంజాయి హబ్‌గా మార్చిన ఎమ్మెల్యేని తరిమేద్దాం

● తూర్పు కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్

గుంటూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని గంజాయి హబ్‌గా మార్చిన ఎమ్మెల్యే ముస్తఫాను నియోజకవర్గం నుంచి తరిమేద్దామని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గుంటూరు తూర్పు నియోజక వర్గం 12వ డివిజన్లో 11వ రోజు ప్రజా దీవెన యాత్ర విజయవంతంగా సాగింది. ప్రచారంలో శాసన మండలి మాజీ ఛైర్మన్ మొహమ్మద్ షరీఫ్‌తో కలిసి ఇంటింటికి తిరుగుతూ కూటమి మేనిఫెస్టోని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పులో ఈరోజు ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు వారి సమస్యలను తెలియచేస్తున్నారని, వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గాన్ని నాశనం చేశారంటూ బాధను వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో ఏ ప్రాంతంలోకి వెళ్లినా గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోందని, యువత భవిష్యత్తు నాశనం చేస్తున్న వైసీపీ నాయకులకు తగిన బుద్ధి చెప్తామని ప్రజలే చెబుతున్నారని ఆయన తెలియజేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గంజాయి లేకుండా కట్టడి చేస్తామని నసీర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అబ్దుల్ సలీం, హఫీజ్, కార్పొరేటర్ చిష్తి, జనసేన నాయకులు కొణిదెల దుర్గ ప్రసాద్, రాజేష్, బద్రి, అన్వర్ పాల్గొన్నారు

నసీర్ ఆధ్వర్యంలో 300 మంది చేరిక

గుంటూరు తూర్పు నియోజకవర్గం 4వ డివిజన్ జాకీర్ హుస్సేన్ నగర్ వద్ద నసీర్ సమక్షంలో వైసీపీకి చెందిన నాయకులు ఎం.మేరీ, రాహేలు, సునాధం, సోజన్య, మరియమ్మ, షమ్మీ, రామిజన్, అబ్దుల్ రహీమ్, జిలాని, తదితరులు వారి కుటుంబాలతో సహా 300 మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి కండువా కప్పి నసీర్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద ఎత్తున మహిళలు పార్టీలో చేరడం ఆనందంగా ఉందని, తెలుగుదేశం పార్టీనే మహిళల అభ్యున్నతికి కృషి చేసిందని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమం టీడీపీ నాయకులు శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని, హజ్ కమిటీ మాజీ డైరెక్టర్ హుస్సేన్ బాషా, రబ్బానీ, అబ్దుల్ కాలం, బాబావాలి, హమ్మది, జనసేన నేత వెంకట్, జనసేన డివిజన్ ప్రెసిడెంట్ శాంతి కుమార్, ఇసుబ్ భాయ్, తాటి రెడ్డి నాగిరెడ్డి, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు


పార్టీలో చేరినవారితో నసీర్, షరీఫ్

తాడిశెట్టి మురళీ సమక్షంలో టీడీపీలో చేరిన గోరంట్ల వైసీపీ క్యాడర్

గుంటూరు, ఏప్రిల్ 29: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళీమోహన్ ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరికల పరంపర కొనసాగుతోంది. ఇందులో భాగంగా గుంటూరు రూరల్ మండలం గోరంట్లలో మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన క్రియాశీలక కార్యకర్తలు భారీగా టీడీపీలో చేరారు. తాడిశెట్టి మురళీ వారందరికి కండువాలతో టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీలో కష్టించిన వారికి అవమానాలు, అవస్థలు, కన్నీళ్ళే మిగులుతాయని తెలుసుకున్న కిందిస్థాయి కార్యకర్తలు టీడీపీలోకి చేరుతున్నారని పేర్కొన్నారు. టీడీపీలో మాత్రం సముచిత పదవులతో గుర్తింపు, గౌరవం ఇచ్చి ప్రోత్సహిస్తుందని అందుకు తానే నిదర్శనమని తాడిశెట్టి మురళీ అన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీకి ఓటమి అనే బహుమతిని ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తాజా చేరికలతో ప్రత్తిపాడు వైసీపీ ఖాళీ అవుతుందన్నారు. కార్యక్రమంలో తాళ్ళ ప్రసాద్, పచ్చల శివయ్య, రావెల బాబు, పచ్చల సుబ్బారావు, కోటేశ్వరరావు, మున్నంగి బుజ్జి, కాకుమాను బాబు, ప్రత్తిపాడు అశోక్, హనుమయ్య, రోహిత్, వీరయ్య, సాగర్, రాజ్, కుమార్, రాజు, దేవరాజ్ తదితరులున్నారు.


గోరంట్లలో తాడిశెట్టి మురళీ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 29: యూనియన్ బ్యాంకు గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మే 17 నుంచి బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ జిబి కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మహిళలు, యువతులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని, అభ్యర్థుల వయసు 19 నుంచి 45 సంవత్సరాలలోపు ఉండాలని సూచించారు. ఆసక్తి ఉన్న తెల్లరేషన్ కార్డు, ఆధార్, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో యూనియన్ బ్యాంకు గ్రామీణాభివృద్ధి సంస్థ, 14-1-14, ఓల్డ్ క్లబ్ రోడ్డు, కొత్తపేట, గుంటూరు అనే చిరునామాలో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాల కోసం 0863-2336912, 9700687696లో సంప్రదించాలని సూచించారు.

టీజేపీఎస్ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

గుంటూరు (విద్య), ఏప్రిల్ 29 : స్థానిక టీజేపీఎస్ కళాశాలలో సోమవారం రమేష్ హాస్పిటల్ (గుంటూరు) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ఉచిత బీపీ, షుగర్, లంగ్స్, హార్ట్ ఈ సీజీ పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవనంలో సరైన ఆహారం, ప్రతి రోజు వ్యాయామం వంటివి లేకపోవడం వలన కొన్ని రకాల జబ్బులు వచ్చే అవకాశాలు ఉన్నాయని, అటువంటి వాటికి ముందుగానే పరీక్షలు నిర్వహించి తగిన వైద్యం అందిస్తే అనారోగ్యం నుంచి బయటపడతారని చెప్పారు. కళాశాలలో ఇంటర్, డిగ్రీ, పీజీ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేష్ హాస్పిటల్ వైద్య బృందం, కళాశాల అధ్యాపకులు డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, పి.కుమార్ రాజా, జి.సురేష్ బాబు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పల్నాడు.. సవాలే!



కేంద్ర బలగాల కవాతు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు అంటేనే పల్నాడు భీతిల్లి పోతోంది. ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో సామాన్య ప్రజలు వణికి పోతుంటారు. 12వ శతాబ్దిలో జరిగిన పల్నాటి యుద్ధం తెలిసిన ఘట్టమే. కాలక్రమేణ సమాజంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నప్పటికీ ఎన్నికల సమయాల్లో అలనాటి పలనాటి పౌరుషాలు ఇక్కడ స్పష్టంగా కనిపిస్తాయి.

మాచర్ల, గురజాల, నరసరావుపేట నియోజకవర్గాల్లో ఫ్యాక్షన్ గ్రామాలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ అనేక రాజకీయ హత్యలు జరిగాయి. మాచర్ల నియోజకవర్గంలో వెల్దుర్తి, కండ్లకుంట, రెంటచింతల, మంచికల్లు, మిట్టమీదపల్లె, జమ్మలమడక, కొత్తపల్లి, అడిగొప్పల.. గురజాల నియోజకవర్గంలోని పిన్నెల్లి, కరాలపాడు, దైదా, తేలకుట్ల, గుత్తికొండ, జానపాడు.. నరసరావుపేట నియోజకవర్గంలోని రొంపిచర్ల, విప్పర్ల, వడ్లమూరివారిపాలెం, పమిడిపాడు, కేతముక్కల అగ్రహారం, ఉప్పలపాడు.. సత్తెనపల్లి నియోజకవర్గంలోని దేచవరం, రూపెనగుంట్ల తదతర గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా గతంలో అనేక ఘర్షణలు జరిగాయి. 1991 లోక్‌సభ ఎన్నికల్లో నరసరావుపేట నియోజకవర్గం బాంబు దాడులతో అట్టుడికిపోయింది. ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగిన పోలీసు కాల్పుల్లో ముగ్గురు వ్యక్తులు చనిపోయారు. ఈ సందర్భంగా దేశంలోనే అత్యధికంగా దాదాపు 68 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరిగింది. 2004 ఎన్నికల్లో నరసరావుపేట, గురజాల నియోజకవర్గాల్లో పలుచోట్ల బాంబు దాడులు జరిగాయి. 11 కేంద్రాల్లో రీపోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో పిన్నెల్లిలో ఒక వ్యక్తి హత్యకు గురయ్యాడు. 2009 ఎన్నికల నుంచి బాంబుల సంస్కృతి కొంత తగ్గింది. అప్పటి నుంచి ఎన్నికల్లో బాంబు దాడులకు తావులేకుండా పోలీసులు ఎన్నికలు నిర్వ హించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా మాచర్ల నియోజకవర్గంలో అరాచకాలు జరిగాయి. వైసీపీ మూకలు ప్రశాంత ఎన్నికలకు విఘాతం కలిగించిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఎన్నికల ఎలా జరుగుతాయోనని ప్రజలు భీతిల్లి పోతున్నారు. మావోయిస్టుల ప్రభావం కూడా పల్నాడులో అధికంగానే ఉండేది. గతంతో జరిగిన ఎన్నికల్లో మావోయిస్టులు పలు విధ్వంసాలకు పాల్పడ్డారు. అయితే ఈసారి ఎన్నికల్లో మావోయిస్టుల ప్రభావం లేదనే చెప్పాలి. 2009 నుంచి జరిగిన ఎన్నికల్లో మావోయిస్టులు వలన జరిగిన ఘటనలు లేవు.

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన అనంతరం కూడా మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లో అరాచకాలు చోటు చేసుకున్నాయి. దాదాపు 25 చోట్ల, దాడులు, టీడీపీ కార్యాలయాల దహనం, దాడులకు యత్నం వంటి ఘటనలు జరిగాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ప్రశాంత ఎన్నికలు నిర్వహిస్తామని, రీపోలింగ్‌కు తావులేకుండా చేస్తామని, ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు వేసుకొనే ప్రశాంత వాతావరణ కల్పిస్తామని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఇప్పటికే ప్రకటించారు.

పోలింగ్ రోజున ఘర్షణలకు పాల్పడితే

- ఫ్యాక్షన్ గ్రామాల్లో భీతిల్లుతున్న ఓటర్లు
- ఎన్నికల వేళ అరాచకాలు

కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ బిందు మాధవ్ హెచ్చరించారు. గత ఎన్నికల్లో జరిగిన ఘర్షణలను దృష్టిలో ఉంచుకొని అయా గ్రామాల్లో ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటుకు పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. డీఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ బిందు మాధవ్ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి బందోబస్తు ఏర్పాటుపై ప్రణాళికను రూపొందించారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో శాంతి సమావేశాలలు నిర్వహిస్తున్నారు. కేంద్ర సాయుధ బలగాలతో సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా దాదాపు పదివేల మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో ప్రశాంతం పోలింగ్ పోలీసులకు సవాల్‌గా మారింది. ప్రశాంత ఎన్నికల కోసం జిల్లా ఎస్పీ చేపడుతున్న చర్యలు ఏ మేరకు ఫలితాలను ఇస్తాయో చూడాలి.



జిల్లాకు వచ్చిన కేంద్ర బలగాలు

స్థానం మారినా.. ఎంపీలుగా గెలుపు

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల మన్ననలతో ఒకసారి ఎంపీగా గెలిచిన వారు ఆ తర్వాత జరిగే ఎన్నికల్లో అదే స్థానం నుంచి పోటీ చేస్తారన్న నమ్మకం ఉండటం లేదు. సామాజిక సమీకరణాలు, పార్టీల నిర్ణయంతో ఇష్టం లేకున్నా కొన్ని సందర్భాల్లో వేరే నియోజకవర్గాలకు వెళ్లి పోటీ చేయాల్సి వస్తున్నది. కొందరు మాత్రం నియోజకవర్గం మారితే మంచిదన్న అభిప్రాయంతో మారిపోతున్నారు. జిల్లాలోని పలువురు నేతలు రెండుకంటే ఎక్కువ లోక్‌సభ నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహించారు. వారి వివరాలు ఇలా ఉన్నాయి..

- డాక్టర్ కొత్తా రఘురామయ్య: పార్లమెంట్‌లో సుమారు 38 సంవత్సరాలు లోక్‌సభ సభ్యుడిగా, సుదీర్ఘ కాలం కేంద్ర మంత్రిగా పనిచేసిన కొత్తా రఘురామయ్య జిల్లాలోని రెండు లోక్‌సభ నియోజకవర్గాల నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఆయన 1952లో తెనాలి నుంచి, 1957 నుంచి 1980 వరకు వరుసగా ఐదుసార్లు గుంటూరు నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1977లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోయిన తరువాత రఘురామయ్య జనతా పార్టీలో చేరారు. తరువాత ఆయన అనారోగ్యంతో మృతి చెందారు.
- డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు : బాపట్ల వ్యవసాయ కళాశాలలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు టీడీపీ అభ్యర్థిగా జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల నుంచి పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహించారు. ఆయన 1996 - 98లో కేంద్రంలో దేవేగౌడ, ఐకే గుజ్రాల్ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు. ఉమ్మారెడ్డి తెనాలి నుంచి 1991, 1999లో, బాపట్ల నుంచి 1996లో లోక్‌సభకు ఎన్నికయ్యారు.
- ఆచార్య ఎన్‌జి రంగా: ఆచార్య ఎన్‌జి రంగా జిల్లాలోని తెనాలి, గుంటూరుతో పాటు చిత్తూరు, శ్రీకాకుళం, ఇతర జిల్లాల నుంచి లోక్‌సభలో ప్రాతినిధ్యం వహించారు. సుదీర్ఘ కాలం పార్లమెంటేరియన్‌గా పనిచేసిన రంగ గిన్నిస్ బుక్‌లోకి ఎక్కారు. ఆయన 1957లో తెనాలి నుంచి, 1979, 1984, 1989లో గుంటూరు నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. శ్రీకాకుళం, చిత్తూరు లోక్‌సభల నుంచి కూడా ప్రాతినిధ్యం వహించారు.
- రాయపాటి సాంబశివరావు: రాయపాటి సాంబశివరావు జిల్లాలోని గుంటూరు, నరసరావుపేట నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. రాజ్యసభ సభ్యునిగా తొలిసారి చట్ట సభలకు ఎన్నికయ్యారు. రాయపాటి 1996, 1998, 2004, 2009లో గుంటూరు నుంచి, 2014లో నరసరావుపేట నుంచి ఎంపీగా గెలుపొందారు. గుంటూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా నరసరావుపేట నుంచి టీడీపీ అభ్యర్థిగా లోక్‌సభలో ప్రాతినిధ్యం వహించారు. ఈ ఎన్నికల్లో ఆయన పోటీ చేయడం లేదు.
- నేదురుమల్లి జనార్ధనరెడ్డి : జిల్లాలోని బాపట్ల, నరసరావుపేట నుంచి మాజీ సీఎం దివంగత నేదురుమల్లి జనార్ధనరెడ్డి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. ఆయన బాపట్లలో 1998లో, నరసరావుపేటలో 1999లో ఎన్నికయ్యారు. విశాఖపట్టణం నుంచి 2004లో లోక్‌సభలో కొనసాగారు. జనార్ధనరెడ్డి రాజ్యసభ సభ్యునిగా, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా, రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు.
- పనబాక లక్ష్మి : బాపట్ల నుంచి ఎంపికైన కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి అంతకు ముందు నెల్లూరు నుంచి 1996, 1998, 2004లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో ఆమె బాపట్లలో పోటీ చేసి గెలుపొందారు. కేంద్రంలో మంత్రిగా పని చేశారు. గత ఎన్నికల్లో తిరుపతి నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యరు.
- డాక్టర్ దగ్గుబాటి పురందేశ్వరి: 2004లో బాపట్ల నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఎన్టీఆర్ కుమార్తె పురందేశ్వరి ఆ తర్వాత విశాఖ నుంచి 2009లో గెలుపొందారు. 2004 - 2014లో మన్మోహన్ క్యాబినెట్‌లో ఆమె మంత్రిగా వివిధ శాఖలు నిర్వహించారు. విభజన తరువాత ఆమె బీజేపీలో చేరారు. 2014లో కడప జిల్లా రాజంపేటలో, 2019లో విశాఖపట్నంలో బీజేపీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి ఎన్‌డీఏ కూటమి అభ్యర్థిగా రాజమండ్రి నుంచి బరిలోకి దిగారు.
- మేకపాటి రాజమోహన్‌రెడ్డి: నరసరావుపేట నుంచి లోక్‌సభకు ఎన్నికైన మేకపాటి ఒంగోలు, నెల్లూరు నుంచి కూడా లోక్‌సభకు అడుగు పెట్టారు. ఆయన 1989లో ఒంగోలు నుంచి, 2004లో నరసరావుపేట నుంచి, నెల్లూరులో 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2014లో వైసీపీ అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు.
- మేడూరి నాగేశ్వరరావు: గుంటూరు జిల్లాకు చెందిన దివంగత మేడూరి నాగేశ్వరరావు 1997, 1980లో తెనాలి నుంచి, 1971లో మచిలీపట్నం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు.

ఈ విధంగా జిల్లా నుంచి పలువురు నేతలు రెండు, అంతకంటే ఎక్కువ నియోజకవర్గాల్లో ప్రజల మన్ననలను పొంది లోక్‌సభకు ఎన్నికయ్యారు.



డాక్టర్ కొత్తా రఘురామయ్య



మేడూరి నాగేశ్వరరావు



ఆచార్య ఎన్జీ రంగా



నేదురుమల్లి జనార్ధనరెడ్డి



మేకపాటి రాజమోహన్‌రెడ్డి



రాయపాటి సాంబశివరావు



పనబాక లక్ష్మి



డాక్టర్ దగ్గుబాటి పురందరేశ్వరి



డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు



వైసీపీ కౌన్సిలర్ మానసరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ ఆదిలక్ష్మిలకు కండువాలు కప్పి స్వాగతిస్తున్న మనోహర్, ఆలపాటి తదితరులు

నేడు తెనాలికి చంద్రబాబు

- ప్రజాగళం రోడ్ షో, బహిరంగ సభ
- ఏర్పాట్లు పరిశీలించిన ఆలపాటి, మనోహర్
- చంద్రబాబు పర్యటనతో ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లన్న నేతలు



మార్కెట్ సెంటర్ దగ్గర చంద్రబాబు సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆలపాటి, మనోహర్

తెనాలి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు మంగళవారం తెనాలిలో పర్యటించనున్నారు. కూటమి అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం సాయంత్రం చంద్రబాబు ప్రత్యేక హెలికాప్టర్‌లో తెనాలి సుల్తానాబాద్‌లో దిగతారు. అక్కడి నుంచి పట్టణంలోని సుల్తానాబాద్, చెంచుపేట, మారీస్‌పేట మీదగా మార్కెట్ సెంటర్ వరకు రోడ్‌షోగా వస్తారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు మార్కెట్ సెంటర్‌లో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, కూటమి అభ్యర్థి, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. హెలిప్యాడ్ ప్రదేశాన్ని, సభ జరిగే మార్కెట్ సెంటర్‌ను ఇరువురు నేతలు టీడీపీ, జనసేన శ్రేణులతో కలసి సోమవారం పరిశీలించి ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ మన సత్తా చాటి చంద్రబాబు పర్యటనను విజయవంతం చేసి ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించాలన్నారు.

నేడు చంద్రబాబు సమక్షంలో చేరికలు

తెనాలిలో అధికార వైసీపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. సొంత సామాజిక వర్గానికి చెందిన ముఖ్య నాయకులే పార్టీని వీడి జనసేన కండువా కప్పుకుంటున్నారు. మరిన్ని వలసలు త్వరలో జరగనున్నాయి. తెనాలిలో సిటింగ్ ఎమ్మెల్యేనే బరిలో ఉన్నారు. అయితే పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ కూటమి క్రమంగా బలపడుతూ వస్తోంది. గతంలో చిన్నపాటి నాయకులు వైసీపీని వీడి జనసేన, టీడీపీలో చేరితే, సోమవారం వైసీపీ కౌన్సిలర్ మానసా రెడ్డి, ఆమె భర్త సతీష్‌రెడ్డి దంపతులు, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ వి.ఆదిలక్ష్మి జనసేనలో చేరారు. నాదెండ్ల మనోహర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ల సమక్షంలో వీరు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. అయితే మంగళవారం తెనాలిలో చంద్రబాబు ప్రజాగళం పర్యటన ఉంది. ఈ క్రమంలో ఆయన సమక్షంలో కూడా మరికొందరు వైసీపీ కీలక నేతలు చేరనున్నట్లు సమాచారం. పోలింగ్ నాటికి వైసీపీ ఖాళీ అవుతుందని, ఎన్నికల తర్వాత పార్టీనే కనిపించదని ఆలపాటి తెలిపారు. చేరే వారి త్యాగాలకు తగిన గుర్తింపు ఉంటుందని మనోహర్ స్పష్టం చేశారు.

ప్రసంగాల అనువాదకుడు రోశయ్య

- తెలుగు అనువాదంతో పెద్దల ప్రశంసలు.. ప్రజల అభినందనలు

వేమూరు, ఏప్రిల్ 29: రాజకీయ రంగంలో చతురత కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందిన వేమూరు వాసి మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ దివంగత కొణిజేటి రోశయ్య జాతీయ నాయకుల ప్రసంగాలకు అనువాదకుడిగా పేరుపొందారు. నాయకుల ప్రశంసలతో పాటు ప్రజల అభినందనలు కూడా పొందారు. స్వర్గీయ ప్రధాని ఇందిరా గాంధీ 1968లో వేమూరు గ్రామానికి విచ్చేసి ప్రసంగిస్తున్న సమయంలో హిందీలో ఆమె చేసిన ప్రసంగానికి రోశయ్య తెలుగులో అనువాదం చేశారు. అలాగే మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ 1983నుండి 1985వరకు బహిరంగ సభలో ప్రసంగించిన హిందీ ప్రసంగానికి రోశయ్యే తెలుగు అనువాదం చేశారు. 1989, 1994 మధ్య కాలంలో నాటి కేంద్ర ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బహిరంగ సభల్లో ప్రసంగిస్తున్న తరుణంలో కూడా రోశయ్య తెలుగు అనువాదం చేశారు. అత్యవసరంగా సోనియా గాంధీ ప్రసంగాల్లో కూడా కొణిజేటి తనదైన శైలిలో తెలుగులో అనువాదం చేశారు. నిర్మల హృదయ మదర్‌థెరిసా హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రసంగానికి కూడా రోశయ్యే తెలుగు అనువాదం చేసి ప్రజల మన్ననలను హర్షధ్వానాలతో అందుకున్నారు.

1968లో వేమూరులో జరిగిన ఇందిరాగాంధీ ప్రసంగానికి తెలుగు అనువాదం చేస్తున్న రోశయ్య





1983లో బహిరంగ సభలో అనువాదానికి ముందుగా రాజీవ్‌గాంధీతో చర్చిస్తున్న రోశయ్య



మదర్‌థెరిసా ప్రసంగానికి తెలుగు అనువాదం చేసిన అనంతరం ఆమె అభినందనలు పొందుతున్న రోశయ్య

నవతరం పార్టీకి గాజు గ్లాసు గుర్తు

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నవతరం పార్టీకి గాజు గ్లాసు గుర్తు కేటాయించడంపై ప్రతిపక్ష టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గాజు గ్లాసు గుర్తుని కామన్ సింబల్‌గా జనసేనకు కేటాయించాలని ఎన్నికల సంఘం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఫ్రీ హోల్డ్ సింబల్స్ జాబితా నుంచి తొలగించాలని స్పష్టం చేసింది. అయితే సోమవారం సాయంత్రం గుంటూరు పార్లమెంట్ స్థానానికి ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు జరిగినప్పుడు నవతరం పార్టీ అభ్యర్థికి గాజు గ్లాసు గుర్తు కేటాయించారు. మొత్తం 30 మంది అభ్యర్థులకు వివిధ గుర్తులను ఇచ్చారు. అయితే నవతరం పార్టీకి కేటాయించిన గాజుగ్లాసు గుర్తు వలన ఓటర్లు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందని ప్రతిపక్షాల సభ్యులు వాపోతున్నారు.

1996 తర్వాత మళ్లీ అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు

గుంటూరు లోక్‌సభ స్థానానికి 1996 తర్వాత మళ్లీ అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అప్పట్లో 32 మంది తుది పోరులో నిలబడగా ఈసారి 30 మంది రేసులో ఉన్నారు. 1971 నుంచి గుంటూరు లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో తుది పోటీలో నిలబడిన అభ్యర్థుల సంఖ్యని పరిశీలిస్తే ఆ సంవత్సరం తొమ్మిది, 1977లో ఆరుగురు, 1980లో ఆరుగురు, 1984లో 10, 1989లో ఆరుగురు, 1991లో 21, 1996లో 32, 19898లో 11, 1999లో 10, 2004లో ఐదుగురు, 2009లో 10, 2014లో 13, 2019లో 20 మంది పోటీ చేశారు. ఈ దఫా 2024లో 30 మంది పోటీలో ఉన్నారు. ఈ నేపథ్యంలో రెండు బ్యాలెట్ యూనిట్లు ప్రతీ ఈవీఎంకు అవసరమౌతాయి.

3, 7, 11 తేదీల్లో హాజరు కావాలి

ఎన్నికల ఖర్చులకు సంబంధించి నిర్వహిస్తున్న రిజిష్టర్, సంబంధిత బిల్లులు/ఓచర్లను అభ్యర్థులు మే 3, 7 11 తేదీల్లో ఎన్నికల వ్యయ పరిశీలకుడి తనిఖీకి హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. ఆయా తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్యన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అభ్యర్థి/ఎన్నికల ఏజెంట్ ద్వారా ఖర్చుల రిజిస్టర్, బిల్లులు, ఓచర్లు పంపవచ్చన్నారు. ఎవరైతే హాజరు కారో వారు అనర్హతకు గురయ్యే అవకాశం ఉందన్నారు.

చందా ఇవ్వాల్సిందే.. తప్పదు

- మిర్చి వ్యాపారులపై అసోసియేషన్ నేతల ఒత్తిళ్లు
- నేడు వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో ఆత్మీయ సమావేశం

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ది గుంటూరు చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ వైసీపీకి అంట కాగుతున్నది. ఇప్పటికే అసోసి యేషన్‌కు చెందిన కొంతమంది నేతలు వైసీపీ ఎంపీ/ఎమ్మెల్యే అభ్యర్థుల తరపున వకాల్తా పుచ్చుకుని కమీషన్, ఎక్స్‌పోర్టు వ్యాపారుల వద్ద చందాలు వసూలు చేయడం ప్రారంభించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సోమవారం జరిగిన వర్తకుల సమావేశంలోనూ చందాల వసూళ్ల అంశంపై చర్చించుకున్నట్లు తెలిసింది. ముసుగులు తొలగించి మంగళవారం ఉదయం అంకిరెడ్డిపాలెం బైపాసురోడ్డుకు సమీపంలోని వీఆర్‌కే గార్డెన్స్‌లో వైసీపీ ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య, పశ్చిమ, తూర్పు, ప్రత్తిపాడు అభ్యర్థులు విడదల రజిని, నూరి ఫాతిమా, బలసాని కిరణ్‌కుమార్‌తో ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి కమీషన్ వ్యాపార స్థులందరూ హాజరు కావాల్సిందిగా సోమవారం వాట్సాప్ గ్రూపులలో సందేశాలను పంపించు కున్నారు. వైసీపీ అభ్యర్థులకు చందాలు ఇవ్వడం చాలామంది వ్యాపారులకు ఇష్టం లేదు. ఇదే విషయాన్ని కొంతమంది బహిరంగంగానే అసోసియేషన్ నేతలకు స్పష్టం చేశారు. అయినప్పటికీ వారు చందా ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఒక్కో కమీషన్ వ్యాపారి వద్ద రూ.లక్ష వరకు వసూలుచేయాలని నిర్ణయిం చుకున్నట్లు సమాచారం. సుమారుగా రూ.3 కోట్ల మేరకు చందాలు వసూలు చేసి వైసీపీ నేతల చేతుల్లో పెట్టి ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు పరోక్షంగా సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ విషయంలో తనదైన 'మార్కు'ని ఓ వ్యాపారి ప్రదర్శిస్తున్నారు.

రూ. ఏడు లక్షల నగదు స్వాధీనం

గుంటూరు సిటీ, ఏప్రిల్ 29: పెద్ద పలకలూరు నుండి పేరేచర్ల వైపునకు వెళుతున్న వాహనాలను డిప్యూటీ కలెక్టర్ కె. స్వాతి ఆధ్వర్యంలో ప్రభుత్వం నియమించిన ఎన్నికల జిల్లా ప్లేయింగ్ స్క్వాడ్ సోమవారం వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఓ వాహనంలో ఏడు లక్షల రూపాయలను తరలిస్తుండగా వాటిని గుర్తించి ఈన గదు ఎక్కడికి తీసుకు వెళుతున్నారని ప్రశ్నించగా.. వారు ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో అక్రమంగా తరలిస్తున్న నగదును స్వాధీనపరచుకొని నగదును సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, ఎ.సి.టి.ఓ. ఉషాకిరణ్, డీ ఆర్ వో ఫారెస్ట్, వెంకటేశ్వరరావు, సబ్ ఇన్స్పెక్టర్, ఆంజనేయులు, ఎక్సైజ్ శాఖ ఎస్సై మహబూబ్ బాషా, కానిస్టేబుల్ సురేష్, వెంకట్రావు, మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

'నందిగం'తో ప్రాణహాని... రక్షణ కల్పించండి

- సీఈవోకు కట్టా ఆనంద్‌బాబు ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బాపట్ల పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి నందిగం సురేశ్ నుంచి తనకు ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని బాపట్ల పార్లమెంట్ స్వతంత్ర్య అభ్యర్థి కట్టా ఆనంద్‌బాబు విజ్ఞప్తి చేశారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాను అమరావతి సచివాలయంలో ఆయన కలిశారు. నందిగం సురేశ్ అక్రమాలు, దౌర్జన్యాలను సోషల్ మీడియా వేదికగా ఎండగడుతున్న తనపై కక్ష కట్టి, బెదిరిస్తున్నారని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. 'నువ్వొక వలంటీర్‌వి. నా మీదే తిరుగుబాటు చేసే ధైర్యం నీకెవడిచ్చాడు? నామినేషన్ ఉపసంహరించుకోకపోతే మే 13లోపు నిన్ను చంపేస్తా. వచ్చే ఏడాది నా పేరు మీద సినామా తీస్తా' అని సురేశ్, అతని అనుచరులు బెదిరిస్తున్నారని వివరించారు. ఒంటరిగా ప్రచారం చేస్తున్న తనను, అతని అనుచరులు అనుసరిస్తున్నారని, తనను చంపేస్తారేమోనని భయం వ్యక్తం చేశారు.

మంగళగిరి బరిలో 40 మంది అభ్యర్థులు

- నామినేషన్లు ఉపసంహరించుకున్న ఇద్దరు స్వతంత్రులు
- మూడు బ్యాలెట్ యూనిట్ల ద్వారా పోలింగ్
- రిటర్నింగ్ అధికారి రాజకుమారి


మాట్లాడుతున్న ఆర్వో రాజకుమారి

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 29: సార్వత్రిక ఎన్నికల్లో మరో కీలక ఘట్టం ముగిసింది. నామినేషన్ల ఉపసంహరణకు సోమవారం ఆఖరి రోజు కావడంతో మంగళగిరిలో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. మంగళగిరి నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి మొత్తం 44 మంది అభ్యర్థుల నుంచి 76 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో ఐదు నామినేష న్లు పరిశీలనలో తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 71 నామినేషన్లకు సంబంధించి 42 మంది అభ్యర్థులు బరిలో నిలి చారు. నామినేషన్ల ఉపసంహరణకు సోమవారం చివరి రోజు కావడంతో స్వతంత్ర అభ్యర్థులు మురుగుడు సత్యం రెండు సెట్లు, జంజనం పద్మ ఒక సెట్ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో తుది పోరులో 68 నామి నేషన్లకు సంబంధించి 40 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టరు, మంగళగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారి మీడియాతో మాట్లాడుతూ మంగళగిరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధిం చి 40 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, నోటాను కలుపుకుని 41 గుర్తుల తో బ్యాలెట్ యూనిట్లు సిద్ధం చేస్తామన్నారు. ఒక్కో యూనిట్‌లో 16 పేర్లు మా త్రమే నిక్షిప్తం చేసేందుకు అవకాశం ఉండడంతో 16 మంది చొప్పున రెండు బ్యాలెట్లు, మరో 8 మంది అభ్యర్థులు, నోటాను కలుపుకుని 9 గుర్తులతో మరో బ్యాలెట్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి బ్యాలెట్ యూనిట్‌లో అభ్యర్థి పేరు, గుర్తు, అనుబంధ పార్టీ పేరును పొందుపరుస్తామన్నారు. మొద టి కేటగిరీలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థుల పేర్లను తెలుగు అక్షరమాల ప్రకారం వరుస క్రమంలో ఉంచుతామన్నారు. దీనికి సంబంధించి మంగళగిరిలో నలుగురు అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. అలాగే, రెండో కేటగిరిలో నమోదై గుర్తింపులేని పార్టీల అభ్యర్థులకు ప్రాధాన్య మిచ్చి ఎన్నికల కమిషన్ ఇచ్చిన గుర్తులను కేటాయిస్తామని, లేనిపక్షంలో ఆయా పార్టీల అభ్యర్థులు ఎంపిక చేసుకున్న గుర్తులను కేటాయిస్తామని చెప్పా రు. దీనికి సంబంధించి మంగళగిరిలో 14 మంది అభ్యర్థులు ఉన్నారన్నారు. చివరిగా మూడో కేటగిరీలో స్వతంత్ర అభ్యర్థుల పేర్లను తెలుగు అక్షరమాల ప్రకారం వరుస క్రమంలో వుంచుతామన్నారు. మంగళగిరిలో 22 మంది స్వతం త్ర అభ్యర్థులు పోటీలు ఉన్నారని ఆర్వో రాజకుమారి తెలిపారు.

ప్రత్తిపాడు బరిలో 13 మంది అభ్యర్థులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 29: ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 13 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ప్రత్తిపాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీకర్ తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సోమవారం ముగిసింది. అయితే నామినేషన్లు దాఖలు చేసిన ఎవరూ కూడా తమ నామినేషన్లను విత్ డ్రా చేసుకోకపోవడంతో అందరూ బరిలో నిలిచారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బూర్ల రామాంజనేయులు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కొరివి వినయ్‌కుమార్, వైసీపీ అభ్యర్థిగా బలసాని కిరణ్ కుమార్, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా జీ మురళీదర్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా చల్లా శరత్ కుమార్, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా పల్లపాటి నవీన్, ఇండియన్ లేబర్ పార్టీ (అంబేద్కర్ ఫూలే) పార్టీ అభ్యర్థిగా పాల్ యంద్రపాటి, భారతీయ జన సేన పార్టీ అభ్యర్థిగా బుర్రి రాంబాబు, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా ఎస్ఎస్ రాణి (మహాలక్ష్మి), స్వతంత్ర అభ్యర్థులుగా కత్తి అరుణ్‌కుమార్, చంద్రం కృష్ణంరాజు, బెజ్జం నాగరాజు, కే రజనీకాంత్‌లు ఎన్నికల బరిలో నిలిచినట్లు ఆర్వో శ్రీకర్ తెలిపారు.

ప్రతి అభ్యర్థి ఎన్నికల ఖర్చులను తనిఖీ చేయించుకోవాలి

ఎన్నికల బరిలో నిలిచిన ప్రతి అభ్యర్థి తమ ఎన్నికల ఖర్చుల రిజిస్టర్ ఎన్నికల వ్యయ పరిశీలకుడి ఎదుట తనిఖీ చేయించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీకర్ తెలిపారు. ప్రతి అభ్యర్థి తన ఎన్నికల ఖర్చులకు సంబంధించి రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఆ రిజిస్టర్‌ను ఈ నెల 30వ తేదీతో పాటు మే 4, 11 తేదీల్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో తనిఖీ చేయించుకునేందుకు హాజరుకావాలన్నారు. అభ్యర్థి గాని లేదా అతని తరఫున ఏజంటు గాని ఈ తనిఖీకి హాజరు కావాలని, వచ్చే సమయంలో రిజిస్టర్‌తో పాటు బిల్లులు, ఓచర్లను తీసుకురావాలన్నారు. అలా తనిఖీకి హాజరు కాని వారిని భారత ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం అనర్హతకు గురి చేస్తారన్నారు.

తాడికొండ బరిలో 10 మంది అభ్యర్థులు

తాడికొండ, ఏప్రిల్ 29: నామినేషన్ల ఉపసంహరణ సోమవారంతో ముగిసింది. తాడికొండ అసెంబ్లీ ఎన్నికల్లో 10మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం 16మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా స్క్రూట్నీలో నలుగురు అభ్యర్థుల నామినేషన్లలో సరియైన సంతకాలు లేకపోవటంతో వాటిని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. టీడీపీ, వైసీపీ తరుపున ప్రధాన అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉండటంతో ఆ పార్టీల తరువాతన డమ్మీలు వేసిన ఇద్దరు అభ్యర్థులను నామినేషన్లు తిరస్కరించటంతో 10మంది బరిలో నిలిచారు. అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల గుర్తులను ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేటాయించారు. తెనాలి శ్రావణ్‌కుమార్, టీడీపీ (సైకిల్), మేకతోటి సుచరిత, వైసీపీ (సీలింగ్ ఫ్యాను), మంచాల సునీల్‌రాజ, కాంగ్రెస్ (హస్తం), శృంగారపాటి బాబూరావు, బీఎస్పీ (ఏనుగు), గుర్రం రామారావు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ (బకెట్), జడ శ్రావణ్‌కుమార్, జైభీమ్‌రావు భారత్‌పార్టీ (కోటు), ముసలయ్య దొడ్డా, ఇండియన్ లేబర్ పార్టీ (బ్రెడ్), మెండెం మరియదాసు, తెలుగు రాజాధికార సమితి పార్టీ (రబ్బరు స్టాంప్), రమేష్‌బాబు తెనాలి, జాతీయ జనసేన పార్టీ, (పెన్‌స్టాండ్), రావెల ఏసయ్య, స్వతంత్ర అభ్యర్థి (టేబుల్) గుర్తులను ఎన్నికల అధికారులు కేటాయించారు.

ఓటరు స్లిప్పులు సక్రమంగా పంపిణీ చేయాలి

- తహసీల్దార్ లాజరస్

పెదనందిపాడు, ఏప్రిల్ 29 : బీఎల్వోలు గ్రామాల్లో ఓటర్లకు సక్రమంగా ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని తహసీల్దార్ లాజరస్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ తిరిగి ఓటర్లకు స్వయంగా స్లిప్పులు అందజేయాలని, గ్రామాల్లో ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడైనా ఓటర్లను ఆయా పార్టీల నేతలు ఓటరు స్లిప్పుల పంపిణీతో పాటు నగదు, మద్యం, తాయిలాలు పంపిణీ చేసినట్లైతే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందజేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

పద్మశాలీ అన్నసత్రం ధర్మకర్తగా శివశంకరరావు


నియామకపత్రం అందుకుంటున్న శివశంకరరావు

మంగళగిరి, ఏప్రిల్ 29: భద్రాచలంలోని అఖిలభారత భక్త మార్కండేయ పద్మశాలీ అన్నదాన సత్రం ధర్మకర్తల సంఘం సభ్యుడిగా పాత మంగళగిరికి చెందిన అందె శివశంకరరావు నియమితులయ్యారు. శివశంకరరావు బాల్యంలోనే స్వయం సేవక్‌గా ఆర్ఎస్ఎస్‌లో చేరి 1967లో జనసంఘ్ తరఫున రాజకీయ ప్రవేశం చేశారు. ఆ తరువాత బీజేపీ చేనేత సెల్ కన్వీనర్ గా, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగాను, జాతీయ హ్యాండ్లూమ్ బోర్డు డైరెక్టరు గాను పని చేశారు. తిరుమల, శ్రీశైలం, భద్రాచలం, కాశీ వంటి ప్రముఖ దేవస్థానాల్లో పద్మశాలి అన్నసత్రాలకు భూరి విరాళం అందజేశారు. ఆయన నియామకంపై మంగళగిరి పద్మశాలీయ సంఘాల ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

ప్రజ్వల రేవణ్ణను శిక్షించాలి : ఐద్వా కార్యదర్శి రమాదేవి

తాడేపల్లి, ఏప్రిల్ 29: కర్నాటక రాష్ట్రానికి చెందిన హెచ్‌డీ దేవగౌడ మనుమడు ప్రజ్వల రేవణ్ణపై పెట్టిన కేసులను తక్షణమే విచారించి శిక్షించాలని, మహిళా సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడు వేల వీడియోలతో కూడిన ఒక పెన్ డ్రైవ్‌లో మహిళలను లైంగికంగా బ్లాక్ మెయిల్ చేసి లోబరచుకునేందుకు అతను తీసిన వీడియోలు కూడా ఉండటం సమస్య తీవ్రతను తెలియజేస్తుందని, ఈ ఆరోపణలను విచారించేందుకు కర్నాటక ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది కానీ అతను దేశం నుంచి పారిపోయాడన్నారు. అతనిని తక్షణమే దేశానికి రప్పించాలని, త్వరగా విచారించి శిక్షించాలన్నారు. ఇలాంటి లైంగిక నేరస్తులు రాజకీయంగా నాయకత్వంలో ఉండడం ప్రమాదకరమన్నారు. లైంగిక ఆరోపణలున్న నేపథ్యంలో బీజేపీ వారితో పొత్తు సరికాదని, బీజేపీలోని కొందరు హెచ్చరించినా బీజేపీకి లెక్కలో లేకపోవడం మహిళలపై వారికున్న చులకన భావనకు ఇదే నిదర్శనమన్నారు. జాతీయ మహిళాకమిషన్ ఈ ఉదంతంపై ఇంతవరకు స్పందించకపోవడాన్ని ఐద్వా ఖండిస్తుందన్నారు.

అమరావతి పునర్నిర్మాణం చంద్రబాబుతోనే సాధ్యం

- అమరావతి రాజధాని జేఏసీ సభ్యులు స్వరాజ్యరావు


పెదనందిపాడులో ప్రచారం నిర్వహిస్తున్న అమరావతి రాజధాని జేఏసీ సభ్యులు

పెదనందిపాడు, ఏప్రిల్ 29: వైసీపీ అసమర్థ పాలనతో మరుగునపడిన ప్రజారాజధాని అమరావతి పునర్నిర్మాణం చంద్రబాబుతోనే సాధ్యమని అమరావతి రాజధాని ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు స్వరాజ్యరావు అన్నారు. పెదనందిపాడులో అమరావతి రాజధాని ఐక్య కార్యాచరణ సమితి, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ ఆధ్వర్యంలో ఆంధ్రుల రాజధాని అమరావతి, దాని ఆవశ్యకతను తెలియజేస్తూ రైతులు, మహిళలు సోమవారం ఇంటింటికీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరాజ్యరావు మాట్లాడుతూ రాష్ట్రం కోసం, మన బిడ్డల భవిష్యత్తు కోసం, ఆంధ్రుల కలల రాజధాని అమరావతిని సాధించుకునే సమయం ఆసన్నమైందని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో మన రాజధాని అమరావతికి మద్దతు తెలుపుతున్న కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. రాధాని రైతులు 1595 రోజులుగా దీక్షలు చేస్తున్నప్పటికీ, నిస్వార్థంగా 33వేల ఎకరాలు భూములిచ్చినప్పటికీ తాము రాజధాని నిర్మాణానికి మద్దతు తెలుపుతామని చెప్పి అధికారంలోకి వచ్చి మూడు రాజధానుల పేరుతో ఐదేళ్ళుగా ఎన్నో ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. సేవ్ ఆంధ్రప్రదేశ్, సేవ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు నర్రా బాలకృష్ణ, ముద్దన నగరాజకుమారి, అమరావతి జేఏసీ సభ్యులు ఏ బాలమురళీ, ఏ యుగంధర్, జే కిరణ్‌కుమార్, కే రాజేంద్ర, దుర్గా, వరలక్ష్మీ, కంభంపాటి శిరీష, కాళహస్తి సత్యనారాయణ(విశ్రాంత ఏఎస్పీ), ముద్దన రాఘవయ్య, దొప్పలపూడి కోటేశ్వరరావు, పోపూరి లక్ష్మీనారాయణ, కుర్రా హరిబాబు, కాంద్రు ప్రసాద్, కొమర్నేని రాకేష్, నూతి శ్రీనివాసరావు, ఆళ్ళ హరిప్రసాద్, మొవ్వా నవీన్, షేక్ ఖలీల్, పర్వతనేని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తపై పన్ను వేసిన జగన్‌ను సాగనంపుదాం

- ప్రత్తిపాడు ఎన్డీఏ కూటమి అభ్యర్థి బి.రామాంజనేయులు


ప్రచారంలో భాగంగా బైక్‌పై టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, జనసేన నేత బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 29: ఇంటింటికి చెత్తపై పన్నులు వేసి, పింఛన్లలో కోత విధించిన జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని ప్రత్తిపాడు, ఎన్డీఏ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు అన్నారు. ప్రచారంలో భాగంగా సోమవారం నియోజకవర్గంలోని గోరంట్ల డివిజన్ పరిధిలో బోసుబొమ్మసెంటర్, యర్రంశెట్టి బజార్, పంచాయతీ కార్యాలయం, శివాలయం, రామాలయం సెంటర్లలో, అలాగే గుంటూరు రూరల్ పరిధిలోని అంకిరెడ్డిపాలెంలో ఇంటింటికి పర్యటిస్తూ సూపర్ సిక్స్ పథకాల ప్రయోజనాల గురించి వివరించారు. గోరంట్ల డివిజన్, ప్రచారంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఇతర నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బైక్‌ర్యాలీలో పాల్గొని శ్రేణులలో ఉత్తేజం నింపారు. అనంతరం బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ గోరంట్ల డివిజన్ పరిధిలో రోడ్లు, మురుగు కాల్వలు, విద్యుత్ సమస్యలు నెలకొన్నాయని, పన్నులు వసూలుపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై పాలకులకు లేదని విమర్శించారు. కార్యక్రమంలో 16, 47 డివిజన్ల కార్పొరేటర్లు దాసరి లక్ష్మీదుర్గా, యర్రంశెట్టి పద్మావతి, గ్రామ మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్, జనసేన జిల్లా నాయకులు ఉప్పు వెంకట రత్తయ్య, టీడీపీ నాయకులు పెమ్మసాని రవికుమార్, వడ్రాణం హరిబాబు, చింతా రేణుకరాజు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

పెదనందిపాడు, ఏప్రిల్ 29 : మండలపరిధిలోని అన్నవరంలో సోమవారం వైసీపీకి చెందిన 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ మేరకు టీడీపీ నాయకులు నంగినేని సందీప్, పిన్నింటి గోపీల ఆధ్వర్యంలో గుంటూరులోని నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కార్యాలయంలో బూర్ల రామాంజనేయులు సమక్షంలో టీడీపీలో చేరారు. కేసానుపల్లి శింగారావు, చిలకా రజినీ కాంత్, పాలెపు నాగేశ్వరరావు, ఆత్తోట వెంకటేష్, పల్లె శ్రీను, టి.సుదీర్, కె.సామ్యేల్, కొండపాటూరు పుల్లయ్యలను టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వైసీపీ ప్రభుత్వానికి ఘోర పరాభవం తప్పదు


27వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 29: అయిదేళ్లపాటు అరాచక పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ఘోర పరాభవం తథ్యమని కూటమి నేతలు పేర్కొన్నారు. మంగళగిరి పట్టణం 27వ వార్డు పరిధిలోని రాజీవ్ గృహకల్ప, పావురాల కాలనీ, మార్కండేయ కాలనీ, మన్నెం వారి వీధిలో సోమవారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి నారా లోకేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. లోకేశ్ గెలిస్తే మంగళగిరిలో నివసిస్తున్న పేదలకు ఇళ్లను క్రమబద్ధీకరించడంతోపాటు 20 వేల ఇళ్లు నిర్మించి ఇస్తారని చెప్పారు. వైసీపీ పాలనలో అధోగతిపాలైన రాష్ట్రం తిరిగి అభివృద్ధి చెందాలంటే ప్రజలంతా చంద్రబాబుకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామర్లరాజు, జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, కూటమి నేతలు గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, జంజనం సాంబశివరావు, మన్నెం అరుణ, ఊట్ల దుర్గామల్లేశ్వరీ, వడిశా నరేష్, బాణాల నాగేశ్వరరావు, కొండలరావు, షేక్ సుభానీ పాల్గొన్నారు.

నేడే కొండపాటూరులో పోలేరమ్మ తిరునాళ్ల


విద్యుద్దీపాలతో పోలేరమ్మ ఆలయం

కాకుమాను, ఏప్రిల్ 29: జిల్లాలో ప్రసిద్ధి, ప్రఖ్యాతి పొందిన పోలేరమ్మ వారి తిరునాళ్ల మహోత్సవం మంగళవారం జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణ అధికారి బి.సురేష్‌బాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ కంఠమనేని నరేష్‌బాబు సోమవారం తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. బాపట్ల, పొన్నూరు, గుంటూరు, చిలకలూరిపేట నుంచి స్పెషల్ బస్సులను కూడా ఆయా డిపో మేనేజర్‌లు ఏర్పాటు చేశారు. అలాగే ఆలయం వద్ద చిన్నారులకు ఆహ్లాదం కలిగించే విధంగా జైంట్ వీల్, పడవ, అలాగే ఎన్నో వినోదాలను కలిగించే ఆట సామగ్రి ఏర్పాట్లుతో పాటు వివిద రకాల గృహోపకరణాలు కూడా కొండపాటూరుకు తరలివచ్చాయి. రహదారులకు ఇరువైపులా దుకాణాలు వెలిశాయి. దేవాలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. సోమవారం సాయంత్రం శిడిమాను ట్రయల్‌రన్ నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని వీధుల్లో శిడిమానును లాగేందుకు గ్రామంలోని యువకులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలి

అధికారులు సమన్వయంతో కొండపాటూరు అమ్మవారి తిరునాళ్లను జయప్రదం చేయాలని తహసీల్దార్ పార్వతి అన్నారు. మంగళవారం జరిగే తిరునాళ్ల సందర్భంగా సోమవారం కొండపాటూరు అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పార్వతి మాట్లాడుతూ తిరునాళ్ల మహోత్సవాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్ట పోలీసింగ్‌ను అమలు చేయాలని ఎస్ఐ రవీంద్రకు సూచించారు. అలాగే భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేక క్యూ లైన్‌లు, వన్‌వే ట్రాఫిక్ తదితర అంశాలు గురించి వాకబు చేశారు.కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ నరేష్‌బాబు, స్థానికులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్‌కు బుద్ధి చెబుతాం

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 29: దళితుల సంక్షేమానికి ఉద్దేశించబడిన సంక్షేమ పథకాలను రద్దు చేసి దళితులపై దమనకాండ సాగించిన జగన్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెబుతామని ప్రబుద్ధ రిపబ్లి కన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు హెచ్చరించారు. మంగళగిరి ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులను చంపి డోర్ డెలివరీ చేస్తూ, దళితులకు శిరోముండనం చేయించిన వారికి టిక్కెట్లు ఇచ్చి గెలిపించాలని కోరుతున్న జగన్ పార్టీ అభ్యర్థులకు రాబోయే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రావన్నారు. ఎస్సీలకు ఉద్దేశించబడిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి రూ.72 వేల కోట్లను పక్కదారి పట్టించిన దళిత ద్రోహి జగన్‌కు ఓట్లు వేయవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ మంగళగిరి అభ్యర్థి గుర్రం రామారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బెస్ట్ వాల్యూ స్కూల్స్ కింద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సుమారు 50 వేల మంది చదువుకుంటున్న పథకాన్ని రద్దు చేయడం దుర్మార్గమన్నారు. విదేశీ విద్య పథకానికి అంబేద్కర్ పేరును తొలగించి జగన్ పేరు పెట్టుకోవడం జగన్ కుచ్చితపు బుద్ధికి నిదర్శనమన్నారు. సమావేశంలో బండి ప్రసాద్, డి.దుర్గాప్రసాద్, ఎం నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సామాజిక భద్రతా పింఛన్లు

- కమిషనర్ నిర్మల్‌కుమార్

మంగళగిరి, ఏప్రిల్ 29: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీపై ఎంటీఎంసీ కమిషనరు వి.నిర్మల్‌కుమార్ సోమవారం మార్గదర్శకాలను జారీ చేశారు. వృద్ధాప్యం వల్ల మంచానికే పరిమితమైన వారు, దివ్యాంగులు, డయాలసిస్, తలసేమియాతో బాధపడుతున్న వారు 3,207 మందిని గుర్తించామని, వారికి సచివాలయ సిబ్బంది మే ఒకటో తేదీన ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందజేస్తారని తెలిపారు. మిగిలిన 1,00,49 మంది పింఛన్‌దారులకు వారి ఆధార్ నెంబరుకు అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతాకు పింఛన్ సొమ్ము జమ చేస్తారని పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాకు పింఛన్ సొమ్ము జమకాని పక్షంలో సంబంధిత సచివాలయ సిబ్బంది 2, 3 తేదీల్లో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తారని, లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని, పింఛన్ల కోసం సచివాలయాలకు వెళ్లొద్దని కోరారు.

శుభకార్యానికి వెళ్లివస్తూ..

- ముందు వెళుతున్న లారీని ఢీకొన్న కారు
- ఒకరు మృతి.. మరి కొందరికి గాయాలు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 29: శుభకార్యానికి వెళ్లివస్తున్న ఓ వాహనం ముందు వెలుతున్న లారీని వేగంగా ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా మరి కొంత మందికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని యనమదల సమీపంలో జరిగింది. ప్రత్తిపాడు పోలీసుల కథనం ప్రకారం యడ్లపాడు మండలం గుత్తావారిపాలెం గ్రామంతో పాటు ప్రత్తిపాడు మండలం గనికపూడి గ్రామానికి చెందిన తొమ్మిది మంది బంధువులు ద్వారకా తిరుమలలో బంధువుల వివాహానికి వెళ్లి సోమవారం తెల్లవారు ఝామున స్వగ్రామానికి వెలుతున్నారు. అయితే డ్రైవర్ వేగంగా తన వాహాన్ని నడుపుతూ ఎదురుగా వెలుతున్న లారీని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో గుత్తావారిపాలెం గ్రామానికి చెందిన గుత్తా శేషయ్య (65)తో పాటు గనికపూడి గ్రామానికి చెందిన కాంద్రు సాయికీర్తి, అంచా సాయి లక్ష్మి, గద్దె అనూషలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వీరిని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుత్తా శేష్య మరణించాడు. ఈ మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ సోమేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెల్లెంపూడిలో సీపీఎం అభ్యర్థి జొన్నా ప్రచారం

తాడేపల్లి, ఏప్రిల్ 29: తాడేపల్లి మండలం మెల్లెంపూడిలో సోమవారం ఇండియా కూటమి సీపీఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు కాంగ్రెస్, సీపీఐ నేతలతో కలిసి ప్రచారం నిర్వహించారు. శివశంకర్ మాట్లాడుతూ మోడీని గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో డబ్బు సంచులతో బూర్జువా పార్టీలు రాజకీయం చేస్తున్నాయని వామపక్ష అభ్యర్థులలాగా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడగగలరా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా సీపీఐ నేత జంగాల అజయ్ కుమార్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో సీపీఎం నేతలు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, శివనాగరాణి, ఏపూరి గోపాలరావు, ముత్యాలరావు, సీపీఐ నేతలు చిన్ని తిరుపతయ్య, జాన్‌బాబు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే గిరిజనుల అభ్యున్నతి

- టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా రామకృష్ణ


కొర్రపాడు ఎస్టీ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న ఎస్టీ నాయకులు

మేడికొండూరు, ఏప్రిల్ 29: రాష్ట్రంలో గిరిజనులందరూ ఒక తాటిపైకి వచ్చారని, వైసీపీ మాయ మాటలు నమ్మే రోజులు పోయాయని టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా రామకృష్ణ చెప్పారు. మండలంలోని కొర్రపాడు ఎస్టీ కాలనీలో ఆయన సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ చంద్రబాబుతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో గిరిజన జాతి మనుగడ కోల్పోయే పరిస్థితికి దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో అమరావతే రాజధాని అంటూ చిలక పలు కులు పలికి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానులంటూ మూడుముక్కలాటలాడి అమరావతిని నాశనం చేసే కుట్రకు తెరలేపాడని విమర్శించారు. దీంతో రాజధానికి భూములిచ్చిన రైతులు రోడ్డు మీదకి వచ్చి నిరసనలు తెలిపే పరిస్థితి జగన్‌రెడ్డి తీసుకువచ్చాడని, రాజధాని ప్రాంతంలో అధిక సంఖ్యలో నివసిస్తున్నటువంటి గిరిజను లు, గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. చంద్రబాబునాయుడు డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో ఎస్సీ ఎస్టీల సంక్షేమ అభివృద్ధే ధ్యేయంగా పథకాలను రూపొందించి అమలు చేస్తే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పథకాలను నిర్దాక్షిణ్యంగా రద్దుచేసి దళిత గిరిజన ప్రజల నోట్లో మట్టి కొట్టే చర్యలు తీసుకున్నాడని రామకృష్ణ ఆరోపించారు. రానున్న ఎన్నికలలో ఎస్టీలకు మేలు జరగాలంటే గుం టూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, తాడి కొండ నియోజకవర్గ అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌ను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు మంగళగిరిలో బ్రాహ్మణి పర్యటన

మంగళగిరి, ఏప్రిల్ 29: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్ తరఫున నారా బ్రాహ్మణి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 9:30 గంటలకు మంగళగిరి ఆటోనగర్‌లోని విజయ పికిల్స్ వద్ద మహిళలతో సమావేశమవుతారు. 10:30 గంటలకు అందె రామస్వామి సిల్వర్స్ అండ్ జ్యూయలర్స్‌ను, 11గంటలకు పట్టణంలోని కనకదుర్గ చేనేత వస్త్ర దుకాణాన్ని సందర్శిస్తారు. సాయంత్రం 4 గంటలకు దుగ్గిరాలలో పసుపు రైతులతో భేటీ అవుతారు. అనంతరం 5 గంటలకు దుగ్గిరాలలోని జంపాల ఫంక్షన్ హాల్లో స్త్రీశక్తి లబ్ధిదారులు, మహిళా మిత్రలు, డ్వాక్రా మహిళలతో సమావేశమవుతారని పార్టీ వర్గాలు తెలిపాయి.

సంక్షేమ పథకాల చాంపియన్ తెలుగుదేశం పార్టీ

- నియోజకవర్గ కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న తెనాలి శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం, ఏప్రిల్ 29: రాష్ట్రంలో సంక్షేమ పథకాల చాంపియన్ తెలుగుదేశం పార్టీయేనని నియోజకవర్గ కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. సోమవారం ఫిరంగిపురంలోని షైన్ కోచింగ్ సెంటర్‌లో జరిగిన దళిత కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ రాకుంటే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని జగన్ అనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో మొదట రూ.30తో పింఛన్‌లు మొదలు పెట్టింది స్వర్గీయ ఎన్టీఆర్ అన్నారు. జగన్ పాలనలో దళిత కాలనీల్లో బడులు మూసివేసి దళిత బిడ్డలను విద్యకు దూరం చేశారన్నారు. అదేగాక 27 దళిత పథకాలను రద్దు చేసి వారికి ఉపాధి దొరక్కుండా అన్యాయం చేశారన్నారు. రాజధానిలో రైతు కూలీలకు పింఛన్ రూ.2500 ఇప్పించామని, ఈ పాటికి రూ.6వేలు ఇవ్వాల్సి ఉండగా జగన్ రూ.5వేలు ప్రకటించారన్నారు. పేదలకు ప్లాట్లు ఇచ్చి రాజధాని లేకుండా చేస్తే ఆ ప్లాట్లకు విలువ ఏమి ఉంటుందని? ఆయన ప్రశ్నించారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు మాట్లాడుతూ రాజధాని తుళ్ళూరులోనే ఉంటుందని చెప్పిన జగన్ మాట తప్పి మడమ తిప్పి మూడు రాజధానులని పాట పాడుతున్నారన్నారు. తాడికొండ రాష్ట్రంలోనే కీలకమైన రాజధాని నియోజకవర్గం అన్నారు. అది కమ్మరావతి అని దుష్ప్రచారం చేశారని, అమరావతిలో దళితులు 50శాతం ఉన్నారని, వారి భూములు కూడా 33 శాతంగా ఉన్నాయన్నారు. కేవలం దళితులున్న ఉన్న ప్రాంతం కాబట్టే కమ్మరావతి వంకతో దళితులకు వ్యతిరేకంగా రాజధాని లేకుండా అడ్డుకున్నారన్నారు. సబ్‌ప్లాన్ నిధులు నవరత్నాలకు మళ్ళించి అన్ని కులాలకు పప్పు బెల్లాల్లా పంపిణీ చేశారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో రాజధానిని నిర్మించే మొనగాడు చంద్రబాబు అని, కనుకనే చంద్రబాబును మళ్లీ సీఎంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఎమ్మెల్యేగా తెనాలి శ్రావణ్‌కుమార్‌ను, ఎంపీగా పెమ్మసాని చంద్రశేఖర్‌లను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తురకా ప్రసాదు, రాయపూడి ప్రసాదు, పచ్చల రత్నరాజు, మాజీ సర్పంచ్ జక్రయ్య, హృదయరాజు, పచ్చల రత్నరాజు, సీతారామరాజు, మేళం కోటేశ్వరరావు, సామేలు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అండగా తెలుగుదేశం పార్టీ

- ప్రత్యేక మానిఫెస్టో పెట్టిన చంద్రబాబు
- 50 ఏళ్లు నిండిన ప్రతి బీసీకి రూ.4వేలు పింఛన్
- జయహో బీసీ సదస్సులో నేతలు


జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న సదాశివరావు

తుళ్లూరు, ఏప్రిల్ 29: బీసీలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని బీసీ నేతలు స్పష్టం చేశారు. సోమవారం మండల పరిధిలోని పెద పరిమి గ్రామంలోని ఓ కల్యాణ మండపంలో జయహో బీసీ సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్థల సదాశివరావు హాజరయ్యారు. బీసీలకు ప్రత్యేక గుర్తింపును చంద్రబాబునాయుడు ఇచ్చాడన్నాడు, బీసీలకు రక్షణ చట్టం , 50 ఏళ్లు నిండిన ప్రతి బీసీకి నెలకు రూ.4వేలు పింఛన్ అందింటానికి మ్యానిఫెస్టోలో పొందుపరిచారన్నారు. బీసీలు అంటే జగన్‌రెడ్డికి చిన్న చూపు అని అన్నారు. ఎన్టీఆర్ టీడీపీ ఏర్పాటు చేసిన నాటి నుంచి బీసీలను సముచిత స్థానంలో ఉంచారన్నారు. అందుకే ప్రతి బీసీ టీడీపీకి ఓటు వేసి మన గౌరం కొనసాగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నీలాల కృష్ణారావు, మండల అధ్యక్షుడు గుమ్మా లక్ష్మీనారాయణ, నాయకులు కరుకుమల్లి శ్రీనివాసరావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూతలపాటి రామారావు, అన్ని గ్రామాల టీడీపీ బీసీ సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే ముస్లింలకు న్యాయం

- పేరేచర్లలో ముస్లిం నేతల ప్రచారం


పేరేచర్లలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ముస్లిం నాయకులు

మేడికొండూరు, ఏప్రిల్ 29: రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలకు న్యాయం చేసింది తెలుగుదేశం ప్రభుత్వమేనని పలువురు ముస్లిం నేతలు చెప్పారు. మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామంలో వారు సోమవారం ఇంటింటి ప్రచారం చేశారు. గుంటూరు పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఘని మాట్లాడుతూ తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన కుటుంబంలోని ప్రతి పిల్లవాడికి 15వేల చొప్పున ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి విద్యా దీవెన కింద కింద అందిస్తామని, ప్రతి కుటుంబానికి పది లక్షల రూపాయలు ఆరోగ్యశ్రీ వర్తింప చేస్తామని తెలిపారు. జరగబోయే ఎన్నికల్లో తెనాలి శ్రావణ్‌కుమార్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌లను ముస్లిం ఓటర్లు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో షేక్ మస్తాన్, షేక్ సుభాని, షేక్ మీరావాలి, షేక్ ఇదాయితుల్ల, షేక్ ఇస్మాయిల్. షేక్ హసన్ పొత్తూరు, షేక్ సయ్యద్ సుభాని, సయ్యద్ రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేస్తున్నారు

తాడికొండ, ఏప్రిల్ 29: మూడు రాజధానుల ప్రకటనతో రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేయడానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి పూనుకున్నారని రైతులు, మహిళలు తెలిపారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా, రాజధాని రైతులకు మద్దతుగా తాడికొండలో రైతులు, మహిళలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. నాయకులు ప్రజల కోసం పని చేయకుండా వారి సొంత పనులు చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ప్రాంగణ ఎంపికల్లో 26 మందికి ఉద్యోగాలు


ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కంపెనీ ప్రతినిధులు

తాడికొండ, ఏప్రిల్ 29: ప్రాంగణ ఎంపికల్లో కళాశాలకు చెందిన 26 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయని ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు తెలిపారు. సోమవారం లాం చలపతి ఫార్మసీ కళాశాలలో దివిస్ లాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఫార్మడీ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలను నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల నుంచి 90 మంది విద్యార్థులు ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారు. ముందుగా రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి 26 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. హైదరాబాద్, వైజాగ్‌లోని దివిస్ లాబరేటరీస్‌లో ఉద్యోగాలు చేయాల్సి ఉందని అన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు అభినందలు తెలియజేశారు.

తెనాలి బరిలో 13 మంది అభ్యర్థులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 29: తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ బరిలో 13మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం మిగిలిన అభ్యర్థుల వివరాలను సోమవారం సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రఖర్‌జైన్ ప్రకటించారు. అభ్యర్థులు వారి ఎన్నికల గుర్తు వివరాలు ఇలా ఉన్నాయి. బ్యాలెట్ వరుస క్రమంలో అన్నాబత్తుని శివకుమార్ (వైసీపీ-ఫ్యాన్), కారుమంచి సునీల్ సందీప్ (బీఎస్పీ-ఏనుగు), అమానుల్లాఖాన్ పఠాన్, (ఇండియన్ ముస్లిం లీగ్-నిచ్చెన), కొండూరు నాగరాజు (తెలుగు జనతా పార్టీ-యాపిల్), చుక్కపల్లి ప్రసాద్ (తెలుగు విజయం పార్టీ - ముగ్గురు అమ్మాయిలు, అబ్బాయి (నగ్రిక్)), జింకా మల్లికార్జునరావు (పిరమిడ్ పార్టీ-టెలివిజన్), నాదెండ్ల మనోహర్ (జనసేన పార్టీ - గ్లాసు), శావల గోపాల్ (సీపీఐ-లిబరేషన్- మూడు నక్షత్రాల జెండా), షేక్ బాషా (జైభారత్ నేషనల్ పార్టీ - బ్యాటరీ టార్చ్), గడే రామకృష్ణ (స్వతంత్ర-తోపుడు బండి), తమపాల నరేంద్ర (స్వతంత్ర-బక్కెట్), యంద్రపాటి అశోక్‌కుమార్ (స్వతంత్ర-విజిల్), కోట లక్ష్మణమూర్తి (స్వతంత్ర-గ్యాస్ సిలిండర్) ఉన్నారు.

నక్కా ఆనంద్ బాబు వాహనం తనిఖీ

తెనాలి రూరల్, ఏప్రిల్ 29: మాజీ మంత్రి ఉమ్మడి పార్టీల వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నక్కా ఆనంద్‌బాబు కారును ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేశారు. సోమవారం గుంటూరు నుంచి వేమూరు వెళుతున్న నక్కా ఆనంద్‌బాబు కారును తెనాలి మార్కెట్ ప్రాంతంలో ఫ్లైయింగ్‌స్క్వాడ్ కారును ఆపి ఎన్నికల నిబంధనల ప్రకారం తనిఖీలు జరిపారు. అధికారులకు నక్కా ఆనంద్‌బాబు పూర్తిగా సహకరించారు. కారులో నిబంధనలకు విరుద్ధంగా ఏమీ లభించకపోవడంతో ఆయనను విడిచిపెట్టారు. అదేవిధంగా జనసేన పార్టీ స్పోక్‌పర్సన్ రాయపాటి అరుణ కారును కూడా ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు జరిపగా నిబంధనల ప్రకారం ఉండటంతో ఆమె కారును విడిచిపెట్టారు.


కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ రామారావు, దుర్గ, వెంకటేశ్వరి, దుర్గాప్రసాద్ తదితరులు

రజక ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయండి

● టీడీపీ ఎమ్మెల్సీ రామారావు

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 25: పట్టణంలో మే రెండో తేదీన జరిగే రజక ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని టీడీపీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు పిలుపు ఇచ్చారు. స్థానిక కొత్తపేటలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం రజక కమ్యూనిటీ సభ్యుల ఆధ్వర్యంలో మే రెండవ తేదీన జరిగే రజక ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయండి అని కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా టీడీపీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు పాల్గొని కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేసే నాయకుడు చంద్రబాబునాయుడు అన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకొని తద్వారా నవ్యాంధ్రప్రదేశ్‌ను నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం రామారావును రజక సంఘీయులు దుశ్శాలవాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి దుర్గాప్రసాద్, శివరామూర్తి, పణిదపు దుర్గ, మునిపల్లి రామకృష్ణ, పెసర్లంక శ్రీను, సీచ్ విజయ్, చట్టు వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో ప్రజలకు మేలు

● ఎన్నికల ప్రచారంలో నాదెండ్ల మనోహరం

తెనాలి రూరల్, ఏప్రిల్ 29: మరికొద్ది రోజుల్లో ప్రజలందరి ఆశీస్సులతో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పాలన చేపట్టనున్నదని, దీంతో ప్రజలకు మేలు జరగనున్నదని జనసేన పీఏసీ ఛైర్మన్ తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ సతీమణి డాక్టర్ మనోహరం అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మనోహరం ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి పట్టణంలోని 13వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా మనోహరం గడపగడపకు తిరుగుతూ ప్రజల యోగక్షేమాలను విచారించి కూటమి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న మనోహర్‌ను గాజు గ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓటువేసి ఆశీర్వదించాలని మనోహరం ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. వార్డు పర్యటనకు వచ్చిన మనోహరాన్ని వీర మహిళలు, తెలుగు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. పెద్దసంఖ్యలో ఉమ్మడి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


వృద్ధురాలిని అప్యాయంగా పలకరిస్తున్న నాదెండ్ల మనోహరం


వైసీపీని వీడి టీడీపీలోకి వస్తున్న వారికి పార్టీ కండువాలు కప్పి అహ్వానిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

జగన్ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఏప్రిల్ 29: రానున్న ఎన్నికల్లో రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసి ప్రజల జీవన విధానాన్ని దెబ్బతీసిన జగన్ ప్రభుత్వాన్ని సాగనంపి నవ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చదిద్దగలిగే విజనరీ కలిగిన ఉమ్మడి పార్టీల సీఎం అభ్యర్థి నారా చంద్రబాబును గెలిపించుకుందామని మాజీమంత్రి టీడీపీ తెనాలి నియోజవర్గ ఇన్‌చార్జ్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని కొత్తపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు వైసీపీ పార్టీని వీడి టీడీపీలోకి చేరారు. వారిని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పి రాష్ట్ర ప్రగతికి చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నరేంద్రమోడీ వంటి నాయకుల అవసరం ఎంతైనా ఉందని ఉమ్మడి పార్టీల అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పింఛను నగదును బ్యాంకు ఖాతాల్లో జమచేస్తాం

● ఎంపీడీవో విష్ణుప్రసాద్

కొల్లిపర, ఏప్రిల్ 29: మే నెలలో పంపిణీ చేయనున్న పెన్షన్‌దారులకు బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కానున్నట్లు ఎంపీడీవో విష్ణుప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 9వేల 909 పెన్షన్‌లకు రూ.2కోట్ల 88లక్షల 88వేల 500లను పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఇందులో 7వేల 214మంది పెన్షన్‌దారులకు రూ.2కోట్ల 16లక్షల 46వేలు బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నట్లు తెలిపారు. బ్యాంకు ఖాతాలు లేనివారు 2వేల695 మందికి రూ.72లక్షల42వేల500లు పంపిణీ చేయాల్సి ఉందని వీరందరికి ప్రభుత్వ ఉద్యోగులు ఇంటింటికి తిరిగి పంపిణీ చేయనున్నట్లు తెలియజేశారు. పెన్షన్‌దారులు ఎవరూ సచివాలయాలకు రానవసరం లేదన్నారు. బ్యాంకు ఖాతాలో ఎవరికైనా పెన్షన్ నగదు జమ కాకపోతే సంబంధిత కార్యదర్శి తెలియజేయాలన్నారు. పెన్షన్‌దారుల వివరాలను సచివాలయాల్లో జాబితాను ఉంచినట్లు తెలిపారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు, జూనియర్ అసిస్టెంట్ సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 29: స్థానిక నందులపేటలోని శ్రీషిరిడి సాయి వృద్ధాశ్రమంలో సోమవారం శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం వారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీఎస్‌వీ యోగా సభ్యులు వల్లూరి నీలిమ నాల్గో వర్థంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ్రమంలో వృద్ధులకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో యోగా సేవా కేంద్రం కన్వీనర్ ముద్దాబత్తుని రమణయ్య, కె.శ్రీనివాసరావు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

సంక్షేమం పేరుతో కోట్లాది రూపాయల దోపిడీ

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఏప్రిల్ 29: పేదల సంక్షేమం పేరుతో కోటాను కోట్ల దోపిడీకి వైసీపీ నాయకులు పాల్పడ్డారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. సోమవారం పట్టణంలోని చెంచుపేట ఆర్ కన్వెన్షన్ హాల్లో ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ల సమక్షంలో పట్టణంలోని 31వ వార్డు వైసీపీ పార్టీకి చెందిన కౌన్సిలర్ మానసారెడ్డి, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ వి. ఆదిలక్ష్మిలు జనసేనలో చేరారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు చేసిన వాగ్దానాలను మరిచి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన వైసీపీ పాపం పండిందని.. రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యరుల విజయంతో ఆ పార్టీ పతనం తప్పదన్నారు. తెనాలిలో లోకల్ ఎమ్మెల్యేనంటూ ప్రచారం చేసుకునే శివకుమార్ పట్టణాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. ప్రజలకు కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేకపోయారని ఎద్దేవా చేశారు. మాటల్లో మాత్రం సంక్షేమం, అభివృద్ధి అంటూ ప్రజలను మాయచేసే ప్రయత్నంమాత్రం మానడంలేదని ఆరోపించారు. నాలుగులైన్లరోడ్డు, డ్రైనేజ్ వ్యవస్థ, ఇంటింటికి కుళాయి కనెక్షన్ వంటివాటిపై చేసిందేమీ లేదన్నారు. వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి పేరుతో విగ్రహాలు తప్ప రైతులకు ఒరిగిందేమీలేదని విమర్శించారు. తెనాలి నుంచి మంగళగిరికి నాలుగులైన్ల రహదారికి నిధులు తెచ్చానని త్వరలోనే ఆ రోడ్డుపని ప్రారంభించి తన పనితనాన్ని ప్రజలకు చూపుతానని చెప్పి ఆ రోడ్డు గుంతలు పూడ్చేందుకు తట్టెడు మట్టి వేసిన పాపాన కూడా పోలేదని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే ఐదేళ్లలో చేసిన పనులను ప్రజలకు చెప్పి ఓట్లు అడగాలని ఆలపాటి డిమాండ్ చేశారు. వైసీపీ కౌన్సిలర్‌గా గెలిచిన మానసారెడ్డి తనపై ఎంతో నమ్మకంతో ఉన్న వార్డు ప్రజలకు మంచి చేయలేకపోయాననే బాధతో, ప్రజలకు మంచి చేయలేని పార్టీలో కొనసాగడం సమంజసం కాదని పార్టీ మారటం హర్షణీయం అన్నారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అందరూ ఉమ్మడి పార్టీ నాయకత్వాన్ని బలపరిచి రాష్ట్రాన్ని, తెనాలి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకుందామన్నారు. పార్టీలకు అతీతంగా అందరూ ఉమ్మడి పార్టీకి మద్దతు తెలపాలని ఆయన కోరారు. వైసీపీని వీడి జనసేనలో చేరిన కౌన్సిలర్ మానసారెడ్డి, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ ఆదిలక్ష్మిలను మనోహర్ ప్రత్యేకంగా అభినందించారు. తొలుత నాదెండ్ల మనోహర్‌ను, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఉమ్మడి పార్టీ నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. గాదె వెంకటేశ్వరరావు, బోయపాటి అరుణ, పసుపులేటి త్రిమూర్తి, పలువురు ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

ప్రజలందరి విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాం: మనోహర్

తెనాలి రూరల్, ఏప్రిల్ 29: కూటమి పార్టీల అభ్యర్థులతో ప్రాంతానికి, ప్రజలకు మంచి జరుగుతుందని ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ఉమ్మడి పార్టీల తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. నాదెండ్ల మనోహర్ తలపెట్టిన తెలుగుజనచైతన్యపాదయాత్రలో భాగంగా సోమవారం కూటమి పార్టీల శ్రేణులతో కలిసి నాదెండ్ల మనోహర్ పట్టణంలోని 31,32వ వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు మనోహర్‌కు ఘన స్వాగతం పలికారు. తెలుగుమహిళలు మనోహర్‌కు హారతులు పట్టి ప్రచార కార్యక్రమాన్ని ముందుకు నడిపారు. వార్డులో ప్రజల యోగక్షేమాలు విచారిస్తూ మనోహర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మనోహర్‌ను పలువురు వార్డులోని నివాసితులు ఉమ్మడి ప్రభుత్వంతోనే పేదలకు మంచి జరుగుతుందని మీరు అధికారంలోకి రావాలంటూ వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మనోహర్ మాట్లాడుతూ తమపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెనాలి ప్రాంతంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు ప్రశాంత వాతావరణం అందిస్తానన్నారు. తమకు మద్దతు తెలుపుతున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కూటమి పార్టీల పాలన ప్రారంభమయ్యాక అందించే సంక్షేమం, అభివృద్ధిపై ప్రజలకు వివరిస్తూ మనోహర్ పాదయాత్రగా ముందుకు సాగారు. పలువురు ఉమ్మడి పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.


మనోహర్‌కు మద్దతు తెలుపుతున్న వృద్ధురాలు

పెమ్మసాని, నాదెండ్ల గెలుపుతోనే అభివృద్ధి

● ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకుడు వీరవల్లి మురళి

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 29: రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థులైన ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ల గెలుపుతోనే తెనాలి ప్రాంతంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని టీడీపీ నాయకుడు, గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి అన్నారు. మండల పరిధిలోని అంగలకుదురులో సోమవారం జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, టీడీపీ నాయకుడు, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి కలసి గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఒక్కచాన్స్ అంటూ అధికారం చేపట్టిన జగన్ ఈ ఐదేళ్ళ పాలనలో రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టాడని విమర్శించారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకుండా చేశారని, మద్యపాన నిషేధం చేస్తానని, కల్తీ మద్యాన్ని ఏరులైపారిస్తూ ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు, యువతకు మంచి జరగాలన్నా, సుపరిపాలన కావాలన్నా నిబద్ధత, విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడుని మరలా ముఖ్యమంత్రిగా ప్రజలు ఎన్నుకోవాలని కోరారు. జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఉమ్మడి పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామని పిలిపునిచ్చారు. ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కు సైకిల్ గుర్తుపైన, ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కి గాజు గ్లాసు గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరావు, గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, వార్డు మెంబర్లు జాలాది దుర్గాభవాని, చెన్నుపాటి తేజస్వి, ఐనంపూడి పార్వతి, ఆలపాటి వెంకట్రామయ్య, కల్లూరి శ్రీనివాసరావు, బడుగు రాంబాబు, ఉరిటి శ్రీనివాసరావు, ఆర్ వెంకటేశ్వరావు, పరంధామయ్య, వీరశేఖర్, ఉమ్మడి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న టీడీపీ నాయకుడు వీరవల్లి మురళి, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి అరుణ, ఉపసర్పంచ్ నాగభూషణం తదితరులు

వైసీపీ అరాచకాలతో ప్రజలు విసిగిపోయారు

● మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 29: వైసీపీ అరాచకాలు, దోపిడీలతో ప్రజలు విసిగిపోయి టీడీపీవైపు వస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని పెదపాలెం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు సోమవారం ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పెదపాలెం సొసైటీ అధ్యక్షుడు నూతలపాటి మనోహర్ ప్రసాద్, బోడపాటి మధుసూధనరావు, దొప్పలపూడి శ్రీనివాసరావు, తలశిల దేవేంద్ర, బోడపాటి రవీంద్ర, నూతి వెంకటేశ్వర్లు, వేల్పూరి సాంబశివరావు, కేశవరావు, పరిశుద్ధరావు, నాగేశ్వరరావు, గుంటుపల్లి కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పుట్లూరి శ్రీరామయ్య, మైలా బాబురావు, జూటు బోలయ్య, తలపల వెంకట సుబ్బయ్య తదితరులు కుటుంబాలతో సహా తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి నరేంద్రకుమార్ ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ పొన్నూరు, చేబ్రోలు అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు, మైలా రామరాజు, సముద్రాల ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన పెదపాలెం వైసీపీ నాయకులు

పెదకాకానిలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

పెదకాకాని, ఏప్రిల్ 29: మండల కేంద్రమైన పెదకాకానిలో పెదకాకాని గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు సోమవారం పొన్నూరు టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరిని కండువా కప్పి పార్టీలోకి నరేంద్ర కుమార్ ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దానబోయిన మహేష్ బాబు, ఆరుదల చింతయ్య, చింకా రాజగోపాల్, ఆరుదల కృష్ణ, దానబోయిన గోపీచంద్, దారం బాజీబాబు, తోట కిరణ్, దానబోయిన భార్గవ్ రావు, దానబోయిన వెంకటేష్, దానబోయిన బాలు, యల్లావుల ఈశ్వర్, దానబోయిన భాస్కర్, ఆరుదల భాను ప్రకాష్, దానబోయిన వెంకయ్య, దానబోయిన అరవింద్ లు చేరారు. కార్యక్రమంలో పెదకాకాని మండల పార్టీ నాయకులు దర్శి భాస్కరరావు, కాజా అంకమ్మరావు, దానబోయిన శ్రీనివాస్, దానబోయిన చింతయ్య, తోట నరయ్య తదితరులు, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి పోసాని తమ్ముడు కొడుకు

పెదకాకాని, ఏప్రిల్ 29: రాష్ట్రంలో వైఎస్ఆర్ సీపీకి భారీ షాక్ తగిలింది.... ఆ పార్టీకి చెందిన సినీ నటుడు, రచయిత పోసాని కృష్ణ మురళి తమ్ముడు కొడుకు పోసాని యోగేంద్రనాథ్ తెలుగుదేశం పార్టీలో చేరారు. సోమవారం టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపి లోకి జాయిన్ అయ్యారు. చంద్రబాబు నాయుడు కండువా కప్పి పోసాని యోగేంద్రనాద్ ను పార్టీలోకి ఆహ్వానించారు. సందర్భంగా యోగేంద్ర నాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు రావాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమన్నారు. ఆయన గెలుపు కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు.


చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న పోసాని యోగేంద్రనాథ్

పని చేసే జిల్లా కేంద్రంలోనే ఇతర జిల్లాల ఓటర్ల పోస్టల్ బ్యాలెట్

● ఉద్యోగులు, ఉపాధ్యాయులు పరేషాన్ ● మండు వేసవిలో సరికొత్త నిబంధనపై విమర్శలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 29 : ఉద్యోగులు, ఉపాధ్యాయులు తాము పని చేసే జిల్లాల్లోనే కాకుండా మరో జిల్లాలో ఓటు హక్కు కలిగి ఉంటే వారంతా పని చేస్తున్న జిల్లా కేంద్రంలో ఓటు వేయాల్సి ఉంటుంది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పంపిన రెండో విడత శిక్షణ తరగతుల్లో ఈ అంశం పేర్కొన్నారు. గతంలో ఏ నియోజకవర్గంలో ఓటు హక్కు ఉంటే అక్కడే దరఖాస్తు చేస్తే ఓటు హక్కు కల్పించేవారు. ఈ పర్యాయం నిబంధనలు మార్చడంతో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండువేసవిలో దూర ప్రాంతానికి వెళ్లి ఓటు వేయాల్సి రావడం ప్రహసనం అవుతుందని వాపోతున్నారు. మే 7న ఇతర జిల్లాల ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ పని చేసే జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసే ఫెసిలిటేషన్ సెంటర్‌లో వినియోగించుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. అదే జిల్లాల్లో పని చేసే ఉద్యోగులకు అదే జిల్లాలో ఓటు ఉంటే ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో 5, 6, 7 తేదీల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు గావిస్తున్నారు. ఎక్కడ ఓటు హక్కు ఉన్నప్పటికీ పని చేస్తున్న నియోజకవర్గంలోనే దరఖాస్తు తీసుకుని ఇతర జిల్లాల దరఖాస్తులను జిల్లా కేంద్రానికి పంపారు. అక్కడ నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్లు ఓటు వేయించి మళ్లీ పోస్టల్ బ్యాలెట్లను నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులకు పంపే విధానాన్ని ఎన్నికల కమిషన్ చేపట్టింది. ఇదంతా పని పెంచుకోవడమే తప్పా మరొకటి కాదని చెబుతున్నారు. తగిన సమయం ఉన్నందున మండు వేసవిని దృష్టిలో ఉంచుకుని ఓటు ఉన్న నియోజకవర్గాలకు తమ పోస్టల్ బ్యాలెట్లను పంపి ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పొన్నూరు అసెంబ్లీ బరిలో 14 మంది

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 29: పొన్నూరు శాసన సభ ఎన్నికల బరిలో 14మంది పోటీలో నిలిచారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది, బరిలో ఉన్న ఒక్కరు కూడా ఉపసంహరించకపోవటంతో 14మంది పోటీలో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి 7వసారి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పోటీ చేస్తున్నారు. వైసీపీ నుంచి అంబటి మురళీకృష్ణ, కాంగ్రెస్ నుంచి జక్కా రవీంద్రనాథ్, బీఎస్పీ నుంచి యాతాటి కిషోర్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి జొన్నాదుల రమేష్, జై భారత్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి వరికుంట రోశయ్య, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి షేక్ మస్తాన్ వలీ, జై భీమ్‌భారత్ పార్టీ నుంచి మొద్దు సాంబశివరావు, రిఫామ్స్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి అక్కిదాసు జోసఫ్, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ నుంచి గోనా రాబర్ట్, వీసీకే పార్టీ నుంచి కూరపాటి మాణిక్యారావు, ఇండియన్ లేబర్ పార్టీ నుంచి గాలింకి జాన్‌శామ్యూల్, స్వతంత్ర అభ్యర్థులుగా దొప్పలపూడి వాసుదేవరావు, అడపా అక్కయ్య పోటీలో ఉన్నారు.


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్ర కుమార్

వృద్ధుల పింఛను రూ.4 వేలకు పెంపు: ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఏప్రిల్ 29: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వృద్ధులకు ఇచ్చే పింఛనును రూ.4వేలకు పెంచనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. చేబ్రోలులో సోమవారం పలు ప్రాంతాలో ఆత్మీయ సమావేశాలు జరిగాయి. ఆయా ప్రాంత వాసులు నరేంద్ర కుమార్‌తో సమావేశమై తాము ఎదుర్కొంటున్న సమస్యలు తెలియజేశారు. అనంతరం నరేంద్రకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మ్యానిఫెస్టో సూపర్ 6 పథకాల గురించి వివరించారు. వికలాంగులకు రూ.6వేల పింఛను, చంద్రన్న బీమా పునరుద్ధరణ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు వంటి పథకాలను అమలు చేయనున్నట్లు చెప్పారు. బీసీలకు 50సంవత్సరాలకే పెన్షన్, చట్టసభలలో రిజర్వేషన్, ప్రత్యేక రక్షణ చట్టం వంటి చట్టాలను అమలు చేస్తామన్నారు. రానున్న ఎన్నికలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చేబ్రోలు కొత్తరెడ్డిపాలెంలో పలువురు యువకులు సోమవారం ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. గూడూరు ప్రతాప్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు.


5వ వార్డులో పర్యటిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

ముస్లింలు జగన్ మాయంలో పడవద్దు : టీడీపీ

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 29: ముస్లింలు జగన్ మాయంలో పడకుండా తస్మాత్ జాగ్రతగా ఉండాలని టీడీపీ పట్టణ అధికార ప్రతినిధి షేక్ బాజిసాహెబ్ అన్నారు. సోమవారం పట్టణంలోని 4, 5 వార్డులో టీడీపీ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో ఇంటింటి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మైనార్టీ నాయకులు మాట్లాడుతూ ముస్లింలకు వ్యతిరేఖంగా ఉన్న ఎనార్సీ, త్రిపుల్ తలాక్, సీఏఏ, యూనిఫాం సివిల్ కోడ్ వంటి చట్టాలను బీజేపీతో అంటకాగి చట్టసభల్లో జగన్ సంపూర్ణ మద్దతు అందించటం వల్లనే అమలులోకి వచ్చాయని గుర్తుచేశారు. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్‌ను తీసేయాలని కోర్టుకు వెళ్లింది వైసీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. హిజాబ్‌పై దక్షిణాది రాష్ట్రాలు, ముఖ్యమంత్రులు వ్యతిరేకించినా జగన్ మాత్రం మారుమాట్లాడలేదని ఆరోపించారు. ముస్లింలపై జరుగుతున్న దాడులను ఏనాడు జగన్‌రెడ్డి ఖండించలేదని ఆరోపించారు. 30 వేల కోట్ల విలువ చేసే వక్ఫ్ భూములను జగన్ సహచరులు కబ్జా చేశారని ఆరోపించారు. ముస్లింల కోసం ఒక కొత్త పథకాన్ని పెట్టకపోయినా చంద్రబాబు అమలు చేసిన 10సంక్షేమ పథకాలను రద్దు చేశారని ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో 107 ముస్లిం కుటుంబాలపై దాడులు జరగగా 16మంది మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలు, దాడులపై అప్రమత్తంగా ఉండి రానున్న ఎన్నికలో తగురీతిలలో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, అహ్మద్ కాన్, కరిముల్లా బాజి, జానీ బేగ్, జనసేన పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా తదితరులతో పాటు రెండు పార్టీలకు చెందిన ముస్లిం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మే 4న తెనాలిలో సినీ దర్శకుల దినోత్సవం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 29: ఏపీ మా ఆధ్వర్యంలో మే 4న సినీ దర్శకుల దినోత్సవం నిర్వహిస్తున్నామని మా ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. సుల్తానాబాద్ రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో సోమవారం దినోత్సవ వివరాలను విలేకరులకు వెల్లడించారు. దివంగత దర్శకుడు దాసరి నారాయణరావు జన్మదినోత్సవం సందర్భంగా రత్నాఫార్చ్యూన్ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దాసరి స్మారక పురస్కారాన్ని జాతీయ అవార్డు గ్రహీత సి.ఉమామహేశ్వరరావుకు, దర్శకుడు పారేపల్లి భరత్‌కు దాసరి పురస్కారం అందిస్తామన్నారు. సూపర్‌స్టార్ కృష్ణ పురస్కారాన్ని దర్శకుడు బోయపాటి కామేశ్వరరావుకు ఏపీ దర్శకులు అచ్చెన శ్రీనివాస్‌యాదవ్, ఓంసాయి, సోమసుందరం, డాడీ శ్రీనివాస్, చలువాది శివప్రసాద్, శివశ్రీ ముఖర్జీలను మా ఏపీ సత్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ ఛైర్మన్ కుమార్ పంప్స్ ఎండి కొత్త సుబ్రహ్మణ్యం, నన్నపనేని సుధాకర్, వేమూరి విజయభాస్కర్, ప్రసాద్, రత్నాకర్, ఇంటూరి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపరలో టీడీపీ నాయకుల ప్రచారం

కొల్లిపర, ఏప్రిల్ 29: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో టీడీపీ, జనసేన నాయకులు ఉమ్మడి అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు గుడిబండి గోవర్ధనరెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, టీడీపీ వెంకటరెడ్డి, కంచర్ల అమృతరాజు, భీమవరపు లంకకోటిరెడ్డి, భీమవరపు వేణుగోపాల్ రెడ్డి, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి, షేక్ రఫీ, కోమటి శ్రీనివాసరావు, ఆళ్ళ వెంకటరెడ్డి, అరిమండ వెంకటరెడ్డి, వల్లభాపురం బసవయ్య, భీమవరపు కమల, గుడిబండి శివబసవమ్మ, భీమవరపు సునీత తదితరులు పాల్గొన్నారు.

నేడు పెమ్మసాని వంటి నాయకులు అవసరం

● నామినేషన్ ఉపసంహరించుకున్న బోయపాటి

పెదకాకాని, ఏప్రిల్ 29: నేటి రాజకీయాల్లో ఉన్నత విలువలు కలిగిన పెమ్మసాని వంటి నాయకులు యువతకు, దేశ భవిష్యత్తుకు ఎంతో అవసరం అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర ఖాదీబోర్డు మాజీ డైరెక్టర్ బోయపాటి వెంకటరమణ స్పష్టం చేశారు. గుంటూరును అభివృద్ధి చేయాలని వచ్చిన ఆయనకు మద్దతుగా నా నామినేషన్ ఉపసంహరించుకుంటున్నాను అని తెలిపారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేస్తున్న వెంకటరమణ రానున్న సార్వత్రిక ఎన్నికలలో పోటీచేసే ఆలోచనతో నామినేషన్‌వేసిన విషయం తెలిసిందే. రానున్న నియోజకవర్గాల పునర్విభజనలో పూర్వ పెదకాకాని నియోజకవర్గాన్ని తిరిగి పునరుద్ధరించాలనే డిమాండ్‌ను రాజకీయపక్షాల దృష్టికి తీసుకెళ్ళేందుకు గుంటూరు లోక్‌సభ స్థానానికి స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినట్లు బోయపాటి వెంకటరమణ తెలిపారు. పెమ్మసాని వంటి నాయకులకు మద్దతుగా నిల్స్తే రాజధాని ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే నమ్మకం ఉందన్నారు. గుంటూరులోని స్థానిక పార్లమెంటరీ కార్యాలయంలో డాక్టర్ చంద్రశేఖర్‌ను సోమవారం కలిసిన బోయపాటి వెంకటరమణ తన మద్దతును ప్రకటిస్తూ, త్వరలో జరగబోయే ఎన్నికల్లో పూర్తి మద్దతు అందిస్తానని, ప్రభుత్వ వ్యతిరేక ఒక్క ఓటును కూడా చీలనివ్వనని ఆయనకు తెలియజేశారు. అనంతరం గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే నాయకులకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని, రాష్ట్రంలోని అరాచక పాలనను అంతమొందించేందుకు ప్రతి ఒక్కరు చేయి కలపాలన్నారు.